www.jagritiweekly.com

సంపుటి : 74 సంచిక : 40 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ శ్రావణ శుద్ధ చవితి

01-07 ఆగస్ట్ 2022

వెల : ₹15/-



## రాష్ట్రపతి భవన్‌లో

# సంథాల్ హూల్!

ఒక గిరిజన మహిళ భారత రాష్ట్రపతి పీఠం అధిరోహించారు. ఆమె ద్రౌపది ముర్ము

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

74 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

74 వసంతాల జాగృతి 1948 -2021

జాగృతి

జాతీయ తెలుగు వారపత్రిక

# కార్టూన్‌ల పోటీ



**జొన్నలగడ్డ లక్ష్మీనారాయణ ఆర్థిక సహకారంతో జాగృతి తెలుగు వారపత్రిక 'కార్టూన్‌ల పోటీ-2022' నిర్వహిస్తున్నది.**

యువ, కొత్త, సమర్థులైన కార్టూనిస్టులను;
సమాజంలో ఆరోగ్యకరమైన హాస్యాన్ని పెంపొందించే కార్టూన్‌లను ప్రోత్సహించడమే ఈ పోటీ ముఖ్య ఉద్దేశం.

- కార్టూన్‌లు ఎవరినీ, ఏ వర్గాన్నీ, భారతీయ కుటుంబ విలువలు, మహిళ, సంస్కృతీ సంప్రదాయాలను కించపరచేలా ఉండరాదు.
- అందరికీ చక్కని హాస్యాన్ని పంచేవిగా ఉండాలి.
- ఒక కార్టూనిస్టు మూడు కార్టూన్‌లకు మించి పంపరాదు.
- కార్టూన్‌లు 8(H) X 10(W) (సెంటిమీటర్లలో) సైజులోనే వేసి, స్కాన్ చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి.
- జాగృతి తెలుగు వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500027కు పోస్టు ద్వారా కూడా పంపొచ్చు.

ప్రథమ బహుమతి : రూ.5000/-

ద్వితీయ బహుమతి : రూ.3000/-

తృతీయ బహుమతి : రూ.2000/-

రూ.500 చొప్పున పది ప్రోత్సాహక బహుమతులు



**కార్టూన్‌లు చేరవలసిన చివరి తేది : ఆగస్ట్ 08, 2022.**

# నవయుగభారతి 'అక్షయపాత్ర' పథకానికి పోషకులుగా ముందుకురండి

# తెలుగుపాఠకులకు ఉత్తమ సాహిత్యాన్ని అందించటంలో భాగస్వాములు కండి

కొన్ని పుస్తకాలు చిన్నవి కావచ్చు. కాని చదివిన వారిలో మంచి ఆలోచనలను ప్రవేశపెట్టి వారి జీవితాలను సక్రమపథంలో నడిపించగలవు. అటువంటి పుస్తకములు ఎక్కువ సంఖ్యలో ముద్రితమై, తక్కువధరకు నిరంతరంగా లభిస్తూ ఉండాలి. ఇది జరగాలంటే మార్కెట్ ఆర్థికసూత్రాలకు అతీతంగా ఆ పుస్తకాల ముద్రణకు ప్రత్యేక పోషణ ఉండాలి. ఎంపిక చేయబడిన పుస్తకములకు దాదాపుగా 50% శాతం వ్యయాన్ని తిరిగితీసుకొనని పెట్టుబడిగా సమకూర్చాలని, తద్వారా పుస్తకం వెలను 30 శాతంవరకు తగ్గించాలని నవయుగభారతి ఆలోచిస్తున్నది.

కొన్ని పుస్తకాలు బృహత్తరమైనవి. తగినంత సంఖ్యలో అమ్ముడుపోగలవని నమ్మకం కలిగితే వాటిని అనువదింపజేయటమూ, ముద్రించి మార్కెట్లోకి తీసికొనిరావటమూ సాధ్యమవుతుంది. ఆ నమ్మకం లేకపోతే ఆ పుస్తకాలను తెలుగులో ప్రచురింపజేయటం దుష్కరమవుతుంది. కాబట్టి ఎంత బరువైన పుస్తకమైనా, కొనేందుకు తగినంత సంఖ్యలో సిద్ధంగా ఉన్నవారిని సమకూర్చుకోవాలనీ ఆలోచిస్తున్నది. **ఈ రెండు ఆశయాల సమన్వయరూపం ఈ అక్షయపాత్ర పథకం.**

**ప్రతి తెలుగు కుటుంబం నుండి కనీసం ఒక్కరైనా ముందుకు రావాలని మా విన్నపం. మీరు చేయవలసింది. 10,116 రూ.లు పోషకసభ్యత్వంగా చెక్కు ద్వారాగానీ, బ్యాంకు (ఆన్‌లైన్) ద్వారాగానీ చెల్లించటం. మీ ఫోటోను, చిరునామా, ఫోను నెంబరు మొదలైన వివరాలను తెలియజేయటం. దీనికి నవయుగభారతినుండి రశీదు పంపబడుతుంది. పది సంవత్సరములలోగా 15 వేల రూపాయల వెలగల్గిన క్రొత్తగా ప్రచురింపబడే పుస్తకాలు అనేక విడతలుగా 3 లేదా 4 నెలల వ్యవధితో రిజిష్టరుపోస్టులో మీకు పంపబడుతాయి.**

అదనంగా ప్రతులు కావాలని మీరు కోరుకుంటే 25% తగ్గింపుతో మీకు అందజేయబడతాయి (రవాణావ్యయం మీరే భరించవలసి ఉంటుంది). ఒకవేళ 15వేల రూపాయల వెలగల కొత్త పుస్తకాల ప్రచురణ పదిసంవత్సరాలకంటే ముందుగానే పూర్తయి, అవి మీకు అందజేయటం జరిగినపుడు మీ పోషక సభ్యత్వాన్ని నవీకరించుకోవలసిందిగా కోరగలము.

ఈ ఆర్థిక సంవత్సరంలో కనీసంగా వేయిమందిని పోషక సభ్యులుగా చేర్చుకోగలమన్న విశ్వాసంతో ఈ విజ్ఞప్తి వెలువరిస్తున్నాం. మధ్యలో విరమించుకోవటం ఉండదని, మీకు ఏవిధమైన నష్టం కలగనిరీతిలో, మీ సంతృప్తిని చూరగొనేలా ఉత్తమగ్రంథాలను వెంటవెంటనే ప్రచురించి అందీయగలమని హామీ ఇస్తున్నాము.

**ఇప్పటివరకు పోషకసదస్యులుగా చేరనివారు ఇప్పుడైనా త్వరపడండి. ఎందుకంటే ఇది మీ విజ్ఞతకు గీటురాయి. మీరు సభ్యులు అయితేనే మరో పదిమందికి చెప్పగలరు.**

## రండి ! భారతిసేవలో కదలిరండి !!

| డా. వడ్డి విజయసారథి | బాలేంద్ర పొట్లూరి | నేతి క్షీరసాగర్ | కె. రామకృష్ణ |
|---|---|---|---|
| సమన్వయకర్త-సంపాదకుడు | అధ్యక్షుడు | కార్యదర్శి | కోశాధికారి |
| 9493173187 | 9885978090 | 9440543725 | 9246534799 |

చెక్కులు పంపడానికి, ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా :
నవయుగభారతి, జాగృతి భవనం,
3-4-288/4/1, లింగంపల్లి, కాచీగూడ, హైదరాబాద్ - 27
nksagar@ymail.com

సేవింగ్స్ బ్యాంకు అకౌంట్ నెం : 0418408438
IFSC Code : IDIB000B052,
Indian Bank, Barakathpura, Hyderabad
చెక్కులు/నగదుబదిలీ 'నవయుగభారతి' పేరున పంపాలి.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013**

## జాగృతి చందా - సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై Jagriti Prakashan Trust అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్లు : సిహెచ్. కుమార్, ఎం. అనిత

రాష్ట్రపతి పదవికి అధికార పార్టీ నుంచి అభ్యర్థిని ఎంపిక చేసిన ఘటనలే రైసినా హిల్స్ చరిత్రలో ఎక్కువ. ఆ పదవి మీద ఓ రబ్బర్ స్టాంప్ అంటూ ముద్ర వేయడం వెకిలితనమే తప్ప పూర్తి వాస్తవం కాదు. ఆ స్థానాన్ని అత్యున్నత రాజ్యాంగ పదవిగా, చేపట్టిన వారిని ప్రథమ పౌరునిగా గౌరవించవలసిందే. అలాకాక రాష్ట్రపతులందరినీ ఒకే గాట కట్టడం వికృత చేష్ట. ప్రథమ రాష్ట్రపతి రాజెన్‌బాబు, ప్రథమ ప్రధాని నెహ్రూ మధ్య పరోక్ష యుద్ధం సాగింది. 1969లో ఆత్మ ప్రబోధం పేరుతో కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థి నీలం సంజీవరెడ్డిని నాటి ప్రధాని ఇందిరాగాంధీయే ఓడించి, వీవీ గిరిని గెలిపించుకున్నారు. ఈ పరిణామం ఎంతవరకు పోయిందంటే, పార్టీని చీల్చింది. దేశం, దేశ నాయకత్వం సమైక్యంగా లేవన్న సంకేతాలను పొరుగు దేశానికి పంపింది. 1971లో పాకిస్తాన్ యుద్ధానికి దిగేటంత సాహసం చేయడం వెనుక ఉన్న కారణాలలో ఇదీ ఒకటని పీవీ నరసింహారావు తన ఆత్మ కథాత్మక నవల 'లోపలి మనిషి'లో చెప్పారు కూడా. 1975లో ఇందిరాగాంధీ తీసుకువచ్చిన అత్యవసర పరిస్థితి ఆదేశం మీద సంతకం చేసి చరిత్రలో అభాసుపాలైన రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్. రాజీవ్‌గాంధీ తీసుకొచ్చిన తపాలా బిల్లును నాటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ తిప్పి పంపారు. ఆయన సొంత పార్టీ అభ్యర్థే మరి. నాడు అదొక సంచలనం. ఏపీజే అబ్దుల్‌కలాం వంటి రాజకీయాలతో ప్రమేయం లేని కొందరూ ఎన్నికై వన్నె తెచ్చారు. రాష్ట్రపతి దేశ ఔన్నత్యానికి ప్రతీక. 14వ రాష్ట్రపతిగా జూలై 25న పదవీ విరమణ చేసిన రామ్‌నాథ్ కోవింద్ అలాంటి ఔన్నత్యానికి ప్రతిరూపం.

ప్రభుత్వంతో, ప్రధానితో విభేదాలు లేకపోవచ్చు. అయినా కోవింద్ పదవీ కాలం (జూలై 25, 2017-జూలై 25, 2022) నల్లేరు మీద నడక కాదు. దేశ పరిస్థితులు ఆయనను ఎన్నో రాత్రులు నిద్రకు దూరం చేశాయనే అనాలి. ప్రధాని మోదీ మీద, బీజేపీ మీద దురుద్దేశాలతో విపక్షాలు చేసిన రగడ, విదేశీ శక్తులు, విధ్వంసకర శక్తులు చేసిన విన్యాసాలు కోవింద్‌ను నిరంతరం కలవరపరిచే ఉంటాయి. దేశ ప్రతిష్టను అంతర్జాతీయంగా అపహాస్యం

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ శ్రావణ శుద్ధ చవితి**


**లోపలి పేజీలలో...**



ముఖపత్ర కథనం
**రాష్ట్రపతి భవన్‌లో సంథాల్ హూల్!**
6లో



జాతీయం
**మరమగ్గాల ధాటికి 'చేనేత'ల వెతలు**
14లో



ధారావాహిక నవల
**లంబసింగి రోడ్డు**
- డా॥ గోపరాజు నారాయణరావు
20లో

# జాగృతి

## సంపాదకీయం

## కోవింద్‌కు వీడ్కోలు

చేయబోయిన కొందరి పైశాచికానందమూ బాధించి ఉంటుంది. ఎస్‌సీ వర్గం నుంచి వచ్చినా, ఆయన ఆర్‌ఎస్‌ఎస్‌ అభిమానం విపక్షాలకు భరించరానిదే అయింది. రాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్నికైనప్పుడు 2010 నాటి పాత వివాదం తవ్వి తీశారు. ముస్లింలు, క్రైస్తవులు విదేశాలకు చెందినవారు అంటూ ఆయన ఓ సందర్భంలో చేసిన వ్యాఖ్య మాత్రమే అది. కోవింద్‌కు రెండోసారి అవకాశం రాలేదు. అది వేరే విషయం. అయినా చివరి క్షణం వరకు ఆయన ప్రదర్శించిన హుందాతనం, చెరగని చిరునవ్వు ఆయన వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించాయి.

పదవీ విమరణకు కొన్ని గంటల ముందు జాతిని ఉద్దేశించి కోవింద్‌ చేసిన ప్రసంగమూ ప్రేరణదాయకమే. ఈ శతాబ్దం భారత్‌దేనంటూ గొప్ప సానుకూల దృక్పథాన్ని దేశం ముందు ఉంచి ఆయన రాష్ట్రపతి భవన్‌ నుంచి నిష్క్రమించారు. యువకులు తమ మూలాలను మరచిపోరాదన్నదీ, పర్యావరణాన్ని రక్షించుకోవాలన్నదీ విలువైన సూచనలే. ప్రథమ పౌరుడిగా నేను ఇచ్చే సలహా ఏమైనా ఉన్నదీ అంటే అది ఈ దేశంలో నదులు, పర్వతాలు, అడవులు, చెట్లు కాపాడమనే చెప్పారాయన.

కేంద్ర కేబినెట్‌, పార్లమెంట్‌ ఆమోదించిన బిల్లుల మీద సంతకాలు చేయడం రాష్ట్రపతి రాజ్యాంగ విధి. ఒకవేళ తిప్పి పంపినా, పార్లమెంటు మళ్లీ ఆమోదించి పంపితే సంతకం చేయవలసిందే. ఏ రాష్ట్రపతి అయినా తన ఐదేళ్ల పదవీకాలంలో కొన్ని వందల బిల్లు మీద సంతకం చేస్తారు. కానీ, రామ్‌నాథ్‌ కోవింద్‌ కాలంలో ఆమోదించిన బిల్లులలో చరిత్రాత్మకమైనవి ఉన్నాయి. చరిత్రను తిరగరాసినవీ ఉన్నాయి. చారిత్రక తప్పిదాలను సరిదిద్దేందుకు ఉద్దేశించినవీ ఉన్నాయి. ఒకటి రెండు తప్ప ఎక్కువ బిల్లులను విపక్షాలు తమ అనవసర రాద్ధాంతానికి ఉపయోగించుకున్నాయి కూడా. బాలల ఉచిత, నిర్బంధ విద్య బిల్లు మీద (2017) సంతకం చేసినవారు కోవింద్‌. ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగానికి తెచ్చిన 105వ సవరణ బిల్లు కూడా ఆయన హయాంలోనే చట్టమైంది. 12 ఏళ్ల బాలికల మీద జరిగే లైంగిక అత్యాచారాలకి మరణ దండన విధించాలన్న చట్టం ఆయన సంతకంతో (2018) వచ్చినదే. వీటన్నిటికి తలమానికమైనది 370 ఆర్టికల్‌ రద్దు బిల్లు. అలాంటి చరిత్రాత్మక బిల్లు కోవింద్‌ చేవ్రాలుతోనే చట్టరూపం దాల్చింది.

కోవింద్‌ బీజేపీ నుంచి వచ్చారు. ఆ పార్టీకి మూలమైన భారతీయ జనసంఘ్‌ కాలంలో ఏర్పరుచుకున్న విధానమే జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 ఆర్టికల్‌ రద్దు. 1951లో ఏర్పాటైన జనసంఘ్‌, 1977లో జనతాపార్టీలో విలీనమైంది. తరువాత ద్వంద్వ సభ్యత్వం వివాదంతో మాజీ జనసంఘీయులు 1980లో బీజేపీని స్థాపించుకున్నారు. కానీ తమ పాత నినాదం– '370 రద్దు'ను యథాతథంగా స్వీకరించారు. ఆర్టికల్‌ 370 రద్దు అంటే, సంస్థానాల విలీనంతో భారత్‌ను సమైక్యం చేయాలన్న సర్దార్‌ పటేల్‌ కలకు పరిపూర్ణత కల్పించడమే. దేశానికి రాజకీయ ఐక్యతను అద్దడమే. ఆ పని 2019లో సాధ్యమైంది. కాబట్టి జనసంఘ్‌/బీజేపీ 75 ఏళ్ల కలను సాకారం చేస్తూ వచ్చిన బిల్లు మీద సంతకం చేసే మహదవకాశం, చారిత్రక సందర్భం కోవింద్‌ హయానికే మకుటాయమానమైనది. ఇదే స్వతంత్ర భారత చరిత్రలో కోవింద్‌ స్థానాన్ని సుస్థిరం చేస్తుంది. ఇది చాలామందికి రుచించదు. రాజ్యాంగ విలువలను అణచివేయడంలో కోవింద్‌ బీజేపీకి తోడుదొంగలా సహకరించారంటూ మెహబూబా ముఫ్తీ వ్యాఖ్యానించడం ఇందుకే. కానీ తన పదవీ విరమణ రోజునే కార్గిల్‌ దివస్‌ పేరుతో శ్రీనగర్‌లో త్రివర్ణ పతాకం సాక్షిగా వైభవంగా జరిగిన సంరంభం కోవింద్‌ విజయం. మెహబూబా వంటి వారికి సరైన సమాధానం. ★


01 ఆగస్ట్‌ 2022, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్‌



ప్రత్యేక వ్యాసం

**శ్రీ వరలక్ష్మీ నమోస్తుతే...!!**

26లో



చరిత్రపుటలు

**సర్‌సంఘచాలక్ బాధ్యతకు విరామం**

38లో



కథ

**ఏది మహమ్మారి**

– డాక్టర్‌ రమణ యశస్వి

32లో



అంతర్జాతీయం

**ఐ2యూ2తో భారత్‌కు ఆర్థిక ప్రయోజనం**

40లో


| | | |
|---|---|---|
| తమ అభ్యర్థిని తామే ఓడించిన విపక్షాలు (ముఖపత్ర కథనం) | – | 11 |
| దైవమాన్యాల మీదే సర్కారు కన్ను (ఆంధ్రప్రదేశ్‌) | – | 16 |
| ఆధ్యాత్మికం | – | 18 |
| దివ్య సందేశాల రక్షాబంధన్‌ (ప్రత్యేక వ్యాసం) | – | 23 |
| జనని స్తన్యం.. జన్మధన్యం (మహిళ) | – | 28 |
| నూరు వసంతాలు నిండిన త్రివర్ణ పతాకం (అమృత్‌ మహోత్సవ్‌) | – | 30 |
| సాధన విజయానికి ఇంధనం (వికాసం) | – | 35 |
| దహనకాండనుంచి తప్పించుకున్న 'మాలపల్లి' (అమృత్‌ మహోత్సవ్‌) | – | 36 |
| ప్రపంచ పోటీల్లో రజత 'నీరజం' (క్రీడ) | – | 43 |
| వార్తా విశేషాలు | – | 44 |
| బాలజాగృతి | – | 46 |
| వారఫలాలు | – | 48 |
| పదరసం | – | 49 |
| నడకలు నేర్పిన దారులకు 'థ్యాంక్యూ' (సినిమా) | – | 50 |



ఆజాదీ కా అమృత్ మహోత్సవాల వేళ ఆధునిక భారతదేశంలో మరొక చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది.

ఒక గిరిజన మహిళ భారత రాష్ట్రపతి పీఠం అధిరోహించారు. ఆమె ద్రౌపది ముర్ము.

పోరాట పటిమకు చిరునామా వంటి సంథాల్ తెగ నుంచి వచ్చారు. 1855-56లో అదే తెగ ఈస్టిండియా కంపెనీ మీద ధ్వజమెత్తి చరిత్ర సృష్టించింది. అరవై వేలమంది గిరిజనులు వెంటరాగా సిధు, కన్హు సోదరులు ఆ ఉద్యమాన్ని నడిపించారు. వారే ముర్ము సోదరులుగా చరిత్ర ప్రసిద్ధులు. ఆ ఉద్యమాన్ని గౌరవిస్తూ చరిత్ర ఇచ్చిన పేరే సంథాల్ హూల్.

# రాష్ట్రపతి భవన్‌లో

# సంథాల్ హూల్!

ఆ తెగలోనే పుట్టిన ద్రౌపది ముర్ము చరిత్ర సృష్టించారు. అలా స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లకు ఇప్పుడు రాష్ట్రపతి భవన్ సంథాల్ హూల్‌తో ప్రతిధ్వనించింది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న గిరిజన తెగ ఆడపడుచు దేశ అత్యున్నత రాజ్యాంగ పదవికి ఎన్నిక కావడం నిశ్చయంగా విప్లవమే.

స్వరాజ్య సమరం నాటి అన్ని వర్గాల త్యాగాలకూ, రక్తతర్పణలకు గుర్తింపు నివ్వాలన్న లక్ష్యం ఆజాదీ కా అమృతోత్సవాల లక్ష్యంగా చెప్పుకున్నది నరేంద్ర మోదీ ప్రభుత్వం. ఆ త్యాగాల ఫలితంగా లభించిన స్వతంత్ర భారతావనిలోను అన్ని వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా సమాన ప్రాధాన్యం ఉండాలన్న ఆకాంక్షను ద్రౌపది ముర్ము ఎంపిక ద్వారా బీజేపీ ప్రకటించింది.

ఈసారి జరిగిన రాష్ట్రపతి ఎన్నికలకు ఇంకా అనేక ప్రత్యేకతలున్నాయి. స్వాతంత్ర్యానంతరం జన్మించి, రాష్ట్రపతిగా ఎన్నికైన తొలి మహిళ ద్రౌపది ముర్ము. ఆ పదవికి ఇప్పటివరకు ఎన్నికైనవారిలో పిన్న వయస్కురాలు. పేదరికం, వెనుకబాటుతనంతో పనిలేకుండా సొంత సామర్థ్యంతో, స్వశక్తితో అత్యున్నత స్థానాన్ని చేరుకోవడానికి ఎవరికైనా అవకాశం కల్పించే భారత ప్రజాస్వామ్య ఔన్నత్యం ప్రపంచానికి స్ఫుటంగా వెల్లడైంది. అందరికీ సమానావకాశాలు అని చెప్పే భారత రాజ్యాంగంలోని వాస్తవికత నిర్ద్వంద్వంగా వ్యక్తమైంది. సామాజిక న్యాయం అంటూ గొంతు చించుకోవడం కాదు, దానిని ఆచరణలో చూపితేనే సార్ధకత అన్న వాస్తవాన్ని తాను ఎంతగా నమ్ముతున్నదో బీజేపీ ఈ దేశ ప్రజల అనుభవానికి తెచ్చింది. కొండకోనలలో పుట్టి పెరిగిన సామాన్యురాలిని రైసినా హిల్స్‌కు తోడ్కొని వచ్చిన పల్లకికి బోయీ అయింది. 15వ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ముతో ప్రమాణస్వీకారం చేయించినది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవి చేపట్టిన తెలుగువాడు జస్టిస్ ఎన్.వి. రమణ కావడం కూడా ఒక ప్రత్యేకతే.

## ద్రౌపది ముర్ము నేపథ్యం

ఒడిశాలో సంథాల్ తెగ ప్రజలు అధికం. జూన్ 10, 1958న ద్రౌపది ముర్ము జన్మించారు. స్వస్థలం ఒడిశాలోనే, మయూర్ భంజ్ జిల్లా, ఉపర్‌బెడ గ్రామం. తండ్రి బిరంచి నారాయణ్ తుడు. తండ్రి తాతలు పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామ పెద్దలుగా పనిచేశారు. ద్రౌపది ముర్ము భువనేశ్వర్‌లోని రమాదేవి ఉమెన్స్ కళాశాల నుంచి ఆర్ట్స్ పట్టభద్రురాలు. తరువాత ఆమె జీవితానికి రాయ్‌రంగాపూర్ కేంద్ర బిందువైంది. చదువు అయిన తరువాత రాయ్‌రంగాపూర్‌కే చెందిన శ్యాంచరణ్ ముర్ము (బ్యాంకు ఉద్యోగి)ని వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. 2009–2015 మధ్యకాలంలో తన భర్త, ఇద్దరు కుమారులు, తల్లి, సోదరుడిని కోల్పోయి తీవ్ర మనోవేదనకు గురయ్యారు. మనశ్శాంతి కోసం బ్రహ్మకుమారిల ఆధ్యాత్మిక కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారు. వివిధ ఆలయ ప్రాంగణాలను పరిశుభ్రం చేసేవారు. భర్త, ఇద్దరు కుమారుల పేరిట ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తన భర్త రాయ్‌రంగాపూర్‌లోనే నిర్మించిన సాధారణ ఇంటిలో ఆమె నివసించేవారు. ఈమె కుమార్తె ఇతిశ్రీ ముర్ము, బ్యాంక్ ఆఫీసర్‌గా పనిచేస్తూ తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నారు.



ద్రౌపది ముర్ము నీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా జీవితాన్ని ప్రారంభించి 1979–83 వరకు పనిచేశారు. అటు తర్వాత రాయ్‌రంగాపూర్‌లోని శ్రీ అరవిందో ఇంటిగ్రల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసి, 1997లో భారతీయ జనతా పార్టీలో చేరారు. రాయ్‌రంగాపూర్ నగర పంచాయతీ కౌన్సిలర్‌గా, 2000 సంవత్సరంలో అదే నగర పంచాయతీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. బీజేపీ గిరిజన మోర్చా జాతీయ ఉపాధ్యక్షులుగా కూడా పనిచేశారు. తర్వాత ఆమె రాయ్‌రంగాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికై, 2000లో ఏర్పాటైన బిజూ జనతాదళ్–బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో వాణిజ్యం, రవాణా (2000 మార్చి 6 నుంచి 2002 ఆగస్టు 6 వరకు), తర్వాత మత్స్య–పశుసంవర్ధక శాఖలు (2002 ఆగస్టు 6 నుంచి 2004, మార్చి 16 వరకు) నిర్వహించారు. 2004లో రాయ్‌రంగా పూర్ నియోజకవర్గం నుంచి మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2007లో ఒడిశా అసెంబ్లీలో ఉత్తమ ఎమ్మెల్యే (నీలకంఠ సన్మాన్) పురస్కారాన్ని పొందారు. మే 18, 2015న ముర్ము

# జయ్‌పాల్ ముండా ముర్ముకు మార్గదర్శకుడవుతారా?



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

రాజ్యాంగ నిర్మాణ సభలో ఒకే ఒక గిరిజన సభ్యుడు జయ్‌పాల్‌సింగ్ ముండా. 1928లో ఆమ్‌స్టర్‌డ్యామ్‌లో జరిగిన సమ్మర్ ఒలింపిక్స్‌లో హాకీ టీమ్ కెప్టెన్. ఈ టీమ్ ఈ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించింది. ఈయన ఆదివాసీస్తాన్ కావాలని డిమాండ్ చేసిన వ్యక్తి. తనకు మాట్లాడే అవకాశం కల్పించినప్పుడు మతం, జాతి, తెగ పరంగా గిరిజనులపై ఏవిధమైన వివక్ష చూపడానికి వీల్లేదని రాజ్యాంగసభకు సూచించారు. గిరిజన తెగలవారు మతం మారినా వారి జీవన విధానాల్లో మార్పు ఉండదని ఈయన రాజ్యాంగ నిర్మాణసభకు తన అభిప్రాయం చెప్పడంతో, గిరిజనులను మైనారిటీలుగా గుర్తించి రాజ్యాంగసభ వీరికి కూడా రిజర్వేషన్లు వర్తింప జేసింది. దీంతో గిరిజనులు మతం మారినా రిజర్వేషన్లు వర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సదుపాయం మిగిలిన వర్గాలకు లేదు.

బాబా కార్తిక్ ఒరాన్, బిహార్‌లోని ఒరాన్ గిరిజన తెగకు చెందినవాడు. ఈయన్ను బాబా కార్తిక్ సాహెబ్ అనికూడా పిలిచేవారు. 1970 దశకంలో లోహర్‌దగా పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఈయన విమానయానశాఖ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రిగా పనిచేశారు.



మనవరాలు, కుమార్తెతో..

క్రైస్తవంలోకి గిరిజనుల మతమార్పిడులను అడ్డుకునేందుకు తీవ్రంగా కృషిచేశారు. ఈ నేపథ్యంలో నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో ఆయన మతం మారిన గిరిజనులకు రిజర్వేషన్లు అవసరం లేదన్న ప్రతిపాదను తయారుచేసి 322 మంది లోక్‌సభ సభ్యులు, 26 మంది రాజ్యసభ సభ్యుల సంతకాలతో అప్పట్లో భారత ప్రభుత్వానికి ఒక మెమోరాండం సమర్పించారు. లోక్‌సభలో 50 మంది క్రైస్తవ అనుకూల ఎంపీలు ఈ మెమోరాండంను తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే కార్తిక్ ఒరాన్ చేసిన ప్రతిపాదనలు "జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఆన్ షెడ్యూల్ క్యాస్ట్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (అమెండ్‌మెంట్) బిల్–1967"కు పూర్తి అనుగుణంగా ఉన్నప్పటికీ క్రైస్తవ మిషనరీల తీవ్ర ఒత్తిడితో ఇందిరాగాంధీ ముందడుగు వేయలేకపోయారు. ఫలితంగా ఇప్పుడు ఈశాన్య భారత్‌లోని గిరిజనుల్లో 90%కు పైగా క్రైస్తవులుగా మతమార్పిడికి గురయ్యారు. దేశీయ సమస్యలను వాస్తవికత ఆధారంగా పరిష్కరించాలనుకున్నప్పటికీ విదేశీ ప్రభావిత శక్తులు తమ లక్ష్యాలకు అనుగుణంగా మాత్రమే ప్రభుత్వాన్ని ముందుకు వెళ్లనిస్తాయన్న సత్యానికి ఇదొక ఉదాహరణ. ఇందుకోసం అవి ఎంతకైనా తెగబడతాయన్నది కూడా నిష్ఠుర సత్యం. ఇందుకు ఒక్కటే కారణం. మనదేశంలో మైనారిటీలని చెప్పే మతాలు, అంతర్జాతీయంగా మెజారిటీలు కావడం, భారత్‌లో మెజారిటీ వర్గంగా భావించే హిందువులు అంతర్జాతీయంగా మైనారిటీలు కావడం! కేవలం ఈ కారణమే మనదేశ రాజకీయాలను, సామాజిక వ్యవస్థను శాసిస్తోంది. కుహనా లౌకికవాదుల 'మైనారిటీ' భజన కూడా ఇందుకే కావచ్చు. ప్రస్తుత జాతీయవాద ప్రభుత్వం నిజాయతీగా నాటి జాయింట్ పార్లమెంటరీ కమిటీ బిల్లు వంటి దానిని ముందుకు తీసుకువస్తే ద్రౌపది ముర్ము మద్దతిస్తారా లేదా అనేది వేచిచూడాలి.

ఝార్ఖండ్ తొమ్మిదవ గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆ రాష్ట్రానికి తొలి మహిళా గవర్నర్ ఈమెనే కావడం విశేషం. ఆరేళ్లపాటు అంటే 2021 వరకు పూర్తికాలం గవర్నర్‌గా కొనసాగారు. ఆ విధంగా పూర్తికాలం ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా కొనసాగిన తొలి గిరిజన మహిళగా చరిత్ర సృష్టించిన ఘనత కూడా ఈమెదే.

2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో గిరిజనుల సంఖ్య 104 మిలియన్లు. మొత్తం జనాభాలో 8.6 శాతం. దేశంలో మొత్తం 705 గిరిజన తెగలను భారత ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. వీరు మొత్తం లక్షా 45వేల గ్రామాల్లో నివసిస్తున్నప్పటికీ కేవలం 1,17,064 గ్రామాల సమాచారం మాత్రమే అందుబాటులో ఉంది. మరి ఈ గిరిజనులను ప్రకృతి ఆరాధకులుగా పరిగణిస్తూ, వీరు హిందువులు కారంటూ, క్రమంగా తమ మతంలోకి మారుస్తున్న క్రైస్తవ మిషనరీలకు ద్రౌపది ముర్ము రాష్ట్రపతి కావడం మింగుడుపడని అంశం. నిజానికి సంథాల్ గిరిజన తెగలవారు శివారాధకులు. ద్రౌపది ముర్ము శివాలయం ప్రాంగణాన్ని చీపురుతో ఊడ్చి శుభ్రం చేసి అక్కడి నంది చెవిలో ప్రార్థించడం గమనార్హం. నంది చెవిలో తమ కోర్కెలు విన్నవిస్తే, ఆయన శివుడికి చేరవేస్తాడన్నది సంథాలీ ప్రజల నమ్మకం. నిజానికి దేశమంతటా ఉన్న విశ్వాసం. అదే విశ్వాసం ద్రౌపది ముర్ములో వ్యక్తమైంది.

ద్రౌపది ముర్ము ఎంపికలో హిందూత్వ కోణం ఉన్నదని ఎవరైనా అంటే దానిని నిరాకరించవలసిన అవసరం లేదు. ఎన్‌డీఏ అభ్యర్థిగా ఎంపిక చేసిన తరువాత ఆమె చేపట్టిన తొలి కార్యక్రమం శివాలయంలో అర్చన. ఆ విధంగా తనను తాను ఆమె వ్యక్తీకరించుకున్నారు. తనదైన అస్తిత్వాన్ని చాటుకున్నారు. అట్టడుగున ఉన్న హిందువులు ఇప్పటికీ దూరంగా ఉండిపోయారన్న అపవాదు నుంచి దేశాన్ని బయట పడవేయడానికి బీజేపీ ఈ సమున్నత నిర్ణయం తీసుకుంది. గిరిజన ప్రాంతాల నుంచి కూడా ఒక నేతను తయారుచేసి, ఆమెకు రాష్ట్రపతి పదవిని అప్పగించడం వెనుక ఉన్నది దేశ సమైక్యతకు సంబంధించిన ఆలోచన మాత్రమే. వేరుగా చూస్తున్నారన్న ప్రచారాన్ని నమ్ముతున్న కొందరు గిరిజనులకు అది తప్పని, ఇకపై సాగదని చెప్పడానికే బీజేపీ ద్రౌపది ముర్మును ఎంపిక చేసింది. అందుకే ఇదొక చరిత్రాత్మక ఘట్టం. ★



# ఆజాదీ కా అమృతోత్సవాల నేపథ్యంలో ప్రమాణం చేస్తున్నా!

త్రివర్ణ పతాకాన్ని గుర్తుకు తెచ్చే చీర కట్టుతో, ఎంతో హుందాగా, గంభీరంగా ద్రౌపది ముర్ము 15వ రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో జరిగిన ముర్ము ప్రమాణ స్వీకారోత్సవం అక్షరాలా స్ఫూర్తిదాయకంగా సాగింది. ఉద్విగ్న భరిత వాతావరణంలో, ఉత్తేజకరంగా, చరిత్రాత్మక ఘట్టంగా ముగిసింది. రెండో మహిళా రాష్ట్రపతిగా ఆమె పట్టాభిషిక్తురాలయ్యారు. పురాతన నాగరికత కలిగిన ఈ దేశం తన సంస్కృతిలో భాగంగా ఉన్న అట్టడుగు వర్గం నుంచి వచ్చిన మహిళకు దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అప్పగిస్తున్న మహోన్నత క్షణంగానే అక్కడివారంతా భావించినట్టు కనిపించింది.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ ఆమె చేత 'భగవంతుని సాక్షి'గా ప్రమాణం చేయించారు. 14వ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తన వారసురాలికి సవినయంగా బాధ్యతలు అప్పగించారు. భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన మంత్రివర్గ సహచరులు, భారత మొదటి మహిళా రాష్ట్రపతి ప్రతిభాదేవీ పాటిల్ షెకావత్, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, వైసీపీ నాయకుడు విజయసాయిరెడ్డి వంటి ఎందరో ఈ ఉత్సవానికి హాజరయ్యారు. కుళ్లు రాజకీయాల మాయలో పడి ఇలాంటి చరిత్రాత్మక ఘట్టంలో భాగస్వాములు కాలేకపోయినవారు కూడా ఉన్నారు.

ప్రమాణ స్వీకారం తరువాత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 18 నిమిషాల పాటు చేసిన ప్రసంగం హాలులోని వారినే కాదు, కార్యక్రమాన్ని వీక్షిస్తున్న భారతీయులను కూడా కదిలించింది. సంప్రదాయక గిరిజన సంబోధన 'జోహార్' అంటూ ముర్ము తన ప్రసంగం ఆరంభించారు. ఆ ప్రసంగంలోని కొన్ని అంశాలు:

"భారతదేశంలో పేదలు కేవలం కలలు కనడమే కాదు, వాటిని నిశ్చయంగా సాకారం చేసుకోగలరు. ఇందుకు నేను రాష్ట్రపతిగా ఎన్నిక కావడమే నిదర్శనం. నాకు ఓటు వేసి గెలిపించిన ఎంపీలు, ఎమ్మెల్యేలందరికీ నా ధన్యవాదాలు. మీరంతా నాకు ఓటు వేయడమంటే ఆ విధంగా ఈ దేశానికి చెందిన కోట్లాది ప్రజలు నా మీద ఉంచిన నమ్మకాన్ని వ్యక్తం చేశారు. దేశం ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో నన్ను ఈ పదవికి ఎన్నుకున్నారు. నా రాజకీయ జీవితం స్వాతంత్ర్య దిన యాభయ్ సంవత్సరాల వేడుకల సందర్భంగా మొదలయింది. వచ్చే పాతిక సంవత్సరాలలో పెద్ద లక్ష్యాన్ని ముందు ఉంచుకున్న తరుణంలో ఇప్పుడు ఈ ఎన్నిక జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జన్మించిన తరంలో మొదటి రాష్ట్రపతిని నేనే. మనం రేపు, జూలై 26న కార్గిల్ దివస్ జరుపుకుంటున్నాం. ఆ సందర్భంగా శౌర్యానికి ప్రతీకలైన మన సాయుధ దళాల వారికి, దేశ ప్రజలకి ముందుగానే నా అభినందనలు తెలియచేస్తున్నాను. రాష్ట్రపతి పదవి దక్కడం కేవలం నా వ్యక్తిగత విజయం కాదు. ఇది దేశంలోని ప్రతి నిరుపేద సాధించిన ఘనత. అణగారిన వర్గాలు, పేదలు, దళితులు, గిరిజనులు, వారి ప్రతిబింబాన్ని నాలో చూసుకోగలగడం నాకెంతో తృప్తిని ఇస్తున్నది. దేశ స్వాతంత్ర్య సమరయోధుల ఆకాంక్షలను నెరవేర్చడం మన బాధ్యత. ఇందుకే సబ్‌కా ప్రయాస్ (అందరి ప్రయత్నం), సబ్‌కా కర్తవ్య (అందరి విధి) అనే రెండు పట్టాల మీద దేశం వేగంగా ముందుకెళ్లాలి. దేశమంతా ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు జరుపుకుంటున్న వేళ నేను ఈ పదవిని స్వీకరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

నిరుపేద గిరిజన కుటుంబం నుంచి వచ్చిన ఒక మహిళ రాజ్యాంగ పదవిని చేపట్టడం దేశ ప్రజాస్వామ్య శక్తికి నిదర్శనం. ఒడిశా రాష్ట్రంలో మారుమూల ప్రాంతంలో, చిన్న గిరిజన గ్రామంలో పుట్టి పెరిగాను. ప్రాథమిక విద్యను అభ్యసించడం కూడా అక్కడ ఒక కలే. మా గ్రామం నుంచి కళాశాలకు వెళ్లిన తొలి విద్యార్థిని నేనే. అలాంటి నేను ఏకంగా రాష్ట్రపతి పదవికి చేరుకోవడం మన ప్రజాస్వామ్య గొప్పదనంగా భావిస్తా. నా మీద మీరు పెట్టిన నమ్మకమే నా శక్తి."

ఇంకా ఇలా అన్నారు కొత్త రాష్ట్రపతి – "ఈ దేశ ఔన్నత్యాన్నీ, ప్రజాస్వామిక శక్తిని ఇనుమడింప చేసిన దేశాధ్యక్షులకు నేను వారసురాలిని. మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ నుంచి రామ్‌నాథ్ కోవింద్ వరకు మహోన్నతులు ఆ పదవిని చేపట్టారు. రాజ్యాంగం నిర్దేశించిన మేరకు నేను కూడా రాష్ట్రపతి పదవిని బాధ్యతతో నిర్వర్తిస్తాను. ఒక దేశంగా భారత్ ప్రస్థానానికి మన స్వాతంత్ర్య పోరాటమే ప్రణాళికను సిద్ధం చేసింది. మన స్వాతంత్ర్య సమరమే అనేక పోరాట దశలతో నిండి ఉంది. అనేక పంథాలు ఉన్నాయి. పూజ్య బాపూజీ స్వరాజ్య, స్వదేశీ, స్వచ్ఛత, సత్యాగ్రహాల గురించి ప్రబోధించారు. నేతాజీ సుభాస్ చంద్రబోస్, నెహ్రూ, సర్దార్ పటేల్, బాబాసాహెబ్ అంబేడ్కర్, భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు, చంద్రశేఖర్ ఆజాద్ జాతి ఔన్నత్యాన్ని నిలిపారు. రాణీ లక్ష్మీబాయి, వేలు నాచియార్, రాణి గైడిన్లు, రాణి చెన్నమ్మ వంటి వారు జాతి నిర్మాణంలో, రక్షణలో మహిళ శక్తి ఎలాంటిదో చూపారు. సంథాల్ విప్లవం, పెయికా, ఖోల్, భిల్ విప్లవాలు స్వాతంత్ర్య సమరంలో గిరిజనుల పాత్రను పటిష్టంగా చూపిస్తాయి. దేశభక్తి, సామాజిక ఉన్నతుల విషయంలో మనం 'ధర్తీ ఆబా' బిర్సా ముండా నుంచి ప్రేరణ పొందాలి."


కొవిడ్ 19 నివారణ కోసం భారత్ చేసిన యుద్ధం గొప్పదని రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రశంసించారు. ప్రపంచం ఇప్పుడు భారత్ వైపు అబ్బురంతో చూస్తున్నదని కూడా చెప్పారు. ఓకల్ ఫర్ లోకల్, డిజిటల్ ఇండియా పథకాలు మంచి ఫలితాలు ఇవ్వడం సంతోషదాయకమని కూడా అన్నారు.

ద్రౌపది ముర్ము అసలు పేరు సంథాల్ తెగలో వినిపించే పుటి. ద్రౌపది అని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఒకరు మార్చారు. తరువాత ఈ పేరును రకరకాలుగా ఉచ్చరించినా వివాహం అయిన తరువాత ద్రౌపదిగా స్థిరపడింది. ★


A HISTORIC DAY FOR NATION

గోపరాజు విశ్వేశ్వరప్రసాద్

దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అడ్డం పెట్టుకుని బీజేపీనీ, ప్రధాని నరేంద్ర మోదీనీ ఇరకాటంలో పెట్టే ఉద్దేశంతో మొదటి పావును కదిపినది విపక్ష శిబిరమే. రాష్ట్రపతి ఎలక్టోరల్ కాలేజీలో ఎన్‌డీఏకి 48 శాతం వరకే అధికారికంగా ఓట్లు ఉన్నాయి. కానీ మిగిలిన ఓట్లన్నీ విపక్షానివేననుకోవడానికి ఎలాంటి ప్రాతిపదికా లేదు. ఆ తప్పుడు లెక్కతో తమ అభ్యర్థిని గెలిపించవచ్చునని విపక్ష శిబిరం విర్రవీగడమే వింతల్లో కెల్లా వింత. ఈ లెక్క ఘోరంగా తప్పింది. విపక్ష రాష్ట్రపతి అభ్యర్థి గెలుపు మాట అటుంచి, ఆ శిబిరమే కుప్ప కూలిపోయింది. ఇది విపక్షాల ఘోర వైఫల్యం. దీనికే ఇదంతా మోదీ రాజకీయమని పేరు పెట్టి ప్రచారం చేశారు. సిద్ధాంత రహిత రాజకీయాలు, అవసరార్థ స్నేహాలు, పొత్తులు, కలయికలు ఎప్పుడూ సత్ఫలితాలను ఇవ్వవు. వ్యక్తి వ్యతిరేక రాజకీయాలదీ ఇదే పరిస్థితి.


యశ్వంత్ సిన్హా


# తమ అభ్యర్థిని తామే ఓడించిన విపక్షాలు


2014లో నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్డీయే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్న తీరు చూసినప్పుడు, అవి నడుపుతున్న రాజకీయాలను విశ్లేషించినప్పుడు ఇలాంటి అభిప్రాయాలు కలగక మానవు. సంపూర్ణ ఏకాభిప్రాయం లేనప్పటికీ కనీసం కొన్ని అంశాల్లో అయినా ఉమ్మడి నిర్ణయాలను తీసుకోలేని పక్షాలు వాటి వైరిపక్షం మీద విజయం సాధించగలవా? ప్రజలు మాత్రం వాటిని ఎలా నమ్ముతారు? ఇటీవల రాష్ట్రపతి ఎన్నికలలో విపక్షాలకు ఎదురైన ఓటమిలో ఇవన్నీ కనిపిస్తాయి. ఉప రాష్ట్రపతి ఎన్నికలలోను ఇదే పునరావృతమవుతుంది. విపక్షాల ఓటమి.


నరేంద్ర మోదీ ప్రధానిగా ప్రమాణం చేసిన మరుక్షణం నుంచి కూడా ఆయనను గద్దె దించాలని ప్రాకులాడుతున్న విపక్షాలు దేశ ప్రథమ పౌరుడి ఎన్నికలో అయినా ఏకాభిప్రాయానికి రాలేక పోయాయి. ఉమ్మడి అభ్యర్థి దొరకని పరిస్థితి. మొదట శరద్‌పవార్ అనుకున్నారు. ఆయన కాదన్నారు. తరువాత కశ్మీర్ వేర్పాటువాది ఫరూక్ అబ్దుల్లాను లాగారు. ఆయన వెనక్కి తగ్గారు. గాంధీజీ మనుమడు అంటూ గోపాలకృష్ణ గాంధీని బరిలో దించాలని అనుకున్నా సాధ్యపడలేదు. అంతిమంగా టీఎంసీ నాయకుడు యశ్వంత్ సిన్హాను ఎంపిక చేసుకున్నారు. ఇంతకీ ఈయన రెండు దశాబ్దాలు బీజేపీలో పని చేసి వచ్చిన నేత. ఈయన ఏకైక ఎజెండా మోదీ వ్యతిరేకత మాత్రమే.

ఓడిపోతామని తెలిసినప్పటికీ విపక్షాలు ఒక తాటిమీదకు రాలేకపోయాయి. రేపు అధికారం తథ్యమని అనిపిస్తే ఎన్ని వివాదాలు వస్తాయో చెప్పనక్కర్లేదు. ప్రధాని పదవి కోసం వారిలో ఎంత పోటీ ఉంటుందో ఊహించగలం. రాష్ట్రపతిగా గెలవలేని ఎన్నిక అభ్యర్థి ఎంపికలో విపక్షాలు మల్లగుల్లాలు ఆశ్చర్యం కలిగించాయి. ప్రధాన పార్టీ కాంగ్రెస్ ముందే చేతులెత్తేసింది. పార్టీ అధినేత్రి సోనియా, యువరాజు రాహుల్ గాంధీ ఈడీ విచారణలతో సతమతమయ్యారు. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి నిధుల దుర్వినియోగం కేసులో వారు పీకల్లోతుల్లో ఇరుక్కుపోయారు. ఇప్పటికి విపక్ష శిబిరంలో కీలక పాత్ర పోషిస్తున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. తొలుత వారి వైఖరిని చూసి గట్టి పోటీ ఇస్తారన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో కలిగింది.

అలాంటి సమయంలో ఎన్‌డీఏ అభ్యర్థిగా ఒడిశాకు చెందిన ద్రౌపదీ ముర్ము పేరును బీజేపీ సంధించింది. దీనితో విపక్ష శిబిరం ఒక్కసారిగా డీలా పడింది. అందులో మొదట అస్త్ర సన్యాసం చేసిన వారు సాక్షాత్తు కూటమి నేతే కావడం విశేషం. ద్రౌపది ముర్ము అని మాకు ముందు చెబితే మేం కూడా సమర్థించేవాళ్లం అని యశ్వంత్ కూసాలు కదిలిపోయే ప్రకటన చేశారు మమతా బెనర్జీ. దీనికి తోడు శివసేనలో చీలిక దృష్ట్యా, ఇక మిగిలినది ద్రౌపది గెలుపేనని కూడా ప్రకటించారు మమత.


శరద్ పవార్


గోపాలకృష్ణ గాంధీ


ఫరూక్ అబ్దుల్లా

మహారాష్ట్ర రాజకీయాలను అంతగా కలుషితం చేసిన శరద్‌పవార్ పాలిట ఈ ప్రకటన శరాఘాతమే. ఈ పరిణామాలన్నీ విపక్షాలు తమ అభ్యర్థిని తామే ఓడించే పరిస్థితికి దారి తీశాయి.

పార్టీలకు అతీతంగా ద్రౌపది ముర్ముకు మద్దతు వెల్లువెత్తడం మొదలయింది. కొన్ని రాష్ట్రాల్లో తటస్థులే కాదు, భాజపాయేతర ప్రజాప్రతినిధులు కూడా ఆమెకు మద్దతుగా నిలిచారు. వామపక్ష పాలిత కేరళలో మొత్తం ఓట్లు సిన్హాకే వస్తాయని అందరూ భావించారు. ఇక్కడ అధికార వామపక్ష, విపక్ష కాంగ్రెస్ కూటములు ఆయనకే మద్దతు ప్రకటించాయి. కానీ ఇక్కడ ముర్ముకు ఒక ఓటు లభించడం విశేషం. ఆప్ పాలిత ఢిల్లీ, పంజాబ్‌లలోనూ 8 ఓట్లు రావడం గమనార్హం. నిజానికి ఆప్ రాష్ట్రపతి ఎన్నికలలో రాసుకు పూసుకు తిరగలేదు. చివరికి యశ్వంత్‌కు మద్దతు ప్రకటించింది. దేశవ్యాప్తంగా 17మంది ఎంపీలు, 125 మంది శాసనసభ్యులు తమ పార్టీల నిర్ణయానికి వ్యతిరేకంగా ముర్ముకు మద్దతుగా నిలిచారు. దీంతో ఊహించిన దాని కంటే ఆమెకు ఎక్కువ మెజార్టీ లభించింది. గెలుపు నల్లేరుపై నడకలా సాగింది. యూపీలో సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ బాబాయి శివపాల్ యాదవ్ ద్రౌపదికి దన్నుగా నిలిచారు. గతంలో పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ సిన్హాను ఐఎస్ఐ ఏజెంటుగా అభివర్ణించారని, అందువల్ల ఆయనకు తాను ఎలా ఓటేస్తానని శివపాల్ యాదవ్ ప్రశ్నించారు. సమాజ్ వాదీ పార్టీ మిత్రపక్షం ఎస్ బీఎస్‌పీ (సుహల్ దేవ్ భారతీయ సమాజ్ పార్టీ) ఎమ్మెల్యేలు ఆరుగురు ముర్ముకే జైకొట్టడం విశేషం. అసోంలో 20 మంది హస్తం పార్టీ శాసనసభ్యులు ముర్ముకు జైకొట్టిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ విషయాన్ని ఏఐయూడీఎఫ్ (ఆలిండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్) శాసనసభ్యుడు కరీముద్దీన్ బర్భుయాన్ వెల్లడించారు. రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగుకు పాల్పడిన హరియాణా హస్తం పార్టీ శాసనసభ్యుడు కులదీప్ బిష్ణోయ్ ఈ ఎన్నికల్లో 'అంతరాత్మ ప్రబోధానుసారం' ఓటేశానని ప్రకటించడం విశేషం. ఒడిశాకు చెందిన హస్తం పార్టీ శాసనసభ్యుడు మహమ్మద్ మొఖిం, జార్ఖండ్ ఎన్సీపీ ఎమ్మెల్యే కమలేశ్ సింగ్, గుజరాత్ ఎన్సీపీ ఎమ్మెల్యే కంధల్ జడేజా ముర్ముకు మద్దతుగా నిలిచారు. పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్ ఎమ్మెల్యే మన్ ప్రీత్ సింగ్ అయాలీ అధ్యక్ష ఎన్నికకు దూరంగా ఉన్నారు. లోక్ జనశక్తి పార్టీ అధినేత చిరాగ్ పాశ్వాన్ కూడా ముర్ముకు మద్దతు ప్రకటించారు. దివంగత రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడైన చిరాగ్ పాశ్వాన్ భాజపాకు మిత్రుడేమీ కాదు. ఎన్నికలకు ముందు ఎన్డీఏ నిర్వహించిన నమూనా పోలింగుకు ఆయన హాజరయ్యారు. వాస్తవానికి 2020 నాటి బిహార్ అసెంబ్లీ ఎన్నికలప్పటి నుంచి చిరాగ్ బీజేపీకి దూరంగా ఉంటున్నారు. నమూనా పోలింగుకు హాజరైనంత మాత్రాన తాను మళ్లీ ఎన్డీయేలో భాగమవుతున్నట్లు పరిగణించరాదని ఆయన స్పష్టం చేయడం విశేషం. కేవలం అభ్యర్థిని చూసి తాను ఓటేయనున్నట్లు అప్పట్లో ప్రకటించారు. తాజా పరిణామాల నేపథ్యంలో శివసేన చివరికి ముర్ముకు మద్దతు ప్రకటించింది. మమతా బెనర్జీ తరువాత మోదీ వ్యతిరేక శిబిరంలో పెద్ద నోరుతో కనిపిస్తున్న తెరాసకు కూడా రాష్ట్రపతి ఎన్నిక వేడి కొద్దిగానే అయినా తగిలింది. ద్రౌపదికి మద్దతు ఇవ్వనందుకు నిరసనగా ఢిల్లీలోని తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రతినిధి రామచంద్రు తెజావత్ పార్టీకి రాజీనామా చేశారు. ఒక గిరిజన మహిళకు మద్దతు ఇవ్వాల్సిన అవసరాన్ని పార్టీ విస్మరించిందన్నారు. ఈ విషయంలో కేసీఆర్ నిర్ణయం తనను బాధించిందన్నారు. గినిజన అభ్యర్థిపై ఆయన పునరాలోచించాల్సిన అవసరం ఉందని రామచంద్రు తెజావత్ వాదన. అంతేకాక ముర్మును ఎంపిక చేసిన మోదీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఒక గిరిజన మహిళను అత్యున్నత పదవికి ఎంపిక చేయడంపై అభినందించాల్సింది పోయి గిరిజనుల మెడపై కత్తి పెట్టేందుకే మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొనడం సీపీఐ నారాయణ అపరిపక్వతకు నిదర్శనం. బడుగులకు తమ పార్టీలోనే కాస్త పెద్ద పదవులు ఇవ్వడానికి ముందుకు రాని ఆ పార్టీ, దాని సోదర పార్టీ ముర్ము ఎంపిక ప్రాధాన్యం గ్రహించగలవనీ, ఓటు వేస్తాయనీ అనుకోవడం భ్రమ.

ద్రౌపది ముర్ము ఎన్నిక విషయంలో బీజేపీ జాగ్రత్తగానే అడుగులు వేసింది. ఆంధ్రప్రదేశ్‌లో వైకాపాను, ఒడిశాలో బిజూ జనతాదళ్‌ను ముందుగానే సంప్రతించింది. ఆ రెండు పార్టీలు వెంటనే ఆమోదం తెలిపాయి. పైగా ముర్ము ఒడిశావారు కాబట్టి నవీన్ పట్నాయక్ తక్షణం మద్దతు ప్రకటించారు. జార్ఖండ్‌కు చెందిన జేఎంఎం (జార్ఖండ్ ముక్తి మోర్చా) వంటి పార్టీలు కాంగ్రెస్, ఆర్‌జేడీ మద్దతుతో అధికారంలో ఉన్నా ముర్ముకు మద్దతు ఇవ్వక తప్పని పరిస్థితి వచ్చింది. దేశంలో తొలిసారి ఒక గిరిజన మహిళను అత్యున్నత రాజ్యాంగ పదవికి ఎంపిక చేస్తే అందులో తాము భాగస్వాములం కాకపోవడం అసంబద్ధమని జేఎంఎం భావించింది. మోదీ మీద వ్యతిరేకతతో ఇలాంటి ఒక గొప్ప చారిత్రక నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్న ఇంగిత జ్ఞానం కాంగ్రెస్, మమత, కేసీఆర్, కమ్యూనిస్టులు కోల్పోయారు. కానీ చివరి నిమిషంలో అయినా బీజేపీ వ్యతిరేక పార్టీలు కొన్ని, కొందరు సభ్యులు ముర్ముకు మద్దతు ప్రకటించి పరిణతిని ప్రదర్శించారు.

నిజానికి ఎన్డీఏ ప్రతిపాదించిన ముర్మును ఏకగ్రీవంగా ఎన్నుకోవాల్సిన పరిస్థితి ఉంది. అలా చేసినట్లయితే 1977లో నీలం సంజీవరెడ్డి తరవాత ఏకగ్రీవంగా ఎన్నికైన ఘనత ముర్ముకు దక్కేది. అలాంటి మంచి అవకాశాన్ని విపక్షాలు జారవిడుచుకున్నాయి. ఏ కోణంలో చూసినా ద్రౌపదీ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించాల్సినంత అవసరం ఏ పార్టీకీ లేదు. ఆమె ఒక మహిళ, అందునా గిరిజన నారి. ఒడిశాకు చెందిన వెనుకబడిన మహిళ. వివాదరహితురాలు. విద్యావంతురాలు. నిరాడంబర జీవనం గడుపుతున్నవారు. నిగర్వి. ఆమె రాజకీయ జీవితం తెరచిన పుస్తకం. ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా



## ఎవరికెన్ని ఓట్లు?



అనుకున్నట్టే ద్రౌపది ముర్ము భారత 15వ రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. తలలు కూడని విపక్షాలు ఆపసోపాలుపడి ఎట్టకేలకు ఉమ్మడి అభ్యర్థిగా ఎంపికచేసిన యశ్వంత్ సిన్హాపై, ఆమె 2,96,626 ఆధిక్యంతో గెలుపొందారు. రిటర్నింగ్ అధికారి పి.సి. మోదీ ప్రకటించిన ప్రకారం ద్రౌపది ముర్ముకు మొత్తం 6,76,803 ఓట్లు రాగా, విపక్ష అభ్యర్థి యశ్వంత్‌సిన్హాకు 3,80,177 ఓట్లు దక్కాయి. పోలైన 4754 ఓట్లలో చెల్లిన ఓట్లు 4701. నిజానికి మూడో రౌండ్‌కే ద్రౌపది ముర్ముకు 51% ఓట్లు రావడంతో గెలుపు ఖాయమైపోయింది. మొత్తం పోలైన ఓట్ల విలువ 10,72,377 (ఓట్లు 4754) కాగా, చెల్లిన వాటి విలువ 10,56,980 (ఓట్లు 4701), చెల్లని ఓట్లు 53 (వీటి విలువ 15,397). చెల్లని 53 ఓట్లలో 15 పార్లమెంట్ సభ్యులవి, 38 ఎమ్మెల్యేలవి. ముర్ముకు దక్కినవి 2,824 (6,76,803). అంటే 64.03%. యశ్వంత్ సిన్హాకు దక్కినవి 1877 (3,80,177). అంటే 35.97%. 2017లో రామ్‌నాథ్ కోవింద్‌కు వచ్చిన 65.65% ఓట్లకంటే ద్రౌపదికి కొంచెం తగ్గాయి. కానీ అప్పటి విపక్ష అభ్యర్థి మీరాకుమార్‌కు వచ్చిన 34.35% ఓట్లకంటే, ప్రస్తుత అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు కొంచెం ఎక్కువ రావడం గమనార్హం. ★

**విపక్షాలు తమ అభ్యర్థిగా కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మార్గరెట్ ఆల్వా పేరును ప్రతిపాదించాయి. ఆల్వా గతంలో రాజ్యసభ సభ్యురాలుగా, కేంద్రమంత్రిగా, గవర్నరుగా పనిచేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికను బహిష్కరిస్తున్నట్లు టీఎంసీ చేసిన ప్రకటన వెనక వేరే కారణం ఉంది. మమత సహా అన్ని విపక్షాలు ఒక్కటైనంత మాత్రాన అవి ధన్‌ఖడ్ విజయాన్ని నిలువరించలేవు. రాష్ట్రపతి ఎన్నిక మాదిరిగా కాకుండా ఉప రాష్ట్రపతిని పార్లమెంటు ఉభయ సభ్యులు ఎన్నుకుంటారు. ఇందులో బీజేపీ మెజార్టీ స్పష్టం.**

అభిమానించాల్సిన మహిళ. ఏ కోణంలో చూసినా వంక పెట్టాల్సిన అవసరం కనపడదు.

ముర్మును ఎంపిక చేసినందుకు భాజపాను అభినందించాలి. కానీ ఆపాటి పరిణతి విపక్షాలకు కొరవడింది. ప్రజాస్వామ్యంలో పోటీ అనేది ప్రాథమిక లక్షణం. దానిని కాదనలేం. ఓడిపోతామని తెలిసినా పోటీ చేయడంలో తప్పులేదు. పోటీ అన్నది ప్రజాస్వామ్య స్ఫూర్తి. అదే సమయంలో వాస్తవాలను గమనించకుండా గుడ్డిగా వ్యతిరేకించడం కూడా సమంజసం అనిపించుకోదు. ప్రజాస్వామ్యంలో పోటీ ఎంత ముఖ్యమో, మంచి అభ్యర్థికి మద్దతు ఇవ్వడం కూడా అంతే ముఖ్యమన్న సంగతిని మరవరాదు. ఒక్క 1969లో తప్ప మిగిలిన ఎన్నికల్లో విజేత ఎవరన్నది ముందే తెలిసిపోయింది. అప్పట్లో అధికార కాంగ్రెస్ అభ్యర్థి నీలం సంజీవరెడ్డిని కాదని నాటి ప్రధాని ఇందిరాగాంధీ వీవీ గిరిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దించారు. చివరికి గిరి గెలిచారు. అది మినహా మిగిలినవన్నీ ఏకపక్ష ఎన్నికలే. ఈ విషయం తెలిసీ విపక్షాలు సిన్హాను బరిలోకి దించి అభాసు పాలయ్యాయి. అప్రతిష్టను మూటగట్టుకున్నాయి. వాటి బలహీనతను అవే పరోక్షంగా చాటుకున్నాయి. ఇది కాదనలేని సత్యం.

ఇక ఉప రాష్ట్రపతి పదవికి అభ్యర్థి ఎంపికలోనూ విపక్షాలు వివేచనను ప్రదర్శించలేకపోయాయి. ప్రభుత్వానికి సహకరించడాన్ని పక్కనపెడితే కనీసం అవి ఒక్కతాటిపై నిలబడలేకపోయాయి. రాష్ట్రపతి ఎన్నిక దగ్గర స్వైరవిహారం చేసిన మమతా బెనర్జీ ఉపరాష్ట్రపతి ఎన్నికల దగ్గర కాడి దించేశారు. అసలు ఓటే వేయడం లేదని ప్రకటించారు. అభ్యర్థి ఎంపిక విషయంలో తమను ఆలస్యంగా పరిగణనలోనికి తీసుకున్నారని మమతా బెనర్జీ అర్థం పర్థం లేని విమర్శలకు దిగారు. ఎన్డీఏ ప్రతిపాదించిన జగదీప్ ధన్‌ఖడ్‌కు మద్దతిచ్చే ప్రసక్తి లేదని కూడా స్పష్టం చేశారు. నిన్నమొన్నటి వరకు బెంగాల్ గవర్నర్‌గా వ్యవహరించిన ధన్‌ఖడ్‌తో మమతా బెనర్జీ ఉప్పు నిప్పుగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. అంతిమంగా విపక్షాలన్నీ ఎవరికి వారే యమునాతీరే అన్న చందాన వ్యవహరించాయి. తద్వారా తమలోని లోపాలను, అనైక్యతను బయట పెట్టుకున్నాయి.

విపక్షాలు తమ అభ్యర్థిగా కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మార్గరెట్ ఆల్వా పేరును ప్రతిపాదించాయి. ఆల్వా గతంలో రాజ్యసభ సభ్యురాలుగా, కేంద్రమంత్రిగా, గవర్నరుగా పనిచేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికను బహిష్కరిస్తున్నట్లు టీఎంసీ చేసిన ప్రకటన వెనక వేరే కారణం ఉంది. మమత సహా అన్ని విపక్షాలు ఒక్కటైనంత మాత్రాన అవి ధన్‌ఖడ్ విజయాన్ని నిలువరించలేవు. రాష్ట్రపతి ఎన్నిక మాదిరిగా కాకుండా ఉప రాష్ట్రపతిని పార్లమెంటు ఉభయ సభ్యులు ఎన్నుకుంటారు. ఇందులో బీజేపీ మెజార్టీ స్పష్టం. విపక్షాల అభ్యర్థి ఓటమి ముందే రాసి పెట్టి ఉంది. ఈ విషయం గమనించే టీఎంసీ దూరంగా ఉంది. అందువల్లే విపక్షాల అభ్యర్థి మార్గరెట్ ఆల్వా నామినేషన్ కార్యక్రమాన్ని మమత పార్టీ బహిష్కరించింది. కార్యక్రమంలో లోక్‌సభ, రాజ్యసభలో కాంగ్రెస్ పక్షం నేతలు అధీర్ రంజన్ చౌధరి, మల్లికార్జున ఖర్గే, సంజయ్ రౌత్ (శివసేన), రామ్ గోపాల్ యాదవ్ (ఎస్పీ), తిరుచ్చి శివ (డీఎంకే), సీతారాం ఏచూరి (సీపీఎం), డి.రాజా (సీపీఐ), వైగో (ఎండీఎంకే) తదితర నేతలు మాత్రమే పాల్గొన్నారు. టీఎంసీ, ఆప్ పార్టీల నేతలు పాల్గొన లేదు. ఆల్వా అభ్యర్థిత్వంపై టీఎంసీ అభ్యంతరం పెట్టడంలో అర్థం లేదు. ఆమె అనుభవం గల నాయకురాలు. ఉన్నత విద్యావంతురాలు. అభ్యర్థి ఎంపికలో తనను విస్మరించారంటూ టీఎంసీ వాదించడంలో పసలేదు. రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికలో మాదిరిగా ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికలో చొరవ చూపుతానంటే మమతను కాదనే వారు ఎవరూ లేరు. ఆమెను కాదని హడావిడి చేసేంత ఆసక్తి గల నాయకులు కూడా విపక్ష శిబిరంలో లేరు. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ నానా కష్టాల్లో ఉంది. మహారాష్ట్రలో ఎంవీయే సంకీర్ణ సర్కారు పతనంతో శరద్ పవార్ అచేతనంగా ఉన్నారు. ఇంతకు మించి పెద్ద పార్టీలు గానీ, చురుకైన నాయకులు గానీ విపక్షంలో లేరు. అలాంటప్పుడు మమత చొరవ తీసుకుంటే అభ్యంతర పెట్టేవారు లేరు. కేవలం తాను వ్యతిరేకించిన జగదీప్ ధన్‌ఖడ్ దేశంలో రెండో అత్యున్నత పదవిని చేపట్టడం ఖాయమని తేలిన క్షణం నుంచి ఆమెకు ఏమీ పాలుపోవడం లేదు. అంతకుమించి మరో కారణం లేదన్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో వినపడుతున్నాయి. మొత్తానికి దేశ అత్యున్నత పదవులకు అభ్యర్థుల ఎంపికలో, ఎన్నికలో విపక్షాల డొల్లతనం, వైఫల్యం, అనైక్యత, అవగాహనా రాహిత్యం స్పష్టంగా కనపడింది.



ఈ నేపథ్యంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీని విపక్షాలు ఎలా ఢీకొనగలవన్న ప్రశ్న ఉత్పన్నమవడం సహజం. రేపటి పార్లమెంటు ఎన్నికల్లో సైతం నరేంద్ర మోదీ నాయకత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ ప్రభుత్వం మళ్లీ అధికార పీఠాన్ని అధిష్టించ గలదన్న ఆత్మ విశ్వాసం ఆ కూటమి శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఘన విజయంతో ఊపు మీదున్న ఎన్డీఏ కూటమి రేపటి ఎన్నికల్లో శరవేగంగా దూసుకు పోయేందుకు సమాయత్తమవుతోంది.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**

**ప్రతి మనిషికీ ఆహారం, నివాసంతో పాటు వస్త్రం కూడా కూడా అత్యవసరం. మన దేశంలో వ్యవసాయం తర్వాత రెండో అతిపెద్ద ఉపాధి అవకాశాలు చేనేత రంగంలోనే ఉన్నాయి. కానీ మరమగ్గాల ధాటికి చేనేత మగ్గాలు కుదేలైపోయాయి. ఈ రంగంపై ఆధారపడిన వారి పరిస్థితి రోజు రోజుకీ దుర్భరంగా మారుతోంది. చేనేత రంగాన్ని, నేతన్నలను ఆదుకోవడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 2015 నుంచి ఏటా ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సంగా జరుపుకుంటున్నారు. చేనేతలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది.**




# మరమగ్గాల

భారతీయ వస్త్ర పరిశ్రమ ఎంతో ప్రాచీన మైనది. చేనేత రంగం వారసత్వంగా వస్తోంది. భారతదేశ వస్త్ర సంప్రదాయం ప్రపంచానికే ఆదర్శమైంది. మనకు అందుబాటులో ఉన్న చరిత్ర ప్రకారం, హరప్పా నాగరికతలో ప్రజలు నూలుతో తయారు చేసిన వస్త్రాలను ధరించిన ఆనవాళ్లను చూడవచ్చు. వేద సాహిత్యంలో కూడా ఈ ప్రస్తావన కనిపిస్తుంది. ఈజిప్టులోని ఫుస్టాట్ సమాధుల్లో గుజరాత్ నుంచి దిగుమతి అయిన పత్తి ఆనవాళ్లు కనిపిస్తాయి. భారతదేశ పత్తి, పట్టు వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో డిమాండ్ ఉండేది. అగ్గిపెట్టెలో పట్టేంత చీరను నేసే నైపుణ్యం భారతీయ నేతన్నలకు ఉండేది.

అప్పట్లో భారతీయ వస్త్రాలు సిల్క్ రూట్ ద్వారా పశ్చిమ దేశాలకు రవాణా అయ్యాయి. సముద్ర మార్గంలో కూడా అనేక దేశాలకు మన దేశం నుంచి నాణ్యమైన వస్త్రాలు ఎగుమతి అయ్యేవి. ఈ పరిశ్రమ ఆధారంగానే భారత్ సుసంపన్నంగా ఉండేది. పాశ్చాత్యులు మన దేశాన్ని బంగారు పిచ్చుక (సోనేకి చిడియా)గా అభివర్ణించారు. 17,18 శతాబ్దాల నాటికి ప్రపంచ వస్త్ర వ్యాపారంలో 25 శాతం వాటా భారత్‌దే. మొఘలుల కాలంలో బ్రిటన్‌కు ఈస్టిండియా కంపెనీతో పాటు ఫ్రెంచ్, పోర్చుగీస్, డచ్ కంపెనీలు మన దేశం నుంచి 85 శాతం మేర యూరోప్‌కు వస్త్ర వ్యాపారం సాగించారు.

**స్వాతంత్ర్య సమరంలో పాత్ర**

భారతదేశం నుంచి వచ్చే నాణ్యమైన పత్తితో యూరోప్ దేశాల్లోని పరిశ్రమలు బానిసల ద్వారా చౌకగా వస్త్రాలను తయారుచేసేవి. బ్రిటిష్ సామ్రాజ్యంలో బానిసత్వాన్ని రద్దు చేసిన తర్వాత అక్కడి పరిశ్రమలకు కష్టకాలం వచ్చింది. కారుచౌకగా, పెద్ద మొత్తంలో పత్తి కోసం భారత్‌లో వ్యవసాయరంగాన్ని దెబ్బతీశారు. ఫలితంగా మన దేశంలో ఆహార సంక్షోభం ఏర్పడింది. అదే సమయంలో బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం కారణంగా యంత్రాల మీద వస్త్రాల తయారీ మొదలైంది.

బ్రిటిష్ ప్రభుత్వం మన దేశం నుంచి చౌకగా ముడిసరుకు తీసుకెళ్లి, అక్కడి పరిశ్రమల్లో తయారు చేసిన వస్త్రాలను మన దేశంలో విక్రయించేది. దీనికి పన్నులను మినహాయించారు. అదే సమయంలో దేశీయ వస్త్ర పరిశ్రమలపై పన్నుల భారాన్ని పెంచారు.

బ్రిటిష్ ప్రభుత్వ విధానాలతో దేశీయ వస్త్ర పరిశ్రమ కుదేలైపోయింది. దీంతో స్వరాజ్య ఉద్యమంలో విదేశీ వస్త్రాల బహిష్కరణ నినాదం చేరింది. దేశ ప్రజలంతా స్వదేశీ వస్తువులనే ధరించాలనే సందేశం బలంగా వెళ్లింది. 1905 ఆగస్టు 7న కలకత్తా టౌన్ హాలులో నిర్వహించిన భారీ సమావేశంలో నేతలంతా విదేశీ వస్త్రాలను బహిష్కరించి, స్వదేశీ వస్త్రాలు ధరించి దేశీయోత్ప త్తుల పునరుద్ధరణకు పిలుపునిచ్చారు. అదే సమయంలో రాట్నంపై నూలు వడికి తయారు చేసిన వస్త్రాలనే ధరించాలని మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపు దేశాన్ని కదిలించింది.

**మర మగ్గాలతో చేనేతల కష్టాలు**

ప్రపంచానికి వస్త్ర నాగరికతను నేర్పిన భారతీయ చేనేతలకు కష్టాలు కొత్తగా వచ్చినవి కాదు. చిన్న చేపను పెద్ద చేప మింగినట్లుగా.. చేనేత మగ్గాలను మరమగ్గాలు (పవర్‌లూమ్స్) మింగేశాయి. ఇప్పుడు ఆధునిక మగ్గాలు మింగేస్తున్నాయి. కాళ్లు, చేతులు ఆడిస్తూ బట్టను నేసే నేత కార్మికుల బతుకు దుర్భరంగా మారింది. 2019-20 నాటికి మన దేశంలో 26,73,891 మంది చేనేతలు ఉన్నారు. వీరుకాకుండా మరో 8,48,621 మంది అనుబంధ రంగాల్లో ఉపాధి పొందుతున్నారు. మొత్తం మీద 35,22,512 మంది చేనేత రంగం మీద ఆధారపడి జీవిస్తున్నారు. మనదేశంలో వ్యవసాయరంగం తర్వాత అత్యధికులు చేనేత పరిశ్రమ ద్వారానే ఉపాధిని పొందుతున్నారు.

మన చేనేతల్లో అంకితభావం, పట్టుదల, నైపుణ్యం, దానిని ప్రదర్శించే ఓరిమి ఉన్నాయి. చేనేత కార్మికులు మిల్లులతో పోటీ పడి ఆకర్షణీయ మైన డిజైన్లలో చీరెలు, దుప్పట్లు, కర్టెన్లు తయారు చేస్తున్నారు. విదేశాల్లో మన చేనేత వస్త్రాలకు మంచి గిరాకీ ఉంది. అంతర్జాతీయంగా, జాతీయంగా జరిగే వస్త్ర ప్రదర్శనల్లో చేనేత వస్త్రాలు ఎన్నో అవార్డులను గెల్చుకున్నాయి. ఇప్పటికీ గెల్చుకుంటున్నాయి. అయితే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ముందుకు వెళ్లలేక పోటీ ప్రపంచంలో నేతన్నలు నెగ్గుకు రాలేకపోతున్నారు.

# ధాటికి 'చేనేత'ల వెతలు



**ఆగస్టు 7 జాతీయ చేనేత దినోత్సవం**

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా విదేశీ వస్త్రాలను బహిష్కరించాలన్న లక్ష్యంతో స్వదేశీ ఉద్యమం చేనేత రంగంతో మొదలైంది. కలకత్తా టౌన్ హాల్‌లో 1905 ఆగస్టు 7న భారీ సమావేశం నిర్వహించి, విదేశీ వస్త్రాలను బహిష్కరించి, స్వదేశీ వస్త్రాలు ధరించి దేశీయోత్పత్తుల పునరుద్ధరణకు పిలుపునిచ్చారు. అప్పటి స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన చేనేత రంగానికి గుర్తింపునిస్తూ ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. 1905లో ఇదే రోజున కలకత్తాలో జరిగిన సభలో స్వదేశీ వస్త్రాలను ధరించాలని పిలుపునివ్వడం తెలిసిందే. 2015 ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రధాని మోదీ చెన్నైలోని మద్రాసు యూనివర్సిటీలో అధికారికంగా ప్రారంభించారు. 2014లో రాజ్‌ఘాట్‌లో చేనేత దినోత్సవ ర్యాలీకి ముఖ్యఅతిథిగా వచ్చిన అప్పటి కేంద్ర జౌళీశాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రధానితో చర్చించి చేనేత దినోత్సవాన్ని అధికారికం నిర్వహిస్తామని మాటిచ్చారు. ఈ మేరకు 2015 జూలై 29న భారత ప్రభుత్వం ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా అధికారిక గెజిట్ విడుదల చేసింది. చేనేత పరిశ్రమ గురించి ప్రజలలో అవగాహన కల్పించడం, సామాజిక-ఆర్థిక అభివృద్ధికి సహకారం అందించడం జాతీయ చేనేత దినోత్సవ లక్ష్యం.

**చేనేతల సంక్షేమమే లక్ష్యంగా కార్యక్రమాలు**

చేనేత కార్మికుల అభివృద్ధి సంక్షేమం కోసం కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ చేనేత అభివృద్ధి కమిషనర్ ద్వారా నాలుగు ప్రధాన కార్యక్రమాలను చేపట్టింది. అవి. 1. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం (NHDP), 2. సమగ్ర చేనేత క్లస్టర్ అభివృద్ధి పథకం (CHCDS), 3. చేనేత నేత కార్మికుల సమగ్ర సంక్షేమ పథకం (HWCWS), 4 నూలు సరఫరా పథకం (YSS)

ఈ పథకాల కింద ముడి సరుకులు, మగ్గాలు, ఉపకరణాల కొనుగోలు, డిజైన్ ఆవిష్కరణ, ఉత్పత్తుల వైవిధ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, నైపుణ్యాల పెంపుదల, లైటింగ్ యూనిట్లు, చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్, రాయితీ ధరలకు రుణం కోసం ఆర్థిక సహాయం అందిస్తారు.

2015-16లో నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (NHDP) ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా బ్లాక్ లెవల్ క్లస్టర్ (BLC)లను ఏర్పాటు చేసి ఆర్థిక సహాయం. స్కిల్ అప్‌గ్రేడేషన్, హత్కర సంవర్ధన్ సహాయత (హెచ్ఎస్ఎస్), ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, వర్క్‌షెడ్ నిర్మాణం కార్యక్రమాలను అమలు చేస్తారు.

జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమంలో చేనేత మార్కెటింగ్ సహాయం ఒకటి. తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించడానికి మార్కెటింగ్ ప్లాట్‌ఫారమ్‌ను అందించడానికి, దేశీయ, విదేశీ మార్కెట్‌లలో మార్కెటింగ్ ఈవెంట్‌లను నిర్వహించడానికి చేనేత ఏజెన్సీలకు ఆర్థిక సహాయం అందిస్తారు.

చేనేత కార్మికులకు 6 శాతం రాయితీ వడ్డీ రేటుతో వీవర్స్ ముద్ర పథకం కింద రుణం అందిస్తారు. మార్జిన్ మనీ సహాయం ప్రతి నేతకు గరిష్ఠంగా రూ.10,000 ఉంటుంది. మూడు సంవత్సరాల కాలానికి క్రెడిట్ గ్యారెంటీ కూడా అందిస్తారు. మార్జిన్ మనీ, వడ్డీ రాయితీ కోసం నిధుల పంపిణీలో జాప్యాన్ని తగ్గించడానికి పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తో కలిసి ముద్ర పోర్టల్ అభివృద్ధి చేశారు. చేనేత ఉత్పత్తుల ఉత్పాదకత, నాణ్యతను మెరుగుపరచడం ద్వారా వారి ఆదాయాలను పెంచడానికి నేత కార్మికులకు మగ్గాలు, ఉపకరణాలను అందించాలనే లక్ష్యంతో 2016 డిసెంబర్ 1న హెచ్ఎస్ఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద, మగ్గం/ ఉపకరణాల ఖర్చులో 90 శాతం భారత ప్రభుత్వం భరిస్తుంది, మిగిలిన 10 శాతం లబ్ధిదారులు భరించాలి. భారత ప్రభుత్వ వాటాను నేరుగా లబ్ధిదారుని బ్యాంక్ ఖాతాలో విడుదల చేస్తారు

చేనేత కార్మికులు, వారి కుటుంబాలకు విద్యా సౌకర్యాలు కల్పించేందుకు ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్శిటీ (ఇగ్నో), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (NIOS)తో టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ అవగాహన ఒప్పందాలపై సంతకం చేసింది.

చేనేత కార్మికుల కోసం దూరవిద్య విధానం ద్వారా డిజైన్, మార్కెటింగ్, వ్యాపార అభివృద్ధి మొదలైన ప్రత్యేక విషయాలతో సెకండరీ, సీనియర్ సెకండరీ స్థాయి విద్యను NIOS అందిస్తోంది..

2015 జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా 'ఇండియా హ్యాండ్లూమ్' బ్రాండ్‌ను ప్రధాన మంత్రి ప్రారంభించారు. అత్యధిక నాణ్యత ఉన్న చేనేత ఉత్పత్తుల బ్రాండింగ్ కోసం దీన్ని ప్రారంభించారు. ఇది పర్యావరణహిత, ప్రామాణిక, సాంప్రదాయ డిజైన్లతో చేనేత ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది.

మిల్ గేట్ ధరలో అన్ని రకాల నూలును అందుబాటులో ఉంచేందుకు దేశవ్యాప్తంగా నూలు సరఫరా పథకం ప్రారంభించారు. నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు.

చేనేత కార్మికుల సమగ్ర సంక్షేమ పథకం కోసం వీవర్స్ కాంప్రహెన్సివ్ వెల్ఫేర్ స్కీమ్ (HWCWS), ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY), ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (PMSBY), కన్వర్జ్ మహాత్మా గాంధీ బంకర్ బీమా యోజన (MGBY) అమలు చేస్తున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్




# దైవమాన్యాల మీదే

వైకాపా ప్రభుత్వం దేవాలయాల ఆస్తులపై కన్నేసింది. బ్యాంకుల్లో ఫిక్సడ్ డిపాజిట్‌లుగా వేసిన ఆలయాల ఆదాయాన్ని విత్ డ్రా చేయడం ప్రారంభించింది. ఆలయ ఇఓలు ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి శ్రీ వినాయక స్వామి వారి ఆలయంలో రూ.30 లక్షలు, నెల్లూరు మూల స్థానేశ్వరస్వామి ఆలయం నుంచి రూ.30 లక్షలు, సింగరాయపాలెం సుబ్రహ్మణ్యస్వామి ఆలయం నుంచి రూ.20 లక్షలు, యనమలకుదురు రామలింగేశ్వరస్వామి వారి ఆలయం నుంచి రూ.30 లక్షలు, వేదాద్రి యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి రూ.60 లక్షలు, కోటి లింగాల క్షేత్రం నుంచి రూ.40 లక్షలు విత్‌డ్రా చేసి ప్రభుత్వానికి చెందిన కామన్ గుడ్ ఫండ్ ఖాతాలో జమచేశారు. మొత్తం రూ.300 కోట్లకు మించి నిధులను సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తనకు లేని హక్కులతో ప్రభుత్వం ఏ రకంగా ఈ నిధులను తన ఖాతాలోకి జమచేసుకుంటుందని హిందూ పరిరక్షణ సంస్థలు ప్రశ్నిస్తున్నాయి. దేవాలయాలకు ఏనాడూ రూపాయి ఇవ్వని ప్రభుత్వాలకు ఆలయాల ఆస్తులను తీసుకునే హక్కులేదని మండిపడుతున్నాయి. దేవాలయాల భూములు కబ్జాకు గురౌతున్నా పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు డబ్బును కూడా దోచేయడానికి పన్నిన పన్నాగంగా అగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కొందరు ఆర్థిక నిపుణులైతే ఆర్థికంగా దివాళా తీసిన ప్రభుత్వం చిట్టచివరకు దేవుడి డబ్బును కూడా తీసుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శిస్తున్నారు.



తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

హిందువులు ఆలయాలను సందర్శించినపుడు హుండీల్లో కానుకలు వేస్తారు. కొందరు దాతలు పెద్ద ఎత్తున డబ్బు, భూములు స్వామివారికి కానుకగా సమర్పిస్తారు. ఈ నిధుల్లో కొంత ఆలయ నిర్వహణకు వాడుతూ, మిగిలిన సొమ్మును బ్యాంకుల్లో ఫిక్సడ్ డిపాజిట్లు చేసి వచ్చే వడ్డీతో ఆలయ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. రాష్ట్రం మొత్తంమీద 1500 వరకు వివిధ స్థాయిల్లో ఆదాయాలు కలిగిన ఆలయాలున్నాయి. ఈ ఆలయాలు బ్యాంకుల్లో దాచిన నిధుల నుంచి సుమారు రూ.500 కోట్ల వరకు తీసుకుని వాడుకునేందుకు ప్రభుత్వం జీవోలు జారీచేసింది. దేవాలయ ఖర్చులు పోను రూ.2 లక్షల ఆదాయం మిగిలిన ఆలయాలు 21.5 శాతం ప్రభుత్వానికి జమచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో కామన్ గుడ్ ఫండ్‌కు 9 శాతం, అడ్మినిస్ట్రేషన్‌కు 8 శాతం, అర్చకుల సంక్షేమ నిధికి 3 శాతం, ఆడిట్ ఖర్చులకు 1.5 శాతం మొత్తం కలిపి 21.5 శాతం అవుతుంది. అర్చకుల సంక్షేమ నిధికి జమచేయడాన్ని హిందూ సంస్థలు తప్పుపట్టడం లేదు. కాని కామన్‌గుడ్ ఫండ్‌కు, అడ్మినిస్ట్రేషన్ విభాగానికి జమచేయడాన్నే హిందూ సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. ఇక దేవాదాయ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు కొందరు ఈఓలు కొన్ని దేవాలయాల్లో ఫిక్సడ్ డిపాజిట్లను రద్దుచేసి ఈ నిధులను కామన్ గుడ్‌ఫండ్‌కు బదిలీ చేశారు. ఇదే ఇప్పుడు హిందువుల ఆగ్రహానికి కారణమైంది.

**పథక రచన**

కామన్ గుడ్ ఫండ్‌లోకి (సీజీఎఫ్) జమచేసిన మొత్తాన్ని తమ చిత్తం వచ్చినట్లు ఖర్చు చేసుకునేందుకు పథక రచన జరిగినట్లు హిందూ సంస్థలు ఆరోపిస్తు న్నాయి. సీజీఎఫ్‌ను 40 లక్షలకు మించి వసూలు చేయరాదనే నిబంధన ఉన్నా దానిని మార్చేసుకున్నారు. అప్పటి మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు దేవాదాయ శాఖ నుంచి రూ.40 కోట్లు డ్రా చేసి తన నియోజకవర్గంలో ఖర్చుచేసినట్లు ఆరోపిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో మొదట రూ.5 కోట్లు కామన్ గుడ్ ఫండ్‌కు బదిలీ చేయగా, దానిని రూ.50 కోట్లకు పెంచారు. ఇది రానురాను ఇంకా పెరిగే అవకాశం ఉంది.

**ఈ ప్రభుత్వం దేవాలయాలకేం ఇచ్చింది?**

ఈ ప్రభుత్వం దేవాలయాల నుంచి తీసుకునే ముందు అసలు దేవాలయాలకు ఏం ఇచ్చారనేది ఆలోచించాలి. మొదటి నుంచి ఏపీలో రాష్ట్ర ప్రభుత్వాలేవీ దేవాదాయ శాఖకు నిధులు ఇవ్వడం లేదు. ఆలయాల నిర్వహణ పేరుతో ఏర్పడిన దేవాదాయ శాఖ దేవాలయాలకు వచ్చే ఆదాయాన్ని వాటిని ఉద్ధరించడానికన్నా దుర్వినియోగానికే ఎక్కువగా పాల్పడిందని హిందూ సంస్థలు ఆరోపిస్తున్నాయి. రాజకీయ పార్టీలు దేవాలయ కమిటీల పేరుతో రాజకీయ నిరుద్యోగులకు పదవులివ్వడంతో అనర్హులు సైతం ఆలయాలపై పెత్తనాన్ని చేస్తున్నారు. వీరంతా పదవుల పేరుతో దేవాలయ ఆస్తులను దిగమింగడం మినహా ఏనాడూ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ఆలయాలకు తీసుకు రాలేదు. ఆలయాల అభివృద్ధిపై అసలు దృష్టి కేంద్రీకరించ లేదు. దేవాలయం కేంద్రంగా భక్తుల నుంచి దర్శన టికెట్లు, సర్వీసులకు ప్రత్యేక టిక్కెట్లు వసూలు చేస్తు న్నారు. నేరచరిత ఉన్నవారు, దేవుడంటే విశ్వాసం లేని వారు కూడా దేవాలయ కమిటీ సభ్యులు, ఛైర్మన్‌లుగా పదవులు అనుభవిస్తున్నారు. ఈ అంశాన్ని కోర్టు కూడా తప్పుపట్టింది.

**ప్రభుత్వానికి హక్కు ఎక్కడిది?**

పూర్వం ఆలయాలకు ప్రభువులు కొంత నిధులిచ్చి వాటి జోలికి మాత్రం వెళ్లేవారు కాదు.



# సర్కారు కన్ను

అంతేకాదు దాతలు ఇచ్చిన భూములు, నిధులు అన్నీ కూడా ఆలయాలకే చెందుతాయి. అందుకే దేవుడి మాన్యం అంటారు. వాటిపై ప్రభుత్వానికి ఏ విధమైన హక్కులు లేవు.

కరవుతో ఆర్థికపరమైన ఇబ్బందులు ఏర్పడి ప్రజలు తిండిలేక అల్లాడి పోతుంటే అప్పుడు కూడా ప్రభుత్వం దివాళ తీసినట్లు ప్రకటించి దేవాలయ సొమ్మును వాడుకునేవారు. ఏపీ ప్రభుత్వం మాత్రం దమ్మిడి ఇవ్వకపోగా దేవాలయ సొమ్మును వాడేయాలని చూస్తోందని పరిపూర్ణానంద స్వామి ఆరోపిస్తున్నారు. 'ఆలయాల నుంచి డబ్బులు వసూలు చేసే ప్రభుత్వానికి చర్చిలు, మసీదుల నుంచి డబ్బును తీసుకునే దమ్ముందా?' అని అఖిల భారత హిందూ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవిఆర్ శాస్త్రి సవాల్ విసిరారు. ఆలయాల డబ్బును వాడుకునే హక్కు ఎవరికీ లేదని అంటున్నారు. దీనిపై న్యాయపరంగా ముందుకెళ్తామని కూడా హెచ్చరిస్తున్నారు. కామన్ గుడ్ ఫండ్ అనేది ముఖ్యమంత్రి విచక్షణాధికారానికి లోబడి ఉంటుందని, కానీ ఇందులో జమ అయిన దేవాలయాల నిధులను అన్యమతస్థులకు పంచి, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా పాలన సాగుతోందని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని భాజపా రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు బహిరంగ లేఖ ద్వారా విమర్శించారు. దేవాలయాల విషయంలో కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్న అనుమానాలు బలపడే విధంగా ప్రభుత్వ ఆదేశాలు కనపడుతున్నాయని, అందువల్ల దేవాలయాల అస్తుల విషయంలో ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**హిందూ వ్యతిరేక విధానాలు**

వైకాపా ప్రభుత్వం ఆది నుంచి హిందూ వ్యతిరేక విధానాలు అవలంబిస్తోంది. అన్యమతాలను ప్రోత్సహిస్తూ, హిందూ మతాన్ని అవమానిస్తోంది. దేవాయాల అభివృద్ధి మాట అటుంచి వాటి పరిరక్షణ చర్యలు కూడా ప్రభుత్వం చేపట్టడం లేదు.

దేవాలయాలపై దాడులు జరుగుతున్నా, విగ్రహాలు ధ్వంసం చేస్తోన్నా, ధర్మ పరిరక్షణకు హాని జరుగుతున్నా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ నిధుల నుంచి చర్చిల నిర్మాణానికి నిధులు కేటాయిస్తోంది. చర్చి ఫాస్టర్లు, ముల్లాలకు జీతాలిస్తోంది. తన ఓటు బ్యాంకు రాజకీయాలకు ఉన్నవి లేనివి అప్పులు చేసి వచ్చిన డబ్బును పంచేస్తుంది. ఇప్పుడవి చాలక దేవాలయాలకు భక్తులు వేసిన కానుకల సొమ్ముపై ప్రభుత్వం కన్ను పడింది. దీనిపై హిందువులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ★

# హిజాబ్ జారిందని..

ఇదీ బెంగాలీ మైనారిటీల నిర్వాకం. ప్రతి దానికి ముస్లింలను వెనకేసుకొచ్చే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ విషయం గురించి ఎలా స్పందిస్తారు? అసలు స్పందిస్తారా? దక్షిణ దినాజ్‌పూర్‌లోని హిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక పాఠశాలలో ఒక ఉపాధ్యాయురాలిని జూన్ 22వ తేదీన వివస్త్రను చేసి, చావగొట్టారు. అక్కడి త్రిమోహిని ప్రతాప్‌చంద్ర ఉన్నత పాఠశాలలో ఇదంతా జరిగింది. ఇంతకీ ఆ ఉపాధ్యాయురాలు చేసిన తప్పు– అంతకు ముందు రోజు తరగతికి రాకుండా ఎగ్గొట్టిన ఒక ముస్లిం బాలికను ఒక దెబ్బ వేయడమే. ఎందుకు రాలేదని నిలదీయడమే. దీనితో ఆ పిల్ల తల్లిదండ్రులు, వాళ్ల సైన్యం వచ్చి స్కూలు మీద పడింది. మొదట బయట నిరసన చేసినప్పటికీ తరువాత లోపలికి చొరబడి ఉపాధాయ సిబ్బంది కూర్చునే గదిలోకి చొరబడి ఈ దారుణానికి పాల్పడ్డారు. బండబూతులు తిట్టారు.



పోలీసులకు ఈ సంగతి తెలిసి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఈ కేసుకు సంబంధించి నలుగురిని అరెస్టు చేశారు. దీని మీద పాఠశాల యాజమాన్యం కూడా ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఏ వర్గమని కాదు, ఇలాంటి ఉదంతం వింటే ఎవరికైనా రక్తం మరుగుతుంది. అందుకే స్థానికులు కూడా దీని మీద మండిపడుతూ ఆందోళనకు దిగారు. రోడ్లను దిగ్బంధనం చేశారు. ఆదివారం కూడా ఆందోళన కొనసాగుతుండగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందార్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సంఘీభావం ప్రకటించారు. బీజేపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూడా వెంటనే ట్విటర్‌లో దీనిని ఖండించారు.

సుకాంత మజుందార్ చెప్పిన వివరాలు దిగ్భ్రాంతిని కలిగించేవిగా ఉన్నాయి. ఆ ముస్లిం బాలిక చెవిని ఉపాధ్యాయురాలు పట్టుకున్నప్పుడు హిజాబ్ జారిపోవడం వల్లనే ఆమె తల్లిదండ్రులు ఇంత నైచ్యానికి పాల్పడ్డారని ట్వీట్ చేశారాయన. 'నేను కూడా ఒకప్పుడు ఉపాధ్యాయుడినే. ఉపాధ్యాయులకు సంబంధించి ఒక విద్యార్థి అంటే వారు ఎవరైనా విద్యార్థే. ఆ ఉపాధ్యాయురాలు ఆ బాలిక చెవిని తాకినప్పుడు హిజాబ్ జారిన ఫలితంగానే ఇంత రగడ చేశార'ని మజుందార్ ట్వీట్ చేశారు.

ఇంతకీ వందల మంది వచ్చి పాఠశాల మీద దాడి చేసినా మొదట పోలీసులు కేసు పెట్టడానికే భయపడ్డారని మజుందార్ చెబుతున్నారు. ఆఖరికి స్థానికులు ఆందోళనకు దిగడంతో కేసు పెట్టక తప్పలేదు. మొత్తానికి 35 మంది మీద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 'విద్యార్థి ప్రవర్తన సరిగా లేకున్నా, పాఠాలు సరిగా వినకున్నా నేను వాళ్ల చెవి మెలేస్తాను. అవసరమైతే ఒక దెబ్బ వేస్తాను. ఆ రోజు నేను ఆ బాలిక మీద అలాగే ఒక దెబ్బ వేశాను. కానీ ఇలాంటి దారుణం ఇంతకు ముందెన్నడూ జరగలేదు. పరిస్థితి ఇలాగే ఉంటే రెండువేల మంది ఉన్న ఈ పాఠశాలను ఎలా నిర్వహించగలం?' అని ప్రశ్నించారు బాధిత ఉపాధ్యాయురాలు. ★

# హయగ్రీవాసుర హననం..



సమస్త జీవరాశుల సృష్టిలో అలసిన బ్రహ్మను నిద్ర ఆవహించింది. దీర్ఘ నిద్రలోకి జారిపోయాడు. అంతటా గాఢాంధకారం ఆవరించింది. అదే అదనుగా హయగ్రీవుడు అనే సోమకాసురుడు తలాతలం నుంచి సముద్రం మీదకు వచ్చి, గబ్బిలంలాగ బ్రహ్మ నివాసం సత్యలోకానికి ఎగిరాడు. నిద్ర ఆవహించిన బ్రహ్మ ఆవులిస్తున్నప్పుడు, ఆయన నాలుగు ముఖాల నుండి తెలుపు, ఎరుపు, పసుపు, నీలం రంగుల్లో ప్రకాశిస్తున్న నాలుగు వేదాలు వెలుపలికి వచ్చి పక్కనే పడి ఉన్నాయి. సోమకాసురుడు వాటిని తస్కరించుకొని పోయి, సముద్రం అట్టడుగు శిలల పొదల్లో దాచాడు.

హయగ్రీవాసురుడు దేవతలకు, విష్ణువుకు ప్రబల విరోధి. వేదాలు లేకుండా బ్రహ్మ సృష్టి చేయలేడు. కల్పకల్పానికి మంచినీ, ప్రగతినీ పెంపొందించాలనే విష్ణువు సంకల్పాన్ని చెడగొట్టడమే వాడి ఉద్దేశం. ప్రళయ సముద్రం భూమిని ముంచుతున్న సమయంలో, ఎదురు చూస్తున్న సత్యవ్రతుడికి అంధకారంలో దూరంగా చిన్న వెలుగు, చుక్కలా కనిపించి పెద్దదౌతూ సమీపిస్తున్నది సప్తర్షుల కాంతితో నిండిన నావ!

ఓషధులనూ, నానావిధ బీజ సంపదనూ నౌకలోకి చేర్చి సత్యవ్రతుడు అత్యంత భక్తితో నారాయణ సంకీర్తనం చేస్తూ నావలో ప్రయాణిస్తున్నాడు. పెను మత్స్యం ముక్కుపై నిలువుగా పెద్ద కొమ్ము ఉంది.

నక్షత్రంలాగ మెరుస్తున్న ఆ కొమ్ము చివరను చుట్టుకొని ఒక మహాసర్పం పెద్ద తాటితో కట్టినట్లు ఓడను కలిపి పట్టుకొని, పడగవిప్పి ప్రళయ ప్రభంజనాలను పీల్చి దిగమ్రింగుతున్నది. మత్స్యం తన రెక్కలతో కెరటాలను తూలగొడుతూ సముద్రాన్ని చీల్చుకొని, నావను భద్రంగా తీసుకెళుతున్నది.

ధ్రువతార గుర్తుగా నౌక పువ్వులాగ తేలుతూ పయనిస్తూన్నది. సముద్రం అడుగున దాచిన వేదాలకు కాపలా కాస్తూ సోమకాసురుడు సముద్రం లోపల తిరుగుతున్నాడు. నాలుగు వేదాలు నలుగురు శిశువులుగా మారి 'క్యారు' మంటూన్న ఆర్తనాదం లీలగా వినవస్తున్నది. మత్స్యావతారుడు వేదాలను వెతుకుతూ వెళ్లాడు. మహామత్స్యాన్ని చూసి సోమకాసురుడు భీతిల్లుతూనే మొండి ధైర్యంతో ముళ్ళగద నెత్తి ఎదుర్కొన్నాడు.

అప్పుడు విష్ణువు నడుము వరకు మత్స్యంగా చతుర్బాహువులతో అవతరించాడు. మత్స్యమూర్తికీ, సోమకాసురుడికీ ఘోర సంగ్రామం జరిగింది. సోమకాసురుడు సముద్రం అట్టడుగు చేరి పారిపోతుండగా విష్ణువు చక్రం

ఆధ్యాత్మికం

## ❋ తాత్త్వికత ❋

భూమిని తవ్విన ఓ వ్యవసాయదారుడికి ఓ అందమైన విగ్రహం కనిపించింది. దానిని పాత వస్తువులు సేకరించే ఒక వ్యక్తి దగ్గరకు తీసుకుపోయాడు వ్యవసాయదారుడు.

ఆ పాత వస్తువుల సేకరణదారుడు బోలెడంత డబ్బు ఇచ్చి ఆ విగ్రహాన్ని తీసుకున్నాడు.

డబ్బుతో ఇంటికి బయలుదేరిన వ్యవసాయదారుడు 'ఆ మనిషి వొట్టి తెలివి లేని వాడనుకుంటాను. లేకుంటే ఇన్నేళ్ళుగా భూమిలో ఉన్న ఈ విగ్రహాన్ని అంత డబ్బిచ్చి తీసుకుంటాడా! అతనికి డబ్బు విలువ తెలీదనుకుంటాను' అని అనుకున్నాడు మనసులో.

మరోవైపు, పాతవస్తువుల సేకరించే మనిషి, తన దగ్గరకు

దోర్బల పూర్ణిమాస్వాతి

# వేదోద్ధరణ

ప్రయోగించి వాణ్ణి ముక్కలు ముక్కలుగా నరికి హతమార్చాడు. విష్ణువు పసిబిడ్డల రూపంలో ఉన్న వేదాలను ఎత్తుకొని, ఇద్దరేసి పిల్లల్ని చెరో సందిట చేర్చుకొని నీటి మీదికి వచ్చాడు.

పిల్లలు విష్ణువు కంఠహారంలోని శ్రీవత్స, కౌస్తుభమణులను చిట్టి చేతులతో ఆడుకుంటూ కిలకిలా నవ్వుతూ కేరింతాలు కొడుతున్నారు. నలుగురు పిల్లలూ తెలుపు, ఎరుపు, పసుపు, నీలం కాంతితో మెరుస్తున్నారు. విష్ణువు చేతుల్లో శంఖచక్రాలు దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్నాయి. మత్స్యావతారమూర్తిని చూసి ఋషులు, సత్యవ్రతుడు మహదానందంతో మైమరిచి చేతులెత్తి మొక్కుతూ స్తోత్రం చేశారు.

ప్రళయ సముద్రం శాంతించి భూభాగం ఏర్పడుతూన్నది. నౌక క్రమంగా గమ్యం చేరుకొంది. బ్రహ్మకు పగటి ప్రయాణం ఎంతో రాత్రీ అంతే. అతని నిద్రాకాలం పూర్తికావస్తున్నది. సరికొత్త కల్పం ఆరంభమౌతూన్నది. సరస్వతీదేవి ముందుగా లేచి వీణ సవరించి భూపాలరాగాన్ని పలికిస్తూన్నది. బ్రహ్మ మేలుకొని నాలుగు తలల్లో ఏదో వెలితి అనిపించి పరికించి చూస్తే వేదాలు లేవు!

వేదాలు పోగొట్టుకొని దిగులుగా ముఖాలు వేలాడదీసుకుని విచారిస్తుండగా, విష్ణువు మత్స్యావతారంతో వేదాలను తెచ్చి అతనికి ఇచ్చాడు. మత్స్యావతారుడిని కన్నుల పండుగగా తిలకించిన బ్రహ్మ చేతులు జోడించి నాలుగు నోళ్లతో కీర్తించాడు. 'ఓ నారాయణా! నీ మత్స్యావతారాన్ని ధ్యానించిన వారికి ప్రళయంలా ఆపదలు విరుచుకుపడినా తొలిగిపోతాయి. అజ్ఞానాంధకారం పటాపంచలౌతుంది!' శ్లాఘించాడు. మత్స్యావతారం ఎత్తిన కార్యం పూర్తిగా నెరవేరింది. విష్ణువు అంతర్థానమై వైకుంఠం చేరాడు. ★



చేరిన ఆ విగ్రహాన్ని చూసి 'ఆహా! ఎంత అందమైన బొమ్మ. జీవమున్న, అద్భుతమైన విగ్రహం.

ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగి విలువైన విగ్రహాన్ని కేవలం డబ్బు కోసం

# విలువ ఎంత?

అమ్మేసు కుంటాడా! వాడొట్టి వెర్రిబాగులోడిలా ఉన్నాడే. వాడికి ఈ విగ్రహం విలువ తెలిసుండదు. ఎవరైనా ఇలాంటి దానిని అమ్ముతారా?' అనుకున్నాడు తనలోతాను. దేని విలువ అయినా, దాని అవసరం ఉన్న వారికి, దాని ఉపయోగం తెలిసిన వారికి మాత్రమే అవగతమవుతుంది. ★



బంతి చెట్టు వలన చాలా రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఈ బంతి పూలను దండలుగా గుచ్చి పండుగ రోజులలో ఇంటి గుమ్మాలకు వేలాడదీస్తారు. బంతిపూలను పూజా మందిరం సహా అనేక రకాల అలంకరణలకు ఉపయోగిస్తుం టాము. అయ్యప్ప స్వామి పడిపూజలో బంతిపూల ప్రాధాన్యత అంతా ఇంతా కాదు.

అంతేకాకుండా బంతిపూల వలన చాలా రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇది మంచి ఔషధంగా కూడా పనిచేస్తుంది.

1. బంతి ఆకు నుంచి రసం తీసి తాగితే మూర్ఛ, మెదడుకు

# అలంకరణకు.. ఆహ్లాదానికి బంతి



సంబంధించిన వ్యాధులు తగ్గి మెదడుకు మంచి బలం వస్తుంది.

2. చెవి నొప్పితో బాధపడేవారు బంతి ఆకురసాన్ని కొద్దిగా వేడి చేసి చెవిలో వేసుకుంటే ఉపశమనం కలుగుతుంది.

3. బంతి పూవులో ఉండే పూలబొడ్డును దంచి, దీనికి సమ భాగం పంచదార కలిపి ఒక టీ స్పూన్ చొప్పున తీసుకొంటే ఉబ్బసం, దగ్గు తగ్గుతుంది.

4. బంతి ఆకు రసాన్ని ప్రతిరోజు క్రమం తప్పకుండా సేవించటం వలన ఆకలి వృద్ధి అవుతుంది. జీర్ణశక్తి పెరుగుతుంది.

5. స్త్రీలలో ఋతుక్రమం సక్రమంగా జరగటానికి బంతి ఆకుల కషాయాన్ని బెల్లం కలిపి తాగితే మంచి ఫలితం ఉంటుంది.

6. బంతి ఆకులకు మిరియాలు కలిపి నూరి ఆ పేస్టును వారంలో రెండు రోజుల చొప్పున సేవించటం వలన పేగులు శుభ్ర పడి మూలవ్యాధి తగ్గుతుంది. ★

'కానీ వాళ్లు ఇళ్ల దగ్గర ఉండగా మీరు వెళ్లి చూస్తే మంచిది. పనిలో ఉండగా వైద్య పరీక్షలంటే ఎలా?' అన్నాడు బాస్టియన్. 'ఎక్కడైనా వాళ్లందరినీ ఒకచోటకి చేర్చే మేం పరీక్షలు చేస్తాం బాస్టియన్ గారూ!' నచ్చ చెప్పడానికి ప్రయత్నించారు డాక్టర్ మూర్తి. 'ఎంత అమాయకులు డాక్టర్ గారూ! వీళ్లు పీకల దాకా కల్లు తాగి తాటితోపులలోనో, ఈత చెట్ల కిందో పడిపోయి ఉంటారు. అక్కడికి వెళ్లి చేస్తారా పరీక్షలు? లేకపోతే, ఎక్కడో కీకారణ్యంలో వేటాడుతూ ఉంటాడు. వాడి వెనకాలే మీరూ వెళతారా దూదీ, సిరెంజ్, మందులూ పుచ్చుకుని ? ఇదీ అంతే. ఇది ముఖ్యమైన పని. ప్రభుత్వం పని. వీళ్లంతా మరో నాలుగు రోజులలోనే ఇళ్లకి పోతారు. అప్పుడు చేయండి! ఇక ఇంటి దగ్గరే పడి ఉంటారు. ఈ సోమరిపోతుల గురించి నాకెందుకు చెబుతారు.' అన్నాడు నిర్లక్ష్యంగా. 'నేను అడుగుతున్నది రెండు గంటలు, వదిలిపెట్టడానికి కూడా సాధ్యం కాదంటారా?' అవమాన భారంతో అన్నారు డాక్టర్ మూర్తి. 'సాధ్యం కాదనే చెబుతున్నాను డాక్టర్.' కొంచెం గట్టిగానే అన్నాడు బాస్టియన్.

'బాస్టియన్ గారూ! వీళ్లు ఈ పని ఇలాగే చేస్తే చాలా ప్రమాదం!' అన్నాడు డాక్టర్ మూర్తి. 'ఏమవుతుంది? చస్తారా ? చావనీయండి. ప్రభుత్వ పని కంటేనా? వీళ్ల ప్రాణాలు మీరు అనుకుంటున్నంత విలువైనవేమీ కాదు.' అన్నాడు బాస్టియన్, గొంతు తగ్గించి. ఆ ఇంగ్లిష్ సంభాషణ ఏమీ అర్థం కాక కొందరు వింతగా చూస్తున్నారు ఆ వాదులాట కేసి. 'మీకొక విషయం చెబుతున్నాను. వీళ్లు మైదాన ప్రాంతంలో ఉండే దొమ్మర్ల మాదిరిగానో, వడ్డెర్ల మాదిరిగానో శరీర శ్రమ చేయకూడదు. అంత కష్టానికి వీళ్ల శరీరం తట్టుకోలేదు. వీళ్లకి కాల్షియం తక్కువ. పైగా ఈ దారుణమైన చలిలో, ఎండలో, ఆ దుమ్ములో పని చేస్తే ఆరోగ్యం చెడిపోవడానికి ఎంతోకాలం పట్టదు. దయచేసి అర్థం చేసుకోండి.' అన్నారు మూర్తి. 'అంటే రోడ్డు పనే ఆపేయమంటారా? మీరు మాట్లాడేది ప్రభుత్వం వ్యతిరేకం. గుర్తుంచుకోండి !' హెచ్చరిస్తున్నట్టు అన్నాడు బాస్టియన్. 'డాక్టర్ గారూ! రోడ్ల పని ఆపేయమని ఎలా చెబుతారు? కొండల్లో రోడ్లు వేయడం మొదలు పెట్టాక సంతలు మొదలయ్యాయి. వీళ్ల సరుకు బయటి ప్రపంచానికి పోతోంది. అమ్ముడుపోతోంది. చోడవరం, కోట, లంబసింగి, అడ్డతీగల సంతలు అలా వచ్చినవే. మన్యంలో దొరికే పళ్లూ, కాయలు, తుమ్మ, కలప ఇప్పుడు రాజమండ్రి, కాకినాడ వెళుతున్నాయి. కొన్ని సరుకులు మద్రాసు, కలకత్తా పోతున్నాయి. ఇంకొన్ని బొంబాయ్, లండన్, హ్యాంబర్గ్ వరకు వెళుతున్నాయి. ఈ రోడ్డు వాళ్లకి తిండి పెడుతోంది. ఇంకా పెడుతుంది. వీళ్లని ప్రధాన స్రవంతి జన జీవనంలో కలపడానికి ఈ రోడ్లే ఉపయోగపడతాయి. ఆ మాత్రం తెలియదా మీకు? మీకు తెలుసా డాక్టర్? నిరుడే మన్యం కొండల





# లంబసింగి రోడ్డు

16

డా॥ గోపరాజు నారాయణరావు

ఉత్పత్తులు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో భాగ స్వామ్యమయ్యాయి. నిన్నగాక మొన్న ఏజెన్సీ కమిషనర్ ఏమన్నాడు? ఈ సారవంతమైన భూమిని, ఈ ఖనిజ సంపదని, సుసంపన్న ప్రకృతి సంపదని తెరిచి పెట్టండి. వెనుకబడిన కొండవాళ్లకి అభివృద్ధిని పరిచయం చేయాలి. వాళ్లు కాలంతో పాటు పురోగ మించాలి. ఆదిమ వ్యవసాయ పద్ధతులకి వాళ్లు స్వస్తి చెప్పాలి. వలస ఆర్థిక వ్యవస్థలో వీళ్లని భాగస్వాము లని చేయాలి అన్నాడు. వాళ్ల ఆలోచన అలా ఉంది. మీరేమో వీళ్లని రాచి రంపాన పెడుతున్నామని రగడ చేస్తున్నారు? ఇది ప్రభుత్వ వ్యతిరేకం కాదా?' ఇంకా తీవ్రంగా అన్నాడు బాస్టియన్. 'నేను ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నానని మీరు అంటున్నారు. కానీ నేను చదువుకున్న వైద్యవిద్య ప్రకారం ఆ మాట అంటున్నాను. ఈ చాకిరీతో వీళ్లు ప్రధాన జన జీవన స్రవంతికి చేరరు సరికదా! పరలోకాలకి మాత్రం చేరగలరు. అది తథ్యం. వీళ్లకి సుదూర తీరాలతో పరిచయం కలిగించే పేరుతో, దాంతో వాళ్లకి ఏం ఒరుగుతుందో తెలియకుండా వాళ్ల ఆయుషుని హరించడం ఏమి న్యాయం? ఇదే నా ప్రశ్న.' ఈ వాదం ఇష్టం లేనట్టు అరుస్తూ వెళ్లిపోయాడు బాస్టియన్. 'ఎవడ్రా అది? ఒళ్లొంచి పని చేయడం రాదు. చోద్యం చూస్తారు. లేదంటే దిక్కులు చూస్తారు. సోమరిపోతులు..' అక్కడి నుంచి వెళ్లిపోయారు డాక్టర్ మూర్తి. బాస్టియన్ విలియం కేసి చూసి చిన్నగా నవ్వాడు. తప్పుదన్నట్టు నవ్వాడు విలియం.

* * *

ఆ రోజు లంబసింగి తిరిగి రావాలి.

కానీ రావడానికి మనస్కరించక బౌడలోనే ఉండిపోయారాయన. అక్కడే రాశారు డైరీ.

బౌడ, 7-3-1921

డియర్ మన్యం డైరీ!

ఈ మనుషులని చూస్తుంటే ఆకుపచ్చ లావాలో కాగిపోతున్నారనిపిస్తోంది. బానిసలను చూసినట్టే చూస్తున్నారు. పశువులని సంతలకి తోలుకు వెళ్లినట్టు గ్రామాల మీద పడి మనుషులని రోడ్డు పనికి లాక్కుపోతున్నారు. ఈ వాక్యాలలో ఒకటి రెండు విశేషణాలు కనిపించవచ్చు.

కానీ అవి వాస్తవాన్ని బలంగా చెప్పడానికి ఉపయోగించినవే. ఇదే ఒక సృజనాత్మక రచయిత రాస్తే వాళ్ల మెడలకు తాళ్లు కూడా వేసేవాడు. గొలుసులతో ఈ బక్క ప్రాణులను బంధించేవాడు.

కానీ నాకు మనసొప్పడం లేదు. అలాంటి అభిప్రాయానికి వచ్చి స్వేచ్ఛా భావనకూ, వీరికీ ఉన్న మధ్య దూరాన్ని ఊహలలో కూడా పెంచలేను. ఆ దూరం ఎంత తొందరగా తగ్గితే అంత మంచిదని అనిపిస్తోంది. అందుకే వీరి పోరాట వారసత్వాన్ని చిన్నబుచ్చలేను. నిజానికి దానిని గుర్తుకు తెచ్చుకోక తప్పని పరిస్థితిని ప్రభుత్వమే కల్పిస్తోంది. ఏమైనా, నాకు కలిగిన అభిప్రాయం సత్యదూరం కాదు. నేనొక ప్రభుత్వోద్యోగిని. అయినా వాస్తవాలను చూస్తే ఈ మాటలు సరైనవేనని అనిపిస్తుంది. అయినా ఇదంతా కొన్ని నిమిషాల సేపు మరచిపోయే టట్టు చేసింది బూసిచెట్టు. దోసిట్లో ఇంద్రధనుస్సులాగే అని పించింది. ఎర్రని కొత్త చిగుళ్లు- చిటారుకొమ్మన విచ్చుకుంటూ.

దాని కింది వరసలో ఆకుపచ్చ చిగుళ్లు. ఆ కింద రాలిపోవడానికి సిద్ధంగా ఉన్న పసుపుపచ్చ ఆకులు.

* * *

బాస్టియన్ మాటలు ఎంత మరచిపోదామన్నా సాధ్యం కావడం లేదు డాక్టర్ మూర్తికి. ఒళ్లంతా శ్రమతో పులిసిపోయినట్టు ఉంది. గెస్ట్ హౌస్ కే వెళ్లిపోయారు. ఆ ఉదయం చదువుతూ బోర్లించి పెట్టిన డైరీ తీసుకున్నారాయన చేతుల్లోకి. చదవ వలసిన పేజీలో పాకాబు మునసబు విషాదాంతం ఉంది. నిరుడు రాసుకున్న పేజీ. అది మరింత బాధ కలిగించింది. పాకాబు, 8-3-1921, డియర్ మన్యం డైరీ! ఈ ఊరు వచ్చాం. మా పని మామూలే. అంతంత మాత్రమే.

కానీ మనసు వికలం చేసే విషయం ఈ ఊళ్లో తెలిసింది. తాజంగి వెళ్లినప్పుడు లువ్వాబు పందు దొర ఇచ్చిన సమాచారాన్ని బట్టి వాకబు చేస్తే ఆ సమాచారం తెలిసింది. బాస్టియన్ అనేవాడిని ఈ ప్రభుత్వం ఎందుకు భరిస్తోంది? ఆ గప్పీ దొర బంగ్లా ఒక అరాచకాల పుట్టలా తయారైంది. ఇవేమీ బయట ప్రపంచానికి తెలియవు. వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సీపట్నానికే ఏమీ తెలియడం లేదు. లువ్వాబు లచ్చన్న దొర ఉదంతం దేశంలో మరెక్కడైనా జరిగితే ఈ పాటికి బాస్టియన్ వంటి వాళ్లు జైళ్లకు వెళ్లేవాళ్లు. లచ్చన్న దొర ఈ ఊరి మునసబు. కూలీలతో పాటు తానూ రోడ్డు పనికి వెళ్లేవాడట. ఏం జరిగిందో ఇంతవరకు తెలియదట. గప్పీ దొర బంగ్లా దగ్గర స్తంభానికి కట్టేసి కొరడాతో కొట్టించాడట బాస్టియన్. ఇది అబద్ధం కావడానికి వీలులేదు. ఎవరిని కదిపినా ఇలాంటి గాథలే వినిపిస్తున్నాయి. కొరడా దెబ్బలతో ఒళ్లంతా చీరుకుపోయి ఉంటే, దాని మీద మిరప కాయలు నూరి ఆ ముద్ద రాయడం ఏమిటి? ఇదెక్కడి రాక్షసత్వం? అది చాలక మర్మాంగాల మీద కారం ముద్ద రాయడం ఏం పశుత్వం? ఆ సమయంలో మన్యం నడిబొడ్డు నుంచి లచ్చన్నదొర చేసిన ఆర్త నాదాలు మద్రాసుకు వినిపించి ఉండాలి. మద్రాస్ ప్రెసిడెన్సీ ప్రధానమంత్రి అగరం సుబ్బరాయులురెడ్డి యార్ కీ, గవర్నర్, హిజ్ ఎక్సెలెన్సీ ఫ్రీమన్ ఫస్ట్ మార్క్వెస్ విల్లింగ్టన్ దొరవారి చెవినీ సోకి ఉండాలి. బాస్టియన్ బంట్రోతు కిష్టయ్య కొట్టి పడేస్తే, ఎవరో తీసుకువచ్చి ఇంటి దగ్గర అప్పగించారు. కొద్ది వారాలకే అతడు చనిపోయాడు. నిశ్చయం- ఆ దెబ్బలకే అతడు చనిపోయాడు.

గ్రేట్ వార్ అదే ప్రపంచ యుద్ధం రోజుల్లోనే చెన్నపట్నంలో రాయపేట వైద్య కళాశాలలో మేం చదువుకున్నాం. కాలేజీ లైబ్రరీలో ది మెయిల్, ది స్పెక్టేటర్, మద్రాస్ టైమ్స్, ది హిందూ పత్రికలని

పడిపడి చదివేవాళ్లం. అప్పుడే ఎందులోనో పడిందా వార్త. యుద్ధఖైదీల పట్ల శత్రుదేశాలు ఎంత దారుణంగా ప్రవర్తిస్తాయో రాశారు. కళ్లంట నీళ్లు వచ్చాయి మాకు.

కానీ విశాఖ మన్యంలో అల్ఫ్ బాస్టియన్, పోలీసులు, అటవీ ఉద్యోగులు కొండవాళ్లని యుద్ధఖైదీల్లాగే చూస్తున్నారంటే అక్షరం కూడా అతిశయోక్తి కాదు. బాస్టియన్ వంటి వాడి మీద ఎవరికైనా ఆగ్రహం ఉంటుంది. అయినా దానిని దృష్టిలో పెట్టుకుని ఈ విషయం నేను రాయడం లేదు. ఒక వాస్తవాన్ని రాస్తున్నాను. ఆ వాస్తవాన్ని సుబ్బరాయలురెడ్డియార్, విల్లింగ్టన్ కూడా ఆమోదించక తప్పదు. ఈ పది రోజులలో చూసినదానిని బట్టి గూడెం కొండలలోని ప్రతి గ్రామం రోడ్డు పని పేరుతో గాయపడింది. చివరిగా పాకాబు గ్రామస్థులు చెప్పిన మాట మరీ కలచివేసింది. ఇలా దెబ్బలు తగిలి ఇంకా ఎందరో మంచం పట్టి చావు కోసం ఎదురు చూస్తున్నారట.

* * *

బాగా ఆలస్యంగా లేచారు డాక్టర్ మూర్తి. చాలా నిశ్శబ్దంగా ఉంది గెస్ట్ హౌస్. సహాయకులు ఇద్దరూ ఎక్కడికో వెళ్లినట్టున్నారు. తలుపు తీసుకుని బయటకు వచ్చిన డాక్టర్ మూర్తికి మళ్లీ అదే దృశ్యం కనిపించింది. చేతిలో ఇండియా పేల్ ఏల్ బీరు సీసా. కొద్ది కొద్దిగా తాగుతున్నాడు విలియం. సరిగ్గా వందేళ్ల క్రితం దీనిని మన సైన్యానికి అలవాటు చేశారు బ్రిటిష్‌వాళ్లు. వాళ్లకి ఎంతో ప్రీతిపాత్రమైన పానీయం. క్లుప్తంగా ఐపీఏ అంటారు. పక్కన పలచగా కారం అద్దిన చేపల ఫ్రై ముక్కలు తెల్లటి పింగాణీ ప్లేట్లో. తెల్లటి తుండు చుట్టుకుని ఒక మోడ్ మీద కూర్చుని ఉన్నాడు విలియం. కింద కూర్చుని అతడి కాళ్లు చాలా శ్రద్ధగా పడుతున్నాడు ఒక సహాయకుడు. మరొక సహాయకుడు వెనుక నిలబడి ఒళ్లు పడుతున్నాడు. ప్రకృతి కేసి కన్నార్పకుండా చూస్తున్నాడు విలియం.

* * *

ఇంకా అడుగులు వేస్తుండగానే ఒక్క ఉరుకుతో గుర్రం దిగి, గప్పీ దొర బంగ్లా మెట్ల వైపు పరుగు లాంటి నడకతో వెళ్లాడు బాస్టియన్. బాట పక్క నుంచి దాదాపు పాతిక మెట్లు పైకి. పది మెట్లు ఎక్కితే ముందు ప్యూన్ల క్వార్టర్సు కనిపిస్తాయి. కుడి పక్క దాంట్లోనే ద్వారం కిష్టయ్య ఉంటున్నాడు. ఎడం పక్క క్వార్టర్సులో ఓవర్‌సీర్ సంతానం పిళ్లై ఉన్నాడు. రోడ్డు పనిని ఇక్కడ ఉండే చేయిస్తున్నారు, అంతా. సాయంత్రం ఐదు గంటలవుతోంది. చల్లగా ఉంది వాతావరణం. అటూ ఇటూ బాగా పరికించి, ఎవరూ లేరని గమనించి చటుక్కున కిష్టయ్య ఉన్న క్వార్టర్సులోకి దూరాడు బాస్టియన్. తీరా లోపల ఎవరూ లేరు. కొద్దిగా చీకటిగా ఉంది. 'ఈ కిష్టిగాడు అది వచ్చేసిందని చెప్పాడు! ఏమైంది?' అనుకున్నాడు బాస్టియన్, తనలో. రెండు గదుల చిన్న పోర్షన్. ముందు గదిలో ఒక నులక మంచం, ఒక మూలగా ఒక నీళ్ల కుండ ఉన్నాయి. ఆ మంచం మీద కూర్చున్నాడు బాస్టియన్. చిన్నగా దుర్గంధం. ఎలుకలు కాబోలు. కిష్టయ్య ఎదురుగా ఉంటే ఈ పాటికి పీక పిసికి చంపేవాడే. ఎంత ఉత్సాహంతో వచ్చాడు! ఎంత ఆబగా వచ్చాడు! అసలు ఎంతో కుట్ర పన్ని, పెద్ద ప్రయత్నం చేస్తే తప్ప దానితో పొందు సాధ్యం కాలేదు. ఆ పేరు తలుచుకోగానే ఒళ్లంతా తిమ్మిరెక్కిపోతుంది బాస్టియన్‌కి. కొండవాళ్ల ఆడది కాదు. కొండవాళ్లు విస్తరి కూడా వేయడానికి ఇష్టపడని కులంలో పుట్టింది. చూడ్డానికి కట్టూబొట్టూ అన్నీ కొండవాళ్లలాగే ఉంటాయి. అదో నల్లకలువల గుట్ట. సన్నటి నడుం, బలమైన జఘన సీమతో పిటపిట లాడిపోతూ ఉంటుంది. దాని ఎత్తు గుండెలు చూస్తే బాస్టియన్ దాసాను దాసుడైపోయాడు. మొదటిసారి చూసినప్పుడే ఇది అడవిలో పుట్టాల్సికాదని తేల్చేశాడు. కొండసంత గ్రామంలోనే ఆమెను చూశాడు బాస్టియన్. పేరు డోలా లక్ష్మమ్మ. ఆమె స్వగ్రామం కూడా అదేనని తెలిసి ఆనందపడ్డాడు. మొగుడిని వదిలేసి ఒంటరిగా ఉంటోందన్న విషయం బాస్టియన్‌ను మరీ తొందర చేసింది.

మొదట ఒక ఘాట్ రోడ్డు పనికి ఆమె వచ్చేటట్టు చేశాడు బాస్టియన్. అక్కడ మేస్త్రీ రామమూర్తికి, సంగతి చెప్పి ఉచ్చులోకి దించే బాధ్యత అప్పగించాడు. ఇవేమీ తెలియని లక్ష్మమ్మ ఓ రోజున వచ్చి, 'మేస్త్రి రెండు రూపాయలు కావాలి. ఇంకోసారి రోడ్డు పనికి వచ్చి తీర్చుకుంటాను' అని మొరపెట్టుకుంది. రామమూర్తి చాలా బెట్టు చేశాడు. బాస్టియన్ అనుమతి కావాలన్నాడు. రెండు రూపాయలంటే కష్టం అన్నాడు. ఇదనీ, అదనీ హంగామా చేశాడు. చివరికి బాస్టియన్ దగ్గరకు పంపాడు. పది పైసలు కూడా వదలని బాస్టియన్ రెండు రూపాయలు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. కానీ చాలా మంది లాగే లక్ష్మమ్మ కూడా డబ్బులు తీసుకున్నా, ఆ గొడ్డు చాకిరీ చేయలేక పనిలోకి రాలేదు. ఇంకెవరు ఆ పని చేసినా బాస్టియన్ సహించడు. నిజానికి డబ్బులు తీసుకుని పని ఎగొట్టనక్కరలేదు. అసలు పనికి రాకపోతేనే బాస్టియన్ సహించడు. మొలతాడు కట్టిన మగాడు, చీర కట్టిన ఆడది పనిలో ఉండాల్సిందే.

కానీ లక్ష్మమ్మ విషయం వేరు. ఆమె పనిలోకి రాకుండా ఉండిపోవాలి. అతడికి కావలసింది అదే. అంతా నిర్ణయించుకుని కొండసంతలో సంత రోజునే బాస్టియన్, రామమూర్తి, కిష్టయ్య వెళ్లారు.

ఊరి బారికను కూడా వెంట పెట్టుకున్నారు. ఒకచోట మాటేశారు. కానీ లక్ష్మమ్మ కోసమే వచ్చారన్న మాట రాకూడదు. అందుకే ముందు చిన్న గలభా సృష్టించాలని పథకం వేశారు. దాంతో రోడ్ల పని మీద బాస్టియన్ ఎంత దీక్షతో పనిచేస్తున్నాడో నలుగురికీ తెలియాలి. సరిగ్గా వీళ్ల పథకానికి తగ్గట్టు కిముదు గెద్దయ్య, పరిగా పెంటేసు, కొండోజు చెల్లయ్య సంతకు వచ్చారు. ఆ ముగ్గురూ కూడా డబ్బు, బియ్యం తీసుకుని, కొత్తగా పనిలోకి రాకుండా దాక్కున్నవాళ్లే. రామమూర్తి, కిష్టయ్య, బారిక వెళ్లి ఆ ముగ్గురినీ బెదిరించి బాస్టియన్ ముందు హాజరు పరిచారు.

ముగ్గురి చేతులూ కట్టేయ్యమని బారికను ఆదేశించాడు బాస్టియన్. తరువాత రామమూర్తి, కిష్టయ్య ఆ తాళ్లు పట్టుకుని కొడుతూ నడిపిస్తూ ఉంటే, ముందు డప్పు వాయిస్తూ బారిక నడిచాడు. అలా ఆ ముగ్గురినీ సంతంతా తిప్పారు. సంతకొచ్చిన జనం కకావికలైపోయారు. సాయంత్రం నాలుగింటి దాకా సాగవలసిన సంత మధ్యాహ్నం ఒంటిగంటకే ఖాళీ. అప్పుడే ఘనత వహించిన బ్రిటిష్ ప్రభుత్వం వారికి డోలా లక్ష్మమ్మ అనే పేదరాలు ఇవ్వలసిన రెండు రూపాయల బకాయినీ వసూలు చేయడానికి బాస్టియన్ స్వయంగా బయలుదేరి వెళ్లాడు. ఆ ముగ్గురినీ సంతంతా తిప్పిన సంగతి తెలిసి గడగడలాడిపోయింది లక్ష్మమ్మ. తలుపులు వేసుకుని గుడిసెలో ఉండిపోయింది. ఏది జరగకూడదని అనుకుందో అదే జరిగింది. ఇంటి తలుపు దడదడ మోగితే హడలిపోతూ తీసింది. ఎదురుగా బాస్టియన్. మాట పడిపోయిందామెకు. 'రెంద్రూపాయలు ఇవ్వాలి. తీసుకురా. లేకపోతే చాలా గొడవైపోతది. పోలీసులు కూడా వస్తారు.' చాలా శాంతంగా చెప్పాడు బాస్టియన్. 'దండాలు దొరా! దొరా! ఇప్పుడు నాకాడ లేవు. రోడ్డు పనికొస్తా. తప్పు కాయి దొరా!' అంది వణికిపోతూ. 'పనికి వస్తే రావొచ్చు. మానేస్తే మానేయవచ్చు.

**(ఇంకా ఉంది)**

మొదట ఒక ఘాట్ రోడ్డు పనికి ఆమె వచ్చేటట్టు చేశాడు బాస్టియన్. అక్కడ మేస్త్రీ రామమూర్తికి, సంగతి చెప్పి ఉచ్చులోకి దించే బాధ్యత అప్పగించాడు. ఇవేమీ తెలియని లక్ష్మమ్మ ఓ రోజున వచ్చి, 'మేస్త్రి రెండు రూపాయలు కావాలి. ఇంకోసారి రోడ్డు పనికి వచ్చి తీర్చుకుంటాను' అని మొరపెట్టుకుంది. రామమూర్తి చాలా బెట్టు చేశాడు. బాస్టియన్ అనుమతి కావాలన్నాడు. రెండు రూపాయలంటే కష్టం అన్నాడు. ఇదనీ, అదనీ హంగామా చేశాడు. చివరికి బాస్టియన్ దగ్గరకు పంపాడు.

ఏలె శ్యాంకుమార్

ఆగస్ట్ 12 రాఖీ పౌర్ణమి

# దివ్య సందేశాల రక్షాబంధన్

**ఏటా శ్రావణ పౌర్ణమి రోజున హిందూ సమాజం సంప్రదాయబద్ధంగా రక్షాబంధన్ పండుగ జరుపుకుంటుంది. పండుగ అంటే కేవలం కొత్త బట్టలు ధరించడం, సినిమాలు, షికార్లకు వెళ్లడం, స్నేహితులతో, బంధువులతో ఆనందంగా గడపడం మాత్రమే కాదు. ప్రతి పండుగ వెనుక ఒక ఉద్దేశం, ఒక సందేశం, సమాజానికి దిశానిర్దేశాలు ఉంటాయి. అందుకే ఈ పండుగలన్నీ వాటికి అనుగుణంగానే రూపుదిద్దుకున్నాయి.**

రక్షాబంధన్ ఇచ్చే సందేశం– సోదరభావన. మనందరం ఒకే సమాజ పురుషుని అవయవాలం, ఈ విరాట్ సమాజ పురుషునిలో విడదీయరాని భాగమనే భావన. మనం ఒకే తల్లి సంతానం. మనందరి తల్లి భారతమాత. కాబట్టి మనందరం అన్నాదమ్ములం, అక్కా చెల్లెళ్లమనే భావన. మన వృత్తులు, ప్రవృత్తులు, వేష, భాష, ప్రాంతం, ఆహారపు అలవాట్లు, కట్టుబాట్లు వేరైనా అందరం ఒకే సమాజం అనే భావన ఈ పండుగ ద్వారా నిర్మాణం చేసే ప్రయత్నం జరుగుతుంది. అది లోపించిన ఏ సమాజమైనా కనుమరుగైపోతుంది. ఈ భావన కాలక్రమంలో లుప్తమైపోయే ప్రమాదం ఉంటుంది. అందుకే దాన్ని ప్రతి సంవత్సరం గుర్తు చేస్తూ మన సమాజాన్ని కాపాడుకోవాలి. మన పెద్దలు పండుగలను రూపొందించడం వెనుక ఉన్న ఉద్దేశం ఇదే.

ఒక సోదరి సోదరుడికి రాఖీ కట్టి సోదర భావన వ్యక్తపరుస్తుంది. ఇవాళ ఈ పండుగలో ఆమె తన రక్షణ కోరడం వరకు మాత్రమే పరిమితమైంది. దీని అంతరార్థాన్ని గ్రహించి, హిందూ సమాజాన్ని ఒక శక్తిమంతమైనదిగా నిలబెట్టడం కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఈ ఉత్సవాన్ని సామూహికంగా, సామాజికోత్సవంగా నిర్వహిస్తోంది.

నేటి సమాజంలో మనమంతా ఒక్కటేననే, ఒకే సమాజ పురుషుని వారసులమనే భావన అడుగంటి కులం, భాష, ప్రాంతాల పేరుతో కొట్లాడుకుంటున్నాము.

ఎక్కువ తక్కువ అనే భేదభావాలు, అంటరానితనం పేరుతో కొంతమంది మన సోదరులనే దూరం పెడుతున్నారు. వాస్తవానికి మన శాస్త్రాలలో, గ్రంథాలలో ఎక్కడా అంటరానితనం గురించి చెప్పలేదు. మధ్యయుగంలో అనేక విదేశీ దురాక్రమణల పర్యవసానంగా కాలక్రమంలో ఈ దురాచారం మన సమాజంలో చొరబడింది. దాన్ని దూరం చేసి సరిదిద్దుకోవాల్సిన బాధ్యత మన మీదే ఉంటుంది.

మన దేశంలోని తిరుపతి, శ్రీశైలం, అయోధ్య, మధుర, కాశీ లాంటి దేవస్థానాలలో అంటరానితనం లేదు. అందరికి ప్రవేశం ఉంది. అంటే మన శాస్త్రాలలో, మన వ్యవహా రంలో దానికి స్థానం లేదని అర్థం అవుతుంది. కానీ, చిన్న గ్రామంలోని చిన్న ఆలయంలో ఈ వివక్ష కొనసాగడమంటే అది దురాచారమే.

ఏ సమాజంలోనైనా కాలక్రమంలో ఇలాంటి దురాచారాలు వస్తాయి. అయితే, వాటిని విమర్శిస్తూ కూర్చోవడం, లేదా పరస్పర ఆరోపణలు చేసుకోవడం కంటే అన్ని వర్గాలు కలసి ఆలోచించి తగిన చర్యలు తీసుకోవాలి. అందులో భాగంగానే, ఈ పండుగ సందర్భంగా ఒకరికొకరం రాఖీలు కట్టుకుంటూ రక్షగా నిలబడదాం. భారతమాతను, ఈ ధర్మాన్ని, సంస్కృతిని రక్షిస్తామంటూ కంకణబద్ధులమవుదాం.

ఈ ధర్మాన్ని, ఈ సంస్కృతిని రక్షించడమంటే ఇక్కడి జీవన విలువల్ని రక్షించడమే. అనేకమంది రుషులు, మునులు, పూర్వీకులు వేల సంవత్సరాల నుండి మనవైన జీవన విలువలను నిర్మాణం చేశారు. జన్మనిచ్చిన తల్లి దేవతతో సమానం కాబట్టి 'మాతృ దేవోభవ' అని పూజించాలి, సేవించాలి. తల్లినే కాదు. మనల్ని పోషించే తల్లులైన భూమాత, గంగామాత, గోమాత, తులసీమాత.. అందరిని పూజించాలి, రక్షించాలి. సేవించాలి. జన్మనిచ్చిన తండ్రి భగవంతునితో సమాన (పితృదేవోభవ) పూజనీయుడు. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల సేవ మన కర్తవ్యం.

'ఆచార్యదేవోభవ'..తల్లిదండ్రులు శరీరాన్ని ఇస్తే, ఈ జన్మకు సార్థకత కల్పించేందుకు జ్ఞానాన్ని ఇచ్చేది గురువు, కాబట్టి పూజనీయుడు.

'అతిథి దేవోభవ'.. ఇది హిందూ సంస్కృతి విశిష్టత. అతిథిని సాక్షాత్తు భగవంతునిగా భావించే సంస్కృతి మనది. స్వామి వివేకానంద చెప్పిన 'దరిద్ర దేవోభవ'... అంటే దారిద్ర్యంలో ఉన్నవారు కూడా భగవంతునితో సమానమని, సేవ చేయడం మన కర్తవ్యమని భావం. అలాగే 'మూర్ఖదేవోభవ' అన్నారు స్వామీజీ. అంటే మూర్ఖత్వంలో, అజ్ఞానంలో ఉన్నవారు కూడా భగవంతునితో సమానం. వారిని కూడా సేవించడం మన కర్తవ్యం. 'మాతృవత్ పరదారేషు' పర స్త్రీని తల్లిగా భావించడం మన సంస్కృతి. 'పర ద్రవ్యాణి లోష్ఠవత్'.. పరుల డబ్బు కూడా మట్టితో సమానం కాబట్టి మనది కానిది తీసుకోవడం పాపం.

**ప్రకృతిని పూజించడం–ప్రకృతి తల్లిలాంటిది. ప్రకృతిలో రాయి, రప్ప, చెట్టు, చేమ, నది, సముద్రం, పర్వతం, కొండ, కోన, అన్ని ప్రాణులు.. అంటే చరాచార సృష్టిని రక్షించే బాధ్యత మనది. ఇలాంటి అనేక విలువలను కాపాడడం మన కర్తవ్యం అనే భావన సమాజంలో నిర్మాణం చేయడం కోసమే. ఈ కంకణం (రాఖీ).**

'ఆత్మావత్ సర్వభూతేషు' అన్ని జీవులలో/ ప్రాణులలో ఒకే పరమాత్మ స్వరూపం ఉంది కనుక అన్నింటిని గౌరవించాలి. వాటి జీవించే హక్కుకు భంగం కలిగించకూడదు, రక్షించాలి.

ప్రకృతిని పూజించడం–ప్రకృతి తల్లిలాంటిది. ప్రకృతిలో రాయి, రప్ప, చెట్టు, చేమ, నది, సముద్రం, పర్వతం, కొండ, కోన, అన్ని ప్రాణులు.. అంటే చరాచార సృష్టిని రక్షించే బాధ్యత మనది. ఇలాంటి అనేక విలువలను కాపాడడం మన కర్తవ్యం అనే భావన సమాజంలో నిర్మాణం చేయడం కోసమే. ఈ కంకణం (రాఖీ).

**'ఏకం సత్ విప్రాః బహుదా వదన్తి'**... సత్యం ఒక్కటే, విద్వాంసులు దాన్ని అనేక విధాలుగా చెప్పారు. కానీ ప్రపంచంలో అన్ని దేశాలలో, మతాలలో కేవలం 'మాది మాత్రమే సత్యం. ఇతరాలన్నీ అసత్యాలు. అందుకే మా మార్గంలోకి రండి. మా మతం ద్వారా మాత్రమే స్వర్గానికి వెళ్తారు. మోక్షం లభిస్తుంది' అని బలవంతం పెట్టడం, మతం మార్చడం లాంటి ధోరణి ప్రబలుతోంది. 'మా మతంలోకి రాకపోతే దౌర్జన్యంతోనైనా తీసుకెళ్తాం. లేదా చంపేస్తాం' అనే జిహాదీ పోకడలనూ చూస్తున్నాం.

**'ఆనోభద్రాక్రతవో యంతు విశ్వతః'**– ప్రపంచంలో ఎక్కడ మంచి ఉన్నా స్వీకరించు లాంటి శ్రేష్ఠమైన గుణాలు హిందుత్వంలో ఉన్నాయి.

హిందుత్వంలో ఇలాంటి శ్రేష్ఠమైన విలువల కారణంగానే ప్రపంచంలోని అన్ని జాతులను, అన్ని మతాలను ఆదరించాం. ఎవరినీ ద్వేషించలేదు. ఎవరి మీదకు ఆక్రమణ చేయలేదు. ప్రపంచమంతా హిందూ సంస్కృతి విస్తరించింది, అయితే అది దౌర్జన్యం, హింస వల్ల కాదు. మతం మార్పిడివల్ల కానే కాదు. కానీ, కొన్ని మతాలు తమ మతంలో, తమ గ్రంథంలోనే మంచి ఉందని, మిగతా వాటిలో ఉన్నదంతా చెడే కాబట్టి తమనే అనుసరించాలని ప్రలోభ పెడుతున్నాయి.

అజ్ఞానం, అనాగరికంలో ఉన్న ప్రపంచజనులకు మన శ్రేష్ఠ జీవన విధానాన్ని– తెలియచెప్పేందుకు ఇక్కడి నుండి రుషులు, మునులు, సాధుసంతులు సహృదయత, సేవాభావం, స్నేహభావం, ప్రేమతో ప్రపంచ దేశాలకు వెళ్లారు. అక్కడివారికి ఈ శ్రేష్ఠమైన సభ్యత, నాగరికతను, మనిషి మనిషిలా జీవించడ మెలాగో నేర్పారు. అందుకే ఇవ్వాళ ప్రపంచ మంతటా హిందుత్వ చిహ్నాలు, పద్ధతులు కనిపిస్తాయి.

అంతేకాదు, మన దేశంలోకి వచ్చిన అనేక జాతులకు ఆశ్రయమిచ్చి ఆదుకొని ఆదరించాం. మంచి స్థానమిచ్చి గౌరవించాం. అరబ్బుల కారణంగా యూదులు తమ దేశం నుండి ప్రపంచ దేశాలకు వలసదారి పట్టినప్పుడు వారికి అన్ని చోట్ల ఎదురు దెబ్బలు, అవమానాలు ఎదురయ్యాయి. వారిపై హింస, దౌర్జన్యాలు జరిగాయి. వేలాది మంది ఊచకోతకు గురయ్యారు. వారికి భారత్‌లో మాత్రమే ఆదరణ, గౌరవం లభించాయి. ఈ విషయాన్ని వారే తమ పుస్తకాలలో రాసుకున్నారు.

అలాగే, పర్షియా (ఇరాన్) మీద ఆక్రమణ జరిగినప్పుడు పర్షియన్లు అనేక దేశాలకు పారి పోయారు. భారత్‌కు కూడా వచ్చారు. అన్ని దేశాలలో వారి మీద హింస, దౌర్జన్యాలు జరగగా, మన దేశమే వారికి సముచిత స్థానమిచ్చింది. ఇవాళ ప్రపంచంలో ఎక్కడా కూడా పార్శీలు లేరు. వారి మాతృదేశమైన పర్షియాలో కూడా ఒక్క పార్శీ కన్పించడు. కానీ భారత్‌లో మాత్రమే పార్శీలు అన్ని రంగాలలో ఉన్నతమైన, గౌరవప్రదమైన స్థానాలలో ఉన్నారు. ఇది భారత్ శ్రేష్ఠత్వం.

అయితే, భారత్‌పై దుర్బుద్ధితో ఆక్రమణ చేసిన ఏ ఒక్క విదేశస్థుడిని వదిలి పెట్టలేదు. భారత్‌ను కబళించాలని వచ్చిన గ్రీకులు ఓటమితో పరారయ్యారు. మిగిలిన వారు ఇక్కడి సమాజంలో విలీనమయ్యారు. మిని యాండర్ అనే గ్రీకురాజు భారత్ వచ్చి ఇక్కడ బౌద్ధ గురువులతో చర్చిస్తూ, చర్చిస్తూ బౌద్ధుడై మిళింద్ అనే పేరుతో బౌద్ధభిక్షువు అయ్యాడు.

విదిశలో క్రీస్తుపూర్వం 175 సంవత్సరం నాటి ప్రాచీన రాతిస్తంభం పైన 'హైలియోడోరస్' అనే గ్రీకురాజు రాయబారి "నేను గ్రీకు రాజు రాయ బారిని, ఇక్కడికి వచ్చి, కుటుంబంతో సహ భాగవత్ వైష్ణవుణ్ణి అయ్యాను" అని రాసుకున్నాడు.

శకులు–ఉజ్జయినిని గెలుచుకున్నారు, కాని తర్వాత వీరందరు శైవులైపోయారు.

కుషాణులు – కనిష్కుడు కుషాణు వంశపు రాజు. బౌద్ధభిక్షువు అయ్యాడు.

హూణులు – మిహిరకులుడు అనే రాజు కాశ్మీర్‌లో శైవమందిరాలను నిర్మించాడు.

థాయిలాండ్ నుండి అహోమ్ జాతి అస్సాంలోకి వచ్చింది. వారి రాజు 'సుకుఫా'. వారంతా హిందువు లైపోయారు. రాజభాషగా సంస్కృతాన్ని స్వీకరించారు. అస్సాంలో వేదపాఠశాలలు ప్రారంభించారు.

అలా దుర్బుద్ధితో వచ్చిన అనేక జాతులను తరిమివేశాం, లేదా విలీనం చేసుకున్నాం. కానీ తర్వాత వచ్చిన ఇస్లాం, క్రైస్తవం– ఈ దేశం మీద ఆక్రమణ చేసి, ఇక్కడి వారి మతంమార్చి ఈ దేశాన్ని ఇస్లాం / క్రైస్తవం చేయాలనే తీవ్ర ప్రయత్నం చేశారు, చేస్తున్నారు. వీరికి ముందు వచ్చిన ఆక్రమణ దారులుగా వీరికి బౌద్ధిక స్వచ్ఛత లేదు. సైద్ధాంతిక ప్రామాణికత లేదు. మొండితనం, క్రూరత్వంతో పాటు చర్చల మీద వారికి విశ్వాసం లేదు. మొత్తం ప్రపంచాన్ని ఏదోరకంగా ఇస్లాంగానో, క్రైస్తవంగానో చేయాలనే సంకల్పంతో భారత్ ఆక్రమణకు వచ్చారు.

అయితే 1300 సంవత్సరాల నుండి ఇస్లాంతో సుమారుగా 400 సంవత్సరాల నుండి క్రైస్తవంతో పోరాడుతూ, మన సమాజాన్ని కాపాడుకుంటున్నాం. ప్రపంచంలో అనేక దేశాల మీద ఈ రెండు మతాలు ఆక్రమణ చేసి 10 లేదా 20 సంవత్సరాలలోనే ఆయా దేశాల మూల జాతిని, మూల సంస్కృతిని, మూల విలువలను ధ్వంసం చేసి ఇస్లాం లేదా క్రైస్తవ



దేశాలుగా మార్చివేశాయి.

కాని ఈ దేశంలో దేవల మహర్షి నుండి మొదలు కొని గురు అర్జున్‌దేవ్, రామానుజాచార్యులవారు పునరాగమన ప్రక్రియను ప్రారంభించారు.

కాశీలో సంత్ రామానందులవారు మతం మారినవారిని పెద్ద ఎత్తున పునర్ దీక్షితులను చేసే కార్యక్రమం మొదలుపెట్టారు. దానికి హిందువు లుగా మార్చండి అన్న నినాదం ఇచ్చారు. మెడలో తులసిమాల వేసి, రామనామం చెప్పించడం, తులసి దళం నోట్లో పెట్టుకోవడం ద్వారా హిందువులుగా మార్చారు.

అయోధ్యలో ముస్లింలుగా మారిన సుమారు 35,000 మంది రాజపుత్రులను మళ్లీ హిందువు లుగా మార్చారు. ముస్లింల నుండి అనేక బెదిరింపులు వచ్చినా భయపడలేదు. వారు కులపరమైన భేదాలను కూడా వ్యతిరేకించారు.

గురునానక్, వల్లభాచార్య, చైతన్య మహాప్రభుల అనేకమంది శిష్యులు కూడా హిందువులుగా మారారు. విద్యారణ్యస్వామి శిష్యులు హరిహర రాయలు, బుక్కరాయలు హిందువులుగా మారి విజయనగర సామ్రాజ్య స్థాపన చేశారు. సావర్కర్, మసూర్కర్, పండిత మదనమోహన మాలవ్యా, అనీబిసెంట్, శారదామాత, నారాయణగురు, స్వామి ప్రణవానంద, లాలా లాజ్‌పత్‌రాయ్ అందరూ శుద్ధి ఉద్యమంతో అనేకమంది మహమ్మదీయులను హిందువులుగా మార్చారు.

శివాజీ, శంభాజీ మహారాజ్ అనేకమంది ముస్లింలతోపాటు, గోవాలో క్రైస్తవులను కూడా పునరాగమనం చేయించారు. పీష్వాబాజీరావు కూడా గోవాలో అనేక మంది క్రైస్తవులను పునరాగమనం చేయించారు. శుద్ధీకరణకు 19వ శతాబ్దంలో అనేక సంస్థలు ఉద్భవించాయి. అందులో ఆర్య సమాజం ప్రముఖమైనది. స్వామి దయానంద సరస్వతి, పండిత లేఖరామ్ – పెద్ద ఎత్తున పునరాగమనం జరిపారు. స్వామి శ్రద్ధానంద వేలాదిమంది మహమ్మదీయులను హిందువులుగా మార్చారు. అందువల్ల మొదట పండిత లేఖరామ్‌ను, తర్వాత స్వామి శ్రద్ధానందను మహమ్మదీయులు హత్య చేశారు.

కేవలం శుద్ధి ద్వారా 1923-31 లోపల, సుమారు 1,83,342 మంది ముస్లింలకు శుద్ధీకరణ చేశారు. సుమారుగా 60వేల మందిని ఇస్లాంలోకి మారకుండా నిలువరించారు.

ఇటీవలి కాలంలో ఒరిస్సాలో స్వామి లక్ష్మణా నంద సరస్వతి క్రైస్తవులుగా మారిన వేలాది గిరిజను లను హిందువులుగా మార్చారు. అందుకే క్రైస్తవులు ఆయన ఆశ్రమంలోకి జొరబడి హత్య చేశారు.

1931 జులై నాగపూర్‌లో జరిగిన చాలా శుద్ధి కార్యక్రమాలకు పూజనీయ డాక్టర్జీ సహకారం, ప్రోత్సాహం అందించారు.

కాబట్టి ఇవాళ మనమందరం ధర్మరక్షా కంకణం ధరించి, 'ఈ దేశంలో మతం మార్పిడులను ఆపుదాం. పునరాగమనం చేయిద్దాం!' అని సంకల్పిద్దాం.

ఇవాళ కొన్ని విదేశీశక్తులు హిందూ సమాజంలో విభేదాలు సృష్టించి, విడగొట్టాలని ప్రయత్నిస్తున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి వర్గాలు హిందువులు కారనే తప్పుడు సిద్ధాంతాలు చెబుతూ, హిందూ సమాజాన్ని చీల్చాలనుకుంటున్నాయి. 'జై భీం, జై మీం' అనే నినాదాలు ఇస్తున్నారు. బీఫ్ ఫెస్టివల్, మహిషాసురుణ్ణి పూజించడం, రావణాసురుడు తమ పూర్వికుడని సామాన్యులలో గందరగోళం సృష్టించే ప్రయత్నం జరుగుతోంది.

విద్వాంసులను తయారుచేసి, దేశప్రగతికి దోహదపడవలసిన విశ్వవిద్యాలయాల్లో దేశద్రోహ కార్యకలాపాలు సాగుతూ 'భారత్‌ను ముక్కలు చేస్తాం' అనే అనే నినాదాలు మార్మోగుతున్నాయి. దేశహితం కోసం చేస్తున్న అనేక చట్టాలను వ్యతిరేకిస్తూ వాటిపట్ల ప్రజలలో ఒక రకమైన గందరగోళం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అనేక దశాబ్దాలుగా పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌లలోని మైనారిటీలైన హిందువులు హింస, దౌర్జన్యాలు, అత్యాచారాలను తట్టుకోలేక స్వదేశం తిరిగివస్తే, వారికి పౌరసత్వం ఇవ్వడానికి ఉద్దేశించిన సి.ఎ.ఎ. బిల్లును కూడా వ్యతిరేకించడం శోచనీయం. వాస్తవాలు మాట్లాడిన నుపూర్ శర్మ వ్యాఖ్యలపై రభస సృష్టించి హిందువులపై దాడులు చేసి, భయానకంగా తలలు నరికి చంపేశారు. ఇవన్నీ విదేశీశక్తుల ప్రేరణతో, ఇక్కడ కొన ఊపిరితో ఉన్న చివరి దశలో ఉన్న దేశ వ్యతిరేక శక్తుల సిద్ధాంతాలను రక్షించు కోవడం కోసం ఈ జరుగుతున్న ప్రయత్నాలు. ఇలాంటి శక్తులను, సిద్ధాంతాలను ఈ దేశం నుండి తరిమికొట్టడానికి హిందూ సమాజం కంకణబద్ధం (దీక్ష) కావాలి.


సమాజంలో సామరస్యత నిర్మాణం కోసం.. మనలో భేదభావాలు లేవని, మనం ఒకే తల్లి సంతానం అనే భావనను కల్పించడం, కుటుంబంలో అందరికి సంస్కారాలు అందించడం లాంటి విషయా లపై దృష్టిపెట్టవలసి ఉంది. పర్యావరణం పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం, చెట్లను పెంచడం, నీటిని పొదుపుగా వాడడం వంటి అంశాల పట్ల రక్ష (కంకణం) ధరించి నిర్ణయం తీసుకుందాం. వీటన్నింటితోపాటు ప్రతి హిందువు మంచి పౌరునిగా తయారుకావాలి. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించడం, సీట్ బెల్ట్, హెల్మెట్ ధారణవంటి నియమాలను సైతం గౌరవించాలి. రహదారులపై పరిశుభ్రతను పాటించాలి. విదేశాలకు వెళ్లినప్పుడు ఈ నిబంధనలను తు.చ.తప్పకుండా పాటించిన వారే స్వదేశానికి వచ్చిన తరవాత పట్టించుకోరు. ఆచార వ్యవహారాలు పాటిస్తూ, పండుగలు, జన్మదినం, పెండ్లిరోజు వంటివి హిందూ పద్ధతులలో జరుపుకోవాలి. ప్రతి హిందువు దేశభక్తుడు కావాలి. దేశ ప్రగతికి సంబంధించిన ప్రతి విషయంలోనూ స్పందించాలి. సందర్భమొచ్చినపుడు మాత్రమే కాదు, నిత్య జీవితంలో అనుక్షణం దేశభక్తి వ్యక్తం కావాలి. స్వదేశీ వస్తువులను వాడాలి. వేష, భాషలు, సదాచారం (అంటే మన పద్ధతులు, సంస్కృతిని పాటించడం) పట్ల ఆచరణాత్మకంగా ఉండాలి.

**వేష భాష సదాచారం, రక్షణీయం ఇదంత్రయం**
**అంధానుకరణ మన్యేషాం, అకీర్తికరముచ్యతే**

వేషం, భాష, సదాచారం – ఈ మూడింటిని రక్షించుకోవాలి. ఇతరులను అంధానుకరణ వలన కీడు కలుగుతోంది. వీటి సంరక్షణతోనే దేశ రక్షణ సాధ్యం. కనుక వీటి కోసం కంకణధారణ చేద్దాం, తద్వారా మన దేశాన్నీ, ధర్మాన్నీ రక్షించుకుందాం.

**సర్వేజనాః సుఖినోభవంతు**

**వ్యాసకర్త: అఖిల భారతీయ ధర్మజాగరణ సహ సంయోజక్**





# శ్రీవరలక్ష్మీ న

**దారిద్ర్యం నుంచి ధనం వైపునకు, అజ్ఞాన తిమిరం నుంచి సుజ్ఞానం దిశగా నడిపించే దివ్య తేజోమూర్తి శ్రీమహాలక్ష్మిని విష్ణుపురాణం 'విశ్వమాత'గా అభివర్ణించింది. ధనం అంటే కేవలం డబ్బే కాదు. ఆరోగ్యం, ఆయుస్సు, అభయం, ధైర్యం, స్థయిర్యం, విజయం, వీర్యం, శౌర్యం, సాహసం, విద్య వివేకాలు, కీర్తిప్రతిష్ఠలు, ధనధాన్యాలు, వస్తువాహనాలు, పుత్రపౌత్రాదులు... ఇలా అన్నీ సంపదే.ఈ సమస్త సంపదలకు మూలం, వాటికి అధినేత్రి శ్రీమహాలక్ష్మి. అష్టలక్ష్ముల తత్త్వమే అది. లక్ష్మీనారాయణులది అవిభాజ్య బంధం. ఈ ఆదిదంపతులను అర్చించడం వల్ల మోక్షం సిద్ధిస్తుందని, ప్రత్యేకించి లక్ష్మీదేవి వైకుంఠంలో 'మోక్షలక్ష్మి'గా ఉంటారని, చతుర్విధ పురుషార్థాలకు ఆమె చతుర్భుజాలు ప్రతీకలని చెబుతారు.**

శ్రీమహావిష్ణువు జన్మ నక్షత్రం శ్రవణం పేరుతో ఏర్పడిన శ్రావణ మాసంలో (చంద్రుడు శ్రవణా నక్షత్రంలోకి అడుగుపెట్టడం వల్ల శ్రావణ మాసం అంటారు) విష్ణుపత్నిని భక్తిశ్రద్ధతో కొలిచేవారికి వారికి ఆమె కొంగుబంగారమే. సిరిసంపదలకు సకల సౌభాగ్యాలకు,శుభకార్యాలకు ఆవాసం శ్రావణ మాసం. సంప్రదాయాలు పాటించే ప్రతి ఇంటి గడప పసుపు కుంకుమలతో, గుమ్మాలు మామిడి తోరణాలతో, ముంగిళ్లు రంగవల్లులతో శోభాయమానంగా కనిపిస్తాయి. అలాంటి ఇంటిలో 'సిరి'దేవి ఘల్లుఘల్లు మనే అందెల సవ్వడితో అడుగిడుతుందని విశ్వాసం.

తెలుగు నెలల్లో ఏ మాసంలోనూ లేనన్ని పండుగలు శ్రావణంలో కనిపిస్తాయి. ముత్తయిదువులు ఆచరించే వ్రతాలు, నోములు ఈ మాసంలోనే ఉండడం వల్ల దీనిని వ్రతాల మాసమని, సౌభాగ్య మాసమనీ అంటారు. ఈ నెలలో తొలి మంగళవారం ఆచరించేది మంగళగౌరి వ్రతం. పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతం ఆచరించాలని 'వ్రతరత్నాకరం' చెబుతోంది. అవకాశం లేనివారు ఈ మాసంలోనే ఇతర శుక్రవారాలు వ్రతం ఆచరించవచ్చని ప్రత్యామ్నాయం సూచించారు పెద్దలు. సౌమంగల్యం, సత్సంతానాభివృద్ధి కోసం ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. కొత్తగా వివాహమైన వారు దీర్ఘ సౌభాగ్యం కోసం, అవివాహితలు ఉత్తములు భర్తలుగా రావాలని, వివాహితలు తమ వైవాహిక జీవితం సవ్యంగా సాగాలని మంగళగౌరి వ్రతాన్ని ఆచరిస్తారు. ఆషాఢంలో పుట్టినింట ఉండే నవ వధువులు శ్రావణం ప్రవేశించాక, మొదటి మంగళ వారం నోము అక్కడే జరుపుకుని మెట్టినింటికి బయలుదేరి, ఇక్కడ వరలక్ష్మి వ్రతం జరుపు కోవడం ఆనవాయితి.

వర్ణభేదాలకు అతీతంగా సర్వులూ వరలక్ష్మి వ్రతం చేసుకోవచ్చని సాక్షాత్ పరమేశ్వరుడే చెప్పాడని భవిష్యోత్తర పురాణం పేర్కొంటోంది. 'లోకంలో పరమపావనమైన వ్రతం ఏది?' అన్న జగన్మాత పార్వతీదేవికి మహాదేవుడు దీనిని ఉపదేశించారని, ఆమె మొట్టమొదటిసారిగా వరలక్ష్మి వ్రతం ఆచరించి నవరత్న ఖచితమైన లంకానగరాన్ని సంపదగా పొందిందని పురాణవాక్కు. పేద, గొప్ప, చిన్నా, పెద్దా తేడా లేకుండా శక్తిమేరకు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం చేసుకుంటారు. ఇక్కడ పూజకు,వ్రతానికి వ్యత్యాసాన్ని చెబుతారు. 'వరలక్ష్మిని ఒక్కసారి పూజించడమే కాదు...జీవితాంతం ఆచరిస్తూనే ఉంటాను' అని తొలి పూజ నాడు చేసే ప్రమాణం



# నాగదేవతా రక్షమాం!

నాగులకు సంబంధించిన పండుగను ఏడాదిలో అనేకసార్లు జరుపుకుంటారని వ్రత గ్రంథాలను బట్టి తెలుస్తోంది. తెలుగునాట మాత్రం శ్రావణ శుద్ధ పంచమి (నాగ పంచమి), కార్తిక శుద్ధ చవితి (నాగుల చవితి)ని ప్రధానంగా జరుపుకుంటారు. హరి పానుపు, హరుడి ఆభరణమైన సర్పాన్ని పూజించడం హైందవ సంప్రదాయం. నాగులు దేవీదేవలతో సమానంగా పూజలు అందుకుంటున్నాయి. అందుకు నేపథ్యాన్ని పరిశీలిస్తే... శ్రీహరి పానుపు ఆదిశేషుడు. అమృతం కోసం క్షీరసాగర మథనవేళ సర్పరాజు వాసుకి కవ్వపు తాడుగా సహకరించాడు. 'అహి' అనే నాగరాజు ఇంద్రునితో పోరాడి పరాజయం పొందినా, ఆయనతో తలపడిన ఖ్యాతిని పొందాడు. త్రేత, ద్వాపర యుగాలలో లక్ష్మణ, బలరాములు శేషాంశ సంభూతులు. కలియుగ దైవం శ్రీనివాసుడి ఆవాసం శేషాద్రి. ఇలా దేవతలతో అవినాభావ సంబంధం కలిగి ఉండడం వల్ల కూడా పూజార్హత పొందాయని చెబుతారు. శ్రావణ శుద్ధ పంచమి నాడు విధాత శేషునికి మొదటిసారిగా ప్రసాదం ఇవ్వడం వల్ల నాగులను పూజించే పర్వదినంగా వ్యవహారంలోకి వచ్చిందని వరాహపురాణం చెబుతోంది.

నాగపంచమి నాడు శిరస్నానం చేసి, వెండి, రాగి, రాతి, చెక్కలతో చేసిన నాగపడగలను భక్తులు అభిషేకిస్తారు. సర్ప విగ్రహాలను పూజించి పాలు, కొబ్బరి, అన్నం, పేలాలు, పరమాన్నం నైవేద్యంగా పెడతారు. బాలబాలికలు రెండు ఎండు కొబ్బరి చిప్పలను అలంకరించి, వాటికి రంధ్రాలు వేసి, రెండు దారాలు కట్టి తిప్పడం కొన్ని ప్రాంతాలలో ఉంది. గ్రామాలలో వేపచెట్టు మొదట్లోనో, అశ్వత్థ (రావి) వృక్షం మొదట్లోనే ప్రతిష్ఠితమైన నాగవిగ్రహాలు కనిపిస్తాయి. ఈ తిథిని నాగప్రతిష్ఠకు అనువైనదిగా



# ...మోస్తుతే...!!

కారణంగానే వరలక్ష్మీ 'పూజ' వరలక్ష్మీ 'వ్రతం'గా మారిందని చెబుతారు.

ఈ వ్రత ఆవిర్భావానికి సంబంధించిన ఒక గాథ ప్రకారం.... మగధదేశంలోని కుండిన నగరానికి చెందిన చారుమతి అనే ముత్తయిదువుకు లక్ష్మీదేవి కలలో కనిపించి, శ్రావణ పున్నమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ పూజ చేసుకోవాలని సూచించింది. అయితే తనతో పాటు ఇతరులతోనూ ఈ పూజ చేయించాలనే భావనతో చారుమతి తోటి ముత్తయిదువులతో కలసి శ్రద్ధాభక్తులతో పూజ నిర్వహించి, ఆత్మప్రదక్షిణకు ఉపక్రమించింది. మూడు ప్రదక్షిణలకుగాను వారికి వరుసగా, బంగారు గజ్జెలు, హస్తకంకణాలు, సర్వాభరణాలు లభించాయట. అడగకుండానే ఐశ్వర్యాన్ని ప్రసాదించిన 'అమ్మ'ను నిరంతరం పూజించాలన్న ఆకాంక్షే 'వ్రతం'గా మారిందని అంటారు. మహిళలు ఈ మాసంలో ఉదయం, సాయంత్రం దీపారాధన చేస్తే దీర్ఘసుమంగళీయోగం, అష్టైశ్వర్యాలు లభిస్తాయని విశ్వసిస్తారు.

సర్వసంపదలకు, సర్వసౌభాగ్యహేతువైన ఈ వ్రతం అమ్మవారి ధ్యాన ఆవాహనలతో ప్రారంభమై షోడశోపచారపూజ, అంగపూజ, అష్టోత్తరశత (సహస్ర) నామాలతో కొనసాగి, వ్రతకథతో పరిసమాప్తమవుతుంది. వ్రతకర్తలు ముత్తయిదువలకు...

**'ఇందిరా ప్రతిగృహ్ణాతి ఇందిరా వై దదాతి చ!**

**ఇందిరా తారికా ద్వాభ్యామ్ ఇందిరాయై నమో నమః'** (తోటి ముత్తయిదువా! ఈ వ్రత పరిసమాప్తితో మనిద్దరం లక్ష్ములమే. మనందరిలోనూ, మన చేతి తోరాల్లోనూ లక్ష్మి ఉందని గ్రహించాను. లక్ష్మీ స్వరూపిణీవై దీనిని స్వీకరించు) అని వాయనం ఇస్తారు.

**సర్వం లక్ష్మీనివాసం**

'ఇందుగలడందులేడని సందేహం వలదు' అని చక్రధారి గురించి పోతనామాత్యుడు ప్రహ్లాదుడితో పలికించడం చక్రవాసినికీ వర్తిస్తుంది. విష్ణువు జగత్తంతా వ్యాపించినట్లే లక్ష్మీదేవి సర్వవ్యాపితమై



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి

లోకజననిగా పేరు పొందింది. లక్ష్మీ కేవలం ధన రూపంలోనే కాదు– ప్రకృతిలో, మానవ నడవడిలో, వస్తువులలో... ఇక్కడ అక్కడని కాదు... మంగళకరమైన ప్రతిచోట నెలవై ఉంటుంది. తామరలు, ఏనుగులు, గుర్రాలు, గోవులు, తులసి, పూలు పండ్లతో కూడిన ఉద్యానవనాలు, హరితవనాలు, దీపకాంతులు, శుచిశుభ్రత కల ప్రదేశాలు, సదాచార పరాయణత, హరిహరార్చన, వేదఘోష, కలిగిన దానితో తృప్తిపడుతూ నిశ్చింతగా ఉండే


లోగిళ్లు, సౌమ్యం ధర్మగుణాలు, విద్యావేత్తలు, విద్వాంసులు, పెద్దలు సన్మాన సత్కారాలు అందుకొనే ప్రదేశాలు, క్రమశిక్షణ, సమయపాలన ..ఇలా ఎన్నో విశిష్టతలు కలవన్నీ శ్రీదేవి నిలయాలేనట. వాటిలో ఆధ్యాత్మికతతో పాటు సామాజిక కోణం, మానవ మనుగడకు అవసరమైన, ఆచరించదగిన అంశాలు, సూచనలు ఇమిడి ఉన్నాయి.

త్రిమాతలు లక్ష్మీ, సరస్వతి, పార్వతి..సంపద, వాక్కు, మంగళానికి అధిష్ఠానదేవతలు. ఈ ముగ్గురు విడదీయలేని శక్తులుగా ఉంటారు. కనుకనే, వాణీ పార్వతుల అధీనంలోని అంశాలు లక్ష్మీదేవిలో ఉమ్మడిగా కనిపిస్తాయని మహర్షుల ఉపదేశం. ★

భావిస్తారు.

పెళ్లి కావలసిన యువతులు, కుజదోష కారణంగా వివాహాలకు జాప్యమవుతున్న వారు, గర్భధారణలో ఆటంకాలు ఎదుర్కొంటున్న వారు ఈ పండుగను జరుపుకుంటే సాంత్వన చిక్కుతుందని, నాగపంచమి నాడు సర్పాలను పూజించిన వారికి సర్పభయం ఉండదని విశ్వాసం.

పాముల వల్ల ఎంత అపాయమో అంతకుమించి మేలు జరుగుతుందనేందుకు అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి. శ్రావణ మాసంలో వర్షాలకు పుట్టలు, బొరియల నుంచి వెలుపలికి వచ్చే పాములు జనాన్ని బాధిస్తాయి కనుక వాటిని ప్రసన్నం చేసుకునేందుకు నాగపూజకు వర్షాకాలంలో ప్రాధాన్యం ఇచ్చిఉంటారని పాత్రికేయ ప్రముఖుడు, రచయిత తిరుమల రామచంద్ర అభిప్రాయపడ్డారు. పాములు పంటలను అభివృద్ధి పరుస్తాయని, కనుక పంటలకు అధిదేవతని పూర్వీకులు విశ్వసించేవారు. నాగ దేవతలు సంతానాన్ని అనుగ్రహిస్తాయనీ నమ్మకం. మొహంజదారో శిథిలాలలో దొరికిన నాగ చిత్రాలున్న ముద్రికలు నమ్మకాలను చాటి చెబుతున్నాయి. ★



# వినతా సుతా వందనం!

## ఆగస్టు 2 నాగ/గరుడ పంచమి

నాగపంచమిని వైష్ణవులు 'గరుడ పంచమి'గా జరుపుకుంటారు. వినతాసుతుడు గరుడుడు మాతృభక్తి పరాయణుడు. తల్లి దాస్యాన్ని తొలగించేందుకు ఇంద్రునితోనే పోరాడి అమృతాన్ని సాధించాడు. కారణాంతరాల వల్ల సవతితల్లి, నాగమాత కద్రువకు దాసిగా మారిన వినతకు దాని నుంచి విముక్తి కలిగించాలనుకుంటాడు. అయితే తనకు అమృతం తెచ్చిస్తే దాస్య విముక్తి కల్పిస్తానన్న కద్రువ సుతుల షరతుపై అమరావతిపై దండెత్తి సుధా భాండాన్ని సాధించాడు. ఆ అమృత భాండాన్ని తెచ్చిన రోజే 'గరుడ పంచమి'. 'వేదాత్మా విహగేశ్వర' అన్నట్లు మూర్తీభవించిన వేదాలే గరుడుడని ఆధ్యాత్మికవేత్తలు అభివర్ణిస్తారు. విష్ణువుకు ధ్వజాధిదేవత. ఆయనకు మిక్కిలి అనుంగు సేవకుడు. మానవులు తమ ముఖాదిరూపాలను అద్దంలో చూసుకుంటున్నట్లే శ్రీహరి తన స్వరూపాన్ని గరుడునిలో చూసుకుంటాడట. అంటే ఎంత ఆంతరంగికుడో అర్థమవుతుంది. తిరుమలేశుని వాహనసేవల్లో 'గరుడ సేవ' అత్యంత ప్రధానమైనదిగా వర్ణిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంలోనే కాక ప్రతి మాసం పౌర్ణమి నాటి గరుడోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# జనని స్తన్యం..

అమ్మ అంటే వాత్సల్యం. వాత్సల్యమంటే ప్రేమ, మాలిమి, ఆదరం. ఆదరం అంటే మన్నన. మన్నన చూపడమంటే అక్కున చేర్చుకుని ప్రియత్వాన్ని ప్రసాదించడం. ఇవన్నీ తల్లిపాలలో ఉన్నాయి కాబట్టే అవి అమృత బిందువులు. వాటిని పసిబిడ్డ నోటికి అందించి ప్రాణం నిలబెడుతుంది మాతృమూర్తి. నవ మాసాలు మోసి, కని, పెంచి పెద్దచేసే ఆమె ప్రత్యక్ష దైవం. మన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు జననిని, తాను కటాక్షించే క్షీర ప్రాధాన్యాన్ని విపులీకరిస్తూనే ఉన్నాయి. వ్యక్తిగత, కుటుంబ ఆరోగ్యానికి, సామాజిక ఉత్తమత్వానికి దోహదపడే అమ్మపాల విలువను పెద్దలెందరో తేటతెల్లం చేస్తూనే ఉన్నారు. అన్ని విధాల ఆరోగ్యాలకీ మూలకారకాలలో ఒకటిగా అభివర్ణిస్తున్నారు. పోతపాలు కాదు – తల్లిపాల వల్లనే బిడ్డకు రక్ష అని చాటి చెబుతున్నారు. మన దేశానికే పరిమితమైన అంశం కాదిది. ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యత సంతరించుకుంటోంది. ఆగస్టు ఒకటో తేదీన మొదలయ్యే తల్లిపాల వారోత్సవాలు ఆరోగ్య, సామాజిక, మహిళా రంగాలతో పాటు మొత్తం వ్యవస్థకే దిశానిర్దేశం చేస్తున్నాయి. తల్లిపాలు పట్టడాన్ని ప్రోత్సహించడం ఉమ్మడి బాధ్యతగా ప్రకటిస్తున్నాయి. అన్ని ధర్మాలూ, శాస్త్రాలూ విధానాలూ కాలపరిణామ సిద్ధాంతాలూ శభాష్ అంటున్న రీతి. ఎనలేని సరిలేని అమూల్య కానుక ఏదంట– మాతృదేవత తన పసికందుకు రుచి చూపించే ఆ మధుర సుధ. ఔషధం, ఆయురద్రవం, శక్తి సాధనం, పసి నాలుకలకు పసందైన విందు అంతా అమ్మపాలే. 'నా పాలి దైవం' అంటాం కృతజ్ఞతగా. సంతానం పాలిట దైవం ప్రాతిపదికగా, అంతర్జాతీయ స్థాయి వార్షిక ఉత్సవాలను ఆరంభించి ఇప్పటికి మూడు దశాబ్దాలు.



'తల్లిపాల సంస్కృతీ పరిరక్షణం సర్వసమాజానికీ సకల ఆరోగ్యప్రదం' అనే నినాదం, విధానంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్య సమితి బాలల నిధి, బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా సంస్థలు అమ్మపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నాయి. పర్యవేక్షణను వరల్డ్ అలియెన్స్ ఫర్ బ్రెస్ట్ ఫీడింగ్ యాక్షన్ వ్యవస్థ చేపట్టింది. ఈసారి ప్రచారాంశంగా 'అన్ని వర్గాల, స్థాయుల మహిళలనీ కలుపుకునేలా' అనే పేరుతో ముందుకు తీసుకెళ్తోంది. దీనివైపు ప్రభుత్వాలు, సామాజిక ఆరోగ్య సంస్థలు, స్వచ్ఛంద సంఘాలు చూపు సారించాలని సూచిస్తున్నాయి. మరి ఈ ఉత్సవాలు ఆగస్టులోనే ఎందుకన్న ప్రశ్న ఎవరికైనా ఉదయిస్తుంది. ప్రభుత్వాల విధాన నిర్ణేతల బృందాలు, అంతర్జాతీయ వ్యవస్థల ప్రతినిధుల సంఘాలు సంతకాలతో 1990 ఆగస్టులో ప్రకటనను వెలువరించాయి. అమలులోకొచ్చిన తేదీనుంచే, ఆ ప్రాతిపదికన వారోత్సవాలు కొనసాగుతూ వస్తున్నాయి. జాతీయ స్థాయిలో మాసోత్సవాల నిర్వహణా ఆగస్టులోనే.

అమ్మ దయామయి. ఆ స్పర్శ, పరామర్శల మేలు కలయికే కౌగిలి. అది ఆ తల్లి మది పలికే మౌనగీతి. తనువుకీ, మనసుకీ అదొక మనోహర అనుభూతి. తల్లీబిడ్డల హృదయాలను స్పందింపజేసే సంగీత తరంగమది. బిడ్డ నెత్తుకుని ముద్దాడుతుంది ధాత్రి. భూదేవి అంతటి సహనశీలి. చనుబాలు అంతంత ఓరిమిగా అందించగలిగిన కారణంగానే, ఏటేటా లక్షలాది ప్రాణాలకు రక్షణ. శాస్త్రీయ అవగాహన, తగినన్ని జాగ్రత్తలతో పాలిస్తే ఎందరెందరో చిన్నారులు ఈ లోకాన సురక్షితంగా మనగలుగుతారు. నవజాత శిశువుల ఆరోగ్య భాగ్యమే ప్రధాన లక్ష్యంగా నిరంతరం పరిశ్రమిస్తున్న 'తల్లిపాల నిధి' సంస్థలూ చెబుతున్నదిదే. నాటి భారతీయ వైద్య పారంగతులైనా, నేటి వైద్యశాస్త్ర నిపుణులైనా చెప్పిందీ, చెప్తోందీ ఒకటే. శిశువుల భవిత సమస్తం స్తన్యంతోనే దృఢతరమవుతుంది. పుట్టిన ప్రతీ బిడ్డకీ తొలి గురువు తల్లి, మొదటి ఔషధం ఆమె పాలు. ఇస్తున్న అమ్మకీ, స్వీకరిస్తున్న చిన్నారికీ ఎంతెంతో అలౌకికత. ఆకలిదప్పులు తీర్చిన మాత, ఎదుగుదల సాధించిన శిశువు – ఈ ఇద్దరూ వాత్సల్య ప్రేమల ప్రతిరూపాలు. తల్లిది మమతల తేట, పసి ప్రాణానికి అదే వెలుగుబాట.

**ప్రాథమిక బాధ్యత**

ప్రకృతి ప్రసాదితాన్ని, శారీరక ధర్మాన్ని, సంప్రదాయ సారాంశాన్ని గౌరవిద్దాం.

## ఆగస్ట్ 1 నుంచి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

# జన్మధన్యం



**గర్భంతో ఉన్నప్పుడు అమ్మ జీవిత విధానమే, బిడ్డ పుట్టాక ఆ పసికందుకీ సంక్రమిస్తుంది. గర్భవతులకు ఆమేర సదవగాహన ముందుగానే కలిగేలా చక్కని శిక్షణనిస్తోంది హైదరాబాద్ కేంద్రంగా ఉన్న 'ఆర్యజనని'. తల్లిపాలు తాగుతూ పెరిగే బాలల్లో వికాసం ఎక్కువ. ఆ ఇద్దరూ ఒకరికొకరుగా ఉంటుంటారు. ఆ అనిర్వచనీయ భావం గట్టి పడటానికి కీలక కారణం అమ్మపాలే! గతంలోనే 25 దేశాల్లో ఒకేసారి కొనసాగిన అధ్యయనం పలు ముఖ్యాంశాలను వెల్లడించింది.**

ప్రకృతినే మాతగా భావిస్తుంది మన పురాణ సారస్వతం. మాత అనగానే మొదటిదీ, ముఖ్యమైనదీ అని అంతరార్థం. బిడ్డకు తల్లిగా మొదట ఆమె పాలిచ్చి పోషిస్తుంది. స్తన్యమివ్వడాన్ని అత్యంత పవిత్ర కర్తవ్యంగా పరిగణిస్తుంది. నిజానికి అదే ఒక సహజ సిద్ధ ఆరోగ్య పద్ధతి. శాస్త్రీయంగా నిరూపితమైన బహుళ ప్రయోజక విధానం. ప్రత్యామ్నాయమంటూ ఏదీ ఉండదు. ప్రసవమైన గంట లోపల పాలు పట్టి, బిడ్డకు ఆరు నెలల వయసు వచ్చే దాకా స్తన్యమిస్తూ పరిరక్షకురాలు కావాలి జనని. గర్భంతో ఉన్నప్పుడే శిశువుతో కలిగిన ప్రేమానుబంధం విస్తరిస్తుంది. కాన్పు అయ్యాక పాలిచ్చే సమయంలోనూ అదే ఆత్మీయతా అనురాగం. ఎంతైనా తాను అందించేది పరిపూర్ణ ఆరోగ్యం కదా! ఒంటికి బలం, వ్యాధి నిరోధకం, జీర్ణ ప్రక్రియను పదిలపరచడం– అన్నీ అమ్మపాలతోనే. అందువల్లనే ఉభయులకీ ముందు ముందు ఎటువంటి చింతా ఎదురవదు. పాలివ్వడంతో వెలువడే శారీరక పదార్థం కారణంగానే, అమ్మ గర్భసంచీ కాన్పు మునపటి దశలో కొస్తుంది. తల్లి పాలు వరమని, పోతపాలు శాపమనీ అందరికీ తెలుసు. ఎంత తెలిసినా దేశంలోనైనా, ప్రపంచంలోనైనా అవగాహన కలిగిన తల్లులు ఎంతమంది? ఇదీ అసలు ప్రశ్న. దానిని పాటిస్తే, శారీరకంగానే కాదు, మానసికంగా కూడా తల్లిపాలు ఎటువంటి సమస్యలనీ పిల్లల దరిచేరనివ్వవు. సత్తువనిస్తాయి, తెలివి పెంచుతాయి, చక్కగా ఎదిగేలా చేస్తాయి. అంటువ్యాధులు రాకుండా అడ్డుకునే గుణం తల్లి పాలలో ఉంది. సకల విధాలుగా వికాసం కలిగించే పోషకాల ప్రదాయనీ అదే. ఈ అన్ని ఉపయోగాలను పల్లెసీమల్లో ప్రచారాల ద్వారా తేటతెల్లం చేయాలని సమగ్ర శిశు అభివృద్ధి సంస్థలు కృషి సాగిస్తున్నాయి. రోజులో కనీసం ఏడెనిమిదిసార్లు పాలివ్వాలని, శిశువులకు సంతులిత ఆహారాన్ని ఇస్తున్నామన్న స్పృహతో వ్యవహరించాలని తల్లులకు సూచిస్తున్నాయి. 'అమ్మపాలే కమ్మన – అన్నింటికన్న మిన్న', 'తల్లిపాలు – ఆరోగ్య ప్రయోజనాలు వేన వేలు', 'స్తన్యమివ్వడం తల్లీబిడ్డకు క్షేమదాయకం..' ఇలా అనేక నినాదాలతో ప్రభుత్వ, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు తమవంతు కర్తవ్యాలు నిర్వర్తిస్తున్నాయి. ఎందరు ఎంత చెప్పినా, ఎన్ని సంస్థలు ఎన్నెన్ని ప్రచారాలు చేసినా, ప్రసవించిన ప్రతి తల్లీ తన ప్రాథమిక బాధ్యత తెలిసి మసిలితేనే సర్వత్రా ఆరోగ్య భాగ్యం.

### సేవామృత వాహిని

బిడ్డకు తల్లిపాలు ఎప్పుడు పట్టాలన్నది ఇప్పటికీ చాలామంది వనితల్లో ప్రశ్నార్థకమే! వైద్య నిపుణులు, శిశు చికిత్స ప్రవీణులు ఎంతగా చెప్తున్నా, ఎన్ని ముందు సూచనలిస్తున్నా ఫలితం అంతంత మాత్రంగానే ఉంటోంది. అంతా తమకే తెలుసనుకుని వ్యవహరించే కొందరు కుటుంబ పెద్దలు, అందునా పెద్ద మహిళలతో సమస్య ఏర్పడుతోంది. తెలిసీ తెలియనితనం ఆ విపత్కర పరిస్థితికి మూలకారణం. వారిచ్చే ఉచిత సలహాలు, వాటిని అదే మని అడగకుండానే అనుసరించే పసికందు తల్లులు అటు తర్వాత నానా ఇబ్బందుల పాలవుతున్నారు. మరికొన్ని సందర్భాల్లో, పెద్దలిచ్చే సరైన సూచనలూ, సలహాలను పాటించని వైనం, ఇంకెవరినో అడిగి, అంతర్జాలంలో ఏవేవో చూసి వాటినే పాటించే తత్త్వం కూడా కాలక్రమంలో సమస్యల తీవ్రతకు కారణమవుతున్నాయి. వాస్తవాలను తెలుసుకోలేక, కనీసం ఆ మేర ప్రయత్నమైనా చేయక, ఇష్టానుసార నిర్ణయాలతో కొంతమంది అతివలు కష్టనష్టాల్లో చిక్కుపడుతున్నారు. ఇలాంటి పరిస్థితిని చక్క దిద్దడానికి భాగ్యనగరంలోని 'ధాత్రి తల్లిపాల నిధి' వంటి సేవా సంస్థలు, రామకృష్ణమఠం కేంద్రంగా రూపొందిన 'ఆర్యజనని' కృషి చేస్తున్నాయి. ప్రతి నవజాత శిశువుకీ తల్లిపాలు అందాలన్నది ధాత్రి ధ్యేయం. ఆరేళ్ల కాలక్రమంలో ఈ నిధి జాతీయ స్థాయిలోనే పెద్దదిగా రూపుదిద్దుకుంది. నగరంలోని వైద్యశాల 'నిలోఫర్'లో ఏటా వేల మంది పుడితే; వివిధ కారణా లతో మృతి చెందుతున్న వారి శాతం పదికి పైనే. అలాంటి వారికి సరైన సమయంలో తగిన రీతిలో అమ్మపాలు అందిస్తే మృత్యుంజయులవుతారు. అలా ఊపిరి పోసేందుకే ఏర్పాటైంది ఆ నిధి. ఉదార హృదయ ముదితలు మాతృక్షీరం అంపిస్తే, దానిని భద్రపరిచేలా యంత్రంతో వెచ్చబెడుతున్నారు. పాలలో పోషక విలువలు కాపాడేలా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. వాటిని నిల్వవుంచి, నెలల తక్కువ పసివాళ్లకు పాలు తాగించి, ప్రాణ రక్షకులవుతున్నారు. అదీ సేవాతత్వమంటే!

### సదా సదవగాహనే మిన్న

గర్భంతో ఉన్నప్పుడు అమ్మ జీవిత విధానమే, బిడ్డ పుట్టాక ఆ పసికందుకీ సంక్రమిస్తుంది. గర్భవతులకు ఆమేర సదవగాహన ముందుగానే కలిగేలా చక్కని శిక్షణనిస్తోంది హైదరాబాద్ కేంద్రంగా ఉన్న 'ఆర్యజనని'.

తల్లిపాలు తాగుతూ పెరిగే బాలల్లో వికాసం ఎక్కువ. ఆ ఇద్దరూ ఒకరికొకరుగా ఉంటుంటారు. ఆ అనిర్వచనీయ భావం గట్టి పడటానికి కీలక కారణం అమ్మపాలే! గతంలోనే 25 దేశాల్లో ఒకేసారి కొనసాగిన అధ్యయనం పలు ముఖ్యాంశాలను వెల్లడించింది.

ఒక సంవత్సరంలో, పుట్టిన గంటలోనే (గోల్డెన్ అవర్) మాతృస్తన్యం దక్కని శిశువులు ఎంతమంది అంటే అక్షరాలా ఏడుకోట్ల ఎనభై లక్షలు!! తొలి గంట కల్లా తల్లిపాలు అందుకుంటే ఆ పసికందు శాశ్వతంగా కన్నుమూసే అవకాశాలు ఒకటీ రెండూ కాదు. 30 శాతానికి పెరుగుతాయి. వీటన్నింటిని పరిశీలించినప్పుడు, పరిస్థితి ఎంత తీవ్రతరంగా ఉందో అర్థమవుతుంది. ప్రతి సంవత్సరమూ జరిగే తల్లిపాల వారోత్సవాలు కాగితాల మీద రాతలకో, వేదికలపైన ప్రసంగాలకో పరిమితం కాకూడదు.

ప్రత్యేకించి భారతీయ కుటుంబ, సామాజిక వ్యవస్థల నేపథ్యంలో ఈ ఉత్సవాలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపచేయాలి. నవజాత శిశువుల తల్లులకు వివరించి చెప్పడం ద్వారా, చిన్నారులకు పరిపూర్ణ ఆరోగ్య భాగ్యం కలిగి ఇళ్లల్లో నవ్వుల పువ్వులు వికసిస్తాయి. అమ్మల పరంగా, పరిపూర్ణ అవగాహన ప్రాప్తిరస్తు! ★



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమానికి ఆమోదం తెలిపింది. భారతీయులు తమ ఇళ్ల వద్ద జెండాను ఎగురవేయడానికి ఇది స్ఫూర్తినిస్తోంది. స్వాతంత్ర్యం సిద్ధించిన 75వ సంవత్సరంలో దేశం సమిష్టిగా జెండాను ఇంటికి తీసుకురావడం దేశ నిర్మాణం పట్ల మన నిబద్ధతకు ప్రతిరూపంగా నిలుస్తుంది. ప్రజలకు దేశభక్తి, జాతీయ పతాకం గురించిన అవగాహనను మరింత పెంచినట్లవుతుంది. అందుకే మనమందరం ధైర్యంగా...

'విజయీ విశ్వ తిరంగా ప్యారా / ఝుండా ఊంచా రహే హమారా
సదా శక్తి బర్సానే వాలా / ప్రేమ సుధా సర్సా నే వాలా
హీరోం కో హర్ష నే వాలా / మాతృభూమి కో తన్ మన్ సారా' అని పాడుకుందాం.

# నూరు వసంతాలు

భారతదేశానికి ఓ జెండా అవసరం. ముస్లింలు, క్రైస్తవులు, యూదులు, పార్సీలు.. మరే ఇతర జాతివారైనా భారత్‌ను జన్మస్థలంగా అంగీకరించే వారికీ సాధారణంగా ఓ జెండా ఉండాలి. దాని కోసం జీవించాలి దాని కోసం మరణించాలి.


– మహాత్మా గాంధీ

ప్రపంచంలో ఏ స్వతంత్ర దేశానికైనా తన జాతికి ప్రతీకగా నిలిచే ఓ జెండా ఉంటుంది. అమెరికా, రష్యా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, చైనా... ఏ దేశమైనా తమతమ జెండాలతోనే ప్రపంచంలో జరిగే వివిధ కార్యక్రమాలకు హాజరవుతాయి. అందుకే ఒలంపిక్స్‌లో గాని, ఇతర ప్రపంచ ఆటల పోటీల్లో గెల్చినవారు తమ జాతీయ జెండాను శరీరాలకు చుట్టుకోవడం గాని, ఊరేగించడం గాని చేస్తారు. 'గెలుపు మాది కాదు, మా దేశానిది' అని తెలియ జేయడమే దాని ఉద్దేశం.

ప్రాచీన భారతీయులు జెండా లేదా ధ్వజాన్ని పూజించారు. మహాభారతం వివిధ ధ్వజాలను గూర్చి చెబుతుంది. భారత యుద్ధంలో అర్జునుడు కపిధ్వజాన్ని కలిగిఉన్నాడు. హనుమంతుడిని పూర్తి యుద్ధానికి సాక్షిగా చెబుతారు. హిందువులు భగవాధ్వ జాన్ని గౌరవిస్తారు. ఆర్ఎస్ఎస్ వారు భగవాధ్వజాన్ని 'గురువు'గా గౌరవిస్తారు. గురు పౌర్ణమి రోజు ఆ ధ్వజానికి పూజ చేసి గురుదక్షిణ సమర్పిస్తారు. ఆర్.ఎస్.ఎస్. శాఖలో ధ్వజాన్ని పెట్టి 'నమస్తే సదావత్సలే మాతృభూమే' అని ప్రార్థన చేస్తారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో స్వేచ్ఛ కోసం త్రివర్ణ పతాకంతోనే పోరాడారు. ఈ జెండా నేటి మువ్వన్నెల జెండాగా మారడం వెనుక అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి.

భారత స్వాతంత్ర్యోద్యమం బాగా ఊపు అందుకుంటున్నప్పుడు జాతీ యోద్యమ స్ఫూర్తిని, లక్ష్యాలను ప్రతి బింబించే జాతీయ పతాకం అవసరమైంది. వివేకానందుని శిష్యురాలైన ఐరిష్ వనిత సోదరి నివేదిత 1904లో భారత దేశపు మొదటి పతాకాన్ని రూపొందించారు. పసుపు ఎరుపు రంగుల ఈ పతాకం మధ్య భాగంలో వజ్రాయుధం, తెల్ల తామర గుర్తులు ఉన్నాయి. 'భారతమాతకు వందనం' అనే అర్థం వచ్చే బెంగాలీ మాటలు ఆ జెండాపై ఉన్నాయి.

బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ 1906 ఆగస్టు 7న కలకత్తాలోని పార్సీ బగాం స్క్వేర్‌లో సచీన్ద్ర ప్రసాద్ బోస్ ఓ పతాకాన్ని ఎగురవేశారు. అది కలకత్తా జెండాగా ప్రసిద్ధి చెందింది. 1907 ఆగస్టు 22న మేడం బికాజీ కామా జర్మనీలోని స్టట్ గార్ట్‌లో జెండాను ఎగుర వేశారు. మేడం బికాజీ కామా, వీర సావర్కర్, శ్యాంజీ కృష్ణవర్మ కలిసి దానిని తయారుచేశారు. 'ఈ జెండా భారత స్వాతంత్ర్యానికి సంబంధించినది. ఇది పుట్టింది అమరులైన భారతీయ యువకుల రక్తం నుండి. పెద్ద మనుష ల్లారా ఈ భారత స్వాతంత్ర్య పతాకానికి వందనం చేయండి. మానవ జాతిలో ఐదవ వంతును విముక్తి చేయడంలో ఈ జెండాకు సహకరించాలని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న స్వాతంత్ర్య ప్రేమికులకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను' అని స్టట్ గార్ట్‌లో జరిగిన అంతర్జాతీయ ఫోరమ్‌లో మేడం బికాజీ అన్నారు. (పూణేలోని మరాఠా, కేసరి లైబ్రరీలో ఈ జెండా భద్రపరిచారు). ఆమె పిలుపునకు భారతీయ ఉద్యమకారులు స్పందించారు. బెర్లిన్‌లోని భారతీయ విప్లవకారులూ ఈ జెండాను స్వీకరించడం వలన దీనిని బెర్లిన్ కమిటీ జెండాగా పిలిచేవారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో మెసపటోమియాలో దీనిని వాడారు. గదర్ పార్టీ వారు అమెరికాలో భారతీయ చిహ్నంగా వాడారు. 1917లో తిలక్, అనిబిసెంట్‌లు ఐదు ఎరుపు, నాలుగు ఆకుపచ్చ పట్టీలు గల జెండాను వాడారు. దానికి దిగువన హిందువులకు పవిత్రమైన సప్తఋషి మండలానికి గుర్తుగా ఏడు నక్షత్రాలను చిత్రించారు. అంతకు ఒక సంవత్సరం క్రితమే మచిలీపట్టణానికి చెందిన పింగళి వెంకయ్య త్రివర్ణ జాతీయ పతాకాన్ని రూపొందించారు. దానిని గాంధీజీకి చూపగా, భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యల నుండి విముక్తి పొందడానికి చిహ్నంగా నిలిచినా చరఖా(రాట్నం)ను పతాకం మధ్యలో చేర్చ వలసిందిగా సలహా ఇచ్చారు. కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల్లో పట్టీలు, మధ్యలో చరఖాతో పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని 1931 కరాచీ కాంగ్రెసు సమావేశంలో ఆమోదిస్తూ తీర్మానిం చారు. గాంధీజీ తమ 'యంగ్ ఇండియా' పత్రికలో



పింగళి వెంకయ్య


కె.ఎస్.

# నిండిన త్రివర్ణ పతాకం

పింగళి వెంకయ్యను ప్రత్యేకంగా ప్రస్తుతించారు.

పింగళి వెంకయ్య కృష్ణా జిల్లా మచిలీపట్టణానికి దగ్గర్లో గల 'భట్ల పెనుమర్రు' గ్రామంలో హనుమంత రాయుడు, వెంకటరత్నమ్మ దంపతులకు ఆగస్టు 2, 1876న జన్మించారు. ప్రాథమిక విద్య చల్లపల్లిలో, మాధ్యమిక విద్య మచిలీపట్టణం హిందూ హైస్కూల్లో పూర్తి చేసి, కొలంబోలో సీనియర్ కేంబ్రిడ్జిని పూర్తి చేసారు. జపాన్ దేశ క్రమశిక్షణ నచ్చి ఆ భాష నేర్చుకున్నారు. తరువాత తుర్లపాటి వెంకటాచలం, మంగమ్మ గార్ల కుమార్తె రుక్మనమ్మను వివాహం చేసుకున్నాడు.

పింగళి వెంకయ్య తన 19వ ఏట సైన్యంలో చేరగా దక్షిణ ఆఫ్రికాలో జరిగిన ఆంగ్లో బోయర్స్ యుద్ధానికి ఆయన్ని పంపారు. అప్పటికే దక్షిణ ఆఫ్రికాలో గాంధీజీ భారతీయ హక్కుల కోసం పోరాడుతున్నారు. 'నాతాల్ ఇండియన్ అంబులెన్సు కార్ప్స్' అధినేతగా గాంధీజీ ఎంపికయ్యారు. ఆ సందర్భంలో పింగళి వెంకయ్యకు గాంధీజీతో మంచి స్నేహం ఏర్పడింది. ఆ స్నేహం భారత్‌కు వచ్చాక కూడా కొనసాగింది.




ఇది మన జాతీయ పతాకం మొదటి నమూనా. **1921**లో బెజవాడ కాంగ్రెస్ సమావేశాల సమయంలో పింగళి వెంకయ్య రూపొందించారు

స్వాతంత్ర్య ప్రకటనకు కొద్ది రోజుల ముందు, అంటే జూలై 22, 1947 న త్రివర్ణ పతాకాన్ని జాతీయ జెండాగా గుర్తిస్తూ, దానిపై గల కాషాయ వర్ణం త్యాగానికి, ధైర్యానికి, తెలుపు రంగు చిత్తశుద్ధి, శాంతికి, ఆకుపచ్చ రంగు అభివృద్ధికి, ప్రతీకలుగా నిర్వహించారు. తెలుపు రంగుపై ధర్మానికి ప్రతీక అయిన అశోక చక్రం, దానికి 24 గీతలు ఉండేలా ఏర్పాటు చేయాలనీ (సారనాథ్ అశోకుని శిలా స్తంభ శాసనంపై గల ధర్మచక్రం) నిర్ణయించారు.

పింగళి వెంకయ్య మచిలీపట్టణం జాతీయ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేశారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో భూగర్భ శాస్త్ర పరిశోధన చేసి డిప్లొమా సంపాదించాక ప్రత్తి పంట, మైకాపై పరిశోధనలు జరిపారు. 'తల్లి రాయి' అనే పుస్తకం రాశారు. దానిలో బొగ్గు వజ్రంగా మారే పరిణామాలను వివరించారు. తరువాత 'భారతదేశానికి ఒక జాతీయ పతాకం' అనే పుస్తకం రాసి, 30 జాతీయ పతాకాల గురించి, వాటి ఆవశ్యకత, పరిణామాలను అందులో వివరించారు. ఆయన వివిధ రంగాలలో చేసిన కృషికి గుర్తింపుగా ఆయనను డైమండ్ వెంకయ్య, జెండా వెంకయ్య, ప్రత్తి వెంకయ్య, జపాన్ వెంకయ్య అని గ్రామస్థులు పిలిచేవారు.

స్వాతంత్ర్యం వచ్చాక పింగళిని ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. కటిక దారిద్ర్యంతోనే 1963 జులై 4వ తేదీన చిన్నపాకలో మరణించారు. ఆయన జ్ఞాపకార్థం 2009లో ఓ తపాలా బిళ్లను విడుదల చేశారు. ఇంత గొప్ప కృషి చేసిన పింగళి వెంకయ్యను 'భారతరత్న'తో గౌరవించాలని ప్రజలు ప్రభుత్వానికి అనేక ప్రతిపాదనలు పంపారు.

**జెండా పండుగ ఎందుకంటే...!**

జెండా పండుగను జాతీయ పండుగగా ఎందుకు చేసుకోవాలంటే... ఆ రంగుల్లో ఓ అందం, ఆకర్షణ ఉన్నాయి. అంతకు మించి ఓ జాతి అస్తిత్వం, ఐకమత్యం, ధర్మం దాగి ఉన్నాయి. 'కాషాయం దేశం పట్ల ప్రజల త్యాగాన్ని ఆత్మస్థైర్యాన్ని ప్రతిబింబిస్తే, తెలుపు స్వచ్ఛత, శాంతి, నిజాయతీలను చాటుతుంది. ఆకుపచ్చ విశ్వసనీయతని, ప్రకృతిని, పాడిపంటలను, సంపదను సూచిస్తుంది. మానవ ధర్మాన్ని బోధించే అశోక చక్రం నీలి రంగులో నిజాయితీకి ప్రతీకగా నిలుస్తుంది' అని స్వతంత్ర భారత తొలి ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ అన్నారు.

**సంప్రదించిన గ్రంథాలు:**

1. గాంధీ మహాత్ముని రచనా సంపుటి
2. Flag code of India
3. పోస్టల్ స్టాంపుల్లో జాతీయ పతాకం
4. Who is Pingali Venkayya? Remembering the architect of India`s National Flag - India Today dated August 2, 2018

★



## కథ

తారురోడ్డులా నల్లగా వంపులు తిరిగిన ఆమె జడ ఆమె కన్నా వేగంగా కదులుతోంది. ఆమె వెనకే నడిచే ఆడవాళ్లు ఆ జడ హొయలు చూస్తూ ఆయాస పడుతూ నడుస్తున్నారు.

మీనా నడుస్తూనే ఉంది. జడ ముందు పడినప్పుడల్లా ముందు పోతున్న తారురోడ్డుతో పోటీ పడుతోంది. అది మామూలు నడక కాదు. రాజకీయ పాదయాత్ర అంతకన్నా కాదు. లాక్‌డౌన్ తెచ్చిన తంటా నడక. వత్తిడి నడక.

‘ఇంటికి చేరాలి’ అనే ఆశ తప్పించి ఆశయం లేని నడక. ఒక నాయకుడో, ఒక నేతో నడవమంటే నడుస్తున్నది కాదు. నిజానికి నేతలు, అధికారులను ఆగమంటుంది ఇంకా ఆక్రోశంగా సాగుతున్న నడక. నిజానికి ఆ వెనుక నడుస్తున్న దాదాపు ఇరవై మందికి ఆమే గురి. అంటే నాయకి. వాళ్లల్లో ఆడవాళ్లు పదమూడు మంది.

వాళ్లల్లో తన తల్లి కూడా వుంది. మీనాకే కాదు అందరికీ స్వేద నదులు చల్లగా తగిలి సేద తీరుస్తున్నాయి. మధ్య మధ్యలో చింతచెట్లు అలసట చింత తీరుస్తున్నాయి.

పొద్దున్న ఐదింటికి బైల్దేరారు. మధ్యాహ్నం పన్నెండు గంటల కల్లా పట్టణానికి వచ్చారు. రోడ్డు మీద ఒక్క వాహనమూ లేదు. చాలా చోట్ల అడ్డాలు పెట్టి ఉన్నాయి. కొన్ని చోట్ల రెడ్ జోన్ అని రాసి పెట్టి లోపలికి పోనీకుండా ఆపుతున్నారు. అక్కడ పెద్ద చెట్టు కింద దూరం దూరంగా మూతులకు మాస్కులు పెట్టుకొని కూర్చున్నారు. కొంతమంది కాళ్లు వత్తుకుంటూ కూర్చున్నారు. మరికొంత మంది పాదాలను పరిశీలించుకుంటున్నారు. ఇంకొందరు అలసి సొలసి అడ్డంగా పడుకుండి పోయారు.

మీనా కూడా బాగా అలసిపోయింది. నడిచినంతసేపు అలసట తెలీలా. కూర్చున్న తర్వాత అలసట కమ్మేసింది. ఒక పావుగంట పాటు ధ్యానం చేసుకుంది. మళ్లీ ఊతం తెచ్చుకుంది. కర్తవ్యం గుర్తు చేసుకుంది. మధ్య మధ్యలో స్వచ్ఛంద సంస్థల వాళ్లు, ప్రభుత్వం వాళ్లు ఇచ్చిన నీళ్లు, మజ్జిగ, తినే పదార్థాలు, పండ్లు పాడవకుండా జాగ్రత్త చేసి సర్దిపెట్టింది. నడుస్తున్నప్పుడు ఎవరికీ అవి బరువు కాకుండా వారి వయసు, వంట్లో శక్తిని బట్టి వాటిని ఒక్కొక్కళ్లకి ఇచ్చింది. అందరికీ అన్నీ సమతుల్య ఆహారం లాగా వడ్డించింది. అందరూ మధ్యాహ్నం కునుకు తీసి చల్లటివేళ మళ్లీ బయల్దేరడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

మీనా ఒక తువ్వాలు కింద వేసుకుని పడుకుంది. సేదతీరిన ఆమె శరీరం దూదిపింజలా తేలిపోతోంది. మనసు మాత్రం ఆలోచనలతో బరువెక్కింది.

మీనా చెన్నైలోని ఒక మురికివాడలో పుట్టింది. ప్రాథమిక విద్యను ముగించింది తిరుపతి మురికివాడల్లో. తల్లిదండ్రులు చెన్నైలో పనులకెళ్లి అక్కడే చిల్లర కొట్టు పెట్టుకొని స్థిరపడ్డారు. ఉన్న ఒక్క తమ్ముడూ డెంగ్యూ జ్వరంతో పదిహేనేళ్ల వయసులో చనిపోయాడు. తొమ్మిదో తరగతి చదువుతున్న పిల్లోడు చనిపోవడంతో ఆ కుటుంబం బాగా కలత చెందింది. భలే చురుకైన, తెలివైన తమ్ముణ్ణి కోల్పోవడం తీరని లోటు అనిపించింది మీనాకి...

తమ్ముడు లాగా డెంగ్యూ వల్ల ఆ మురికివాడలో ఎవరూ చనిపోకూడదని అప్పుడే తను ఒక నిర్ణయానికి వచ్చింది. స్వామి వివేకానంద, మహాత్మాగాంధీల ప్రభావం తనమీద చాలా ఉంది. తాను వక్తృత్వ పోటీల్లో గెలిచినప్పుడల్లా వారి పుస్తకాలను బహుమతులుగా ఇచ్చేవారు. వాటిని చదివిన ఆమె, ఏ సమస్యనైనా ఉక్కు నరాలతో, ఉక్కు సంకల్పంతో జయించ వచ్చనే అవగాహన కొచ్చింది. తన తమ్ముడు దోమలు కుట్టడం వలన ఎలా చనిపోయాడో వివరిస్తూ అక్కడ యువతలో చైతన్యం కలిగించింది. ఆ ప్రాంతంలో



# ఏది మహమ్మారి

డాక్టర్ రమణ యశస్వి

దోమలు లేకుండా చేయడానికి ఉపక్రమించింది. స్థానికులు అందరూ కలసి అక్కడ మురుగు కాలవల్లో నీరు నిలవకుండా చూశారు. బహిరంగ మలమూత్ర విసర్జనను బహిష్కరించారు. అందరూ మరుగుదొడ్లు కట్టుకొని వాడేలా ప్రోత్సహించారు. మొదట మున్సిపాలిటీ వాళ్లు సహకరించకపోతే సత్యాగ్రహం చేసి వారిని తమ దారికి తెచ్చుకున్నారు.

మీనా అంటే 'మీ' ఇంటి పిల్ల , 'నా' ఇంటి పిల్ల, అందరి పిల్లా అనుకునేలా అందరికీ తలలో నాలుక అయింది. యవ్వనం తొణికిసలాడుతూ పుత్తడిబొమ్మలా వుంది మీనా ఇప్పుడు. తన అందాన్ని పక్కన పెట్టే వాక్చాతుర్యంతో ఆకట్టుకొంటోంది. డిగ్రీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. యూనివర్సిటీలో ఎం.ఎం. హిస్టరీలో చేరింది. జాతిపిత గాంధీజీ గురించి సమూలంగా చదవడానికి ఉపక్రమించింది. ఈ క్రమంలో గాంధీయిజం నరనరాన ఇంకి పోయింది.

అదే సమయంలో ఒక కంప్యూటర్ సంస్థలో మోహన్ పరిచయమయ్యాడు. ఒక స్టార్టప్ కోసం ఆ కంప్యూటర్ సంస్థలో పని చేస్తున్నాడు. ఆ పరిచయం ప్రేమగా, పెళ్లిగా మారి అక్కడే దగ్గర్లో ఇల్లు తీసుకుని వున్నారు.

అప్పటికి తన పీజీ కూడా అయిపోయింది. డిసెంబర్‌లో వాళ్ల స్టార్టప్ అహ్మదాబాద్‌లో మొదలు పెట్టడానికి అక్కడికి వెళ్లాడు మోహన్.

మోహన్ లేకపోవడం వలన పుట్టింట్లోనే వుంది మీనా. ఈ లోపు తను గర్భిణీ అని తెలిసింది. ఫిబ్రవరిలో తిరుపతిలోని పెద్దమ్మ వాళ్ల ఇంట్లో శుభకార్యానికి అమ్మని తీసుకొని వెళ్లింది. అక్కడ తనకు వేవిళ్లు బాగా అవ్వడంతో అక్కడే ఉండాల్సి వచ్చింది లేత నెలలు ఇప్పుడే ప్రయాణం వద్దు అని. మార్చి మొదటి వారంలో కొండకు తీసుకెళ్లి వెంకన్న దర్శనం కూడా చేయించారు.

అక్కడ స్కాన్ చేయించుకుంటే అక్టోబర్ రెండు కాన్పు తేదీ అని ఇచ్చారు. తన ఆదర్శం తనకు బిడ్డ రూపంలో రాబోతోందని ఎంతో సంతోషంగా ఉంది మీనాకు. పెద్దమ్మ వాళ్లు తనని ఎంతో బాగా చూసుకోవడం మీనా మనసుకి హత్తుకుపోయింది. వాళ్లకు కూడా మీనా నడవడిక, మాటతీరు, హాస్యోక్తులు ఇట్టే కలిసిపోయే లక్షణం బాగా దగ్గర చేశాయి. మోహన్ కాల్ చేశాడు తాను ఏప్రిల్ మొదటివారంలో వస్తానని. అయితే మీరు కూడా అప్పుడే వెల్దురు అని మీనా వాళ్లను పెద్దమ్మ వాళ్లు బతిమాలారు.

వాళ్లింట్లో పిల్లలకు కథలు, గాంధీయిజం గురించి చెప్తోంది. అదిగో అప్పుడు మొదలైంది కరోనా గోల. జనతా కర్ఫ్యూ తర్వాత లాక్‌డౌన్ కరోనా గురించి బాగా తెలిసేలోపే మొదలైపోయింది. ఎక్కడి వాళ్లు అక్కడే ఇరుక్కుపోయారు. మీనా వాళ్ల నాన్న ఒక్కడే అక్కడ చెన్నైలో వుండిపోయాడు.



మోహన్ గుజరాత్‌లో ఇరుక్కున్నాడు. అదే దిగులుగా వుంది మీనాకి.

పెద్దమ్మ వాళ్లకు నచ్చచెప్పింది. ఈ లాక్‌డౌన్ ఎన్ని రోజులు పొడిగించుకుంటూ పోతారో తెలీదు. నాన్న ఒక్కడే చెన్నైలో ఉన్నారు. నడిచైనా వెళ్లాలి అని ఆలోచిస్తోంది. కరోనా ఉధృతిని ప్రసార మాధ్యమాల్లో చూస్తూ పరిస్థితిని అంచనా వేసింది.

మొదటి లాక్ డౌన్ అయ్యే వరకు ఓపిక పట్టింది. టీవీల్లో, పేపర్లలో, నెట్లో కరోనా వైరస్ గురించి బాగా తెలుసుకొంది. అందరికీ తీసుకోవాల్సిన జాగ్ర త్తలు నేర్పింది. వలస కార్మికుల వెతలు చూస్తుంటే చాలా బాధేసింది.

రోడ్ల మీద, రైలు ట్రాక్‌ల వెంట రక్తం కారే పాదాలతో వారు నడిచి వెళ్లడం చూసి తల్లడిల్లి పోయింది. ఇప్పుడు కనుక గాంధీజీ ఉండి ఉంటే వారి ఒక్క పిలుపుతో వలస కార్మికులందరినీ రక్షించడానికి పూనుకునేవారేమో. గాంధీజీ వాళ్లతో పాటు ఎన్ని కిలోమీటర్లు అయినా నడిచి ఉండే



భౌతిక దూరం పాటిస్తూ వలస కార్మికులు తరలి పోవడం గాంధీ గారి ఉప్పు సత్యాగ్రహ యాత్రని తలపిస్తోంది. ఆంధ్ర, తమిళనాడు సరిహద్దుల్లో పెద్ద గొడవే అయింది వీళ్ల సమూహానికి పోలీసులకు. రెండు రోజులు శాంతియుత సత్యాగ్రహం చేశారు. ఎట్టకేలకు వీళ్ల ఫోన్ నంబర్లు, చిరునామాలు తీసుకుని కచ్చితంగా అక్కడికి వెళ్లాక ఇంట్లోనే క్వారంటైన్‌లో ఉండాలని చెప్పి పంపించేశారు.

వారేమో! వారి స్థానంలో ఎవరైనా గాంధీ కావచ్చు.. ఎవరి పరిధిలో వారు.

నిజానికి మీనా కుటుంబం కూడా వలస కార్మికులే. తన చుట్టాలందరూ తిరుపతిలో ఉన్నారు. వారిలో చాలామంది వలస వెళ్లారు. ఆ చుట్టుపక్కల చాలామంది చెన్నై వెళ్లవలసిన వారని తెలుసుకొని అందరూ ఒక సమూహంగా బయల్దేరడానికి పథక రచన చేసింది. తిరుపతి నుండి చెన్నై సుమారు 140 నుండి 150 కిలోమీటర్లు. రోజుకు 15 కిలోమీటర్లు నడిచినా పది రోజుల్లో క్షేమంగా వెళ్లొచ్చు. మొత్తం ఇరవైమంది తేలారు. అందరికీ తలా ఐదు మాస్కులు, సబ్బులు, చెప్పులు, తువ్వాళ్లు, దుప్పట్లు, సంచులు పెద్దవాళ్లకు చేతికర్రలు, టార్చ్‌లైట్లు, సెల్ ఛార్జర్లు, పవర్ బ్యాంకులు, కొన్ని తిండిగింజలు, పండ్లు, ఇలా అవసరమైనవి అన్నీ సమకూర్చుకొని, చక్కగా సర్దుకొని ఏప్రిల్ ఆరు పొద్దున్న ఐదు గంటలకు బయల్దేరారు.

తను కూడా తన అమ్మకి తనకు కావాల్సినవన్నీ పెట్టుకుంది. వలస కూలీల కష్టాలను అక్షరీకరించ దానికి పుస్తకం, కలం కూడా తెచ్చుకుంది. తాను జర్నలిజం కోర్సు కూడా పూర్తి చేసింది కాబట్టి ఎప్పుడూ కలం కాగితం వెన్నంటే ఉంటాయి.

తోవలో ఒక నిండు చూలాలు కాంచీపురం వెళ్లే గుంపులో కనిపించింది. ఆవిడకి కాన్పు చేసింది. మూడో కాన్పు కాబట్టి సులువుగానే కాన్పు అయి తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. ఆ బాలింతకు చెప్పులు లేకపోతే ఒక జత చెప్పులు ఇచ్చి పంపింది.

భౌతిక దూరం పాటిస్తూ వలస కార్మికులు తరలి పోవడం గాంధీ గారి ఉప్పు సత్యాగ్రహ యాత్రని తలపిస్తోంది. ఆంధ్ర, తమిళనాడు సరిహద్దుల్లో పెద్ద గొడవే అయింది వీళ్ల సమూహానికి పోలీసులకు. రెండు రోజులు శాంతియుత సత్యాగ్రహం చేశారు. ఎట్టకేలకు వీళ్ల ఫోన్ నంబర్లు, చిరునామాలు తీసుకుని కచ్చితంగా అక్కడికి వెళ్లాక ఇంట్లోనే క్వారంటైన్‌లో ఉండాలని చెప్పి పంపిం చేశారు.

తమిళనాడులో ప్రవేశించే సరికి ఎనిమిది రోజులు పట్టింది. ఇక్కడి నుంచి ఇంకో ఐదు రోజులు పట్టేలా ఉంది అడ్డంకులు అన్నీ తప్పించుకొని వెళ్లేసరికి. ప్రతి రహదారిలో వందల మంది మూట లతో, చంకన పిల్లతో, కర్రలు పోటేసుకుంటూ, చెప్పు ల్లేకుండా, రక్తం కారుతున్న పాదాలతో, చెమటలు కక్కుతూ సొంతూళ్లకు త్వరగా చేరుకోవాలనే తపనతో నడుస్తున్నారు.

కొన్నిచోట్ల కంటైన్మెంట్ ప్రాంతాల నుంచి పోవడానికి లేదు అంటే, పక్కన పొలాల్లో నుంచి కూడా నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. కొంత మంది నడిచీ నడిచీ నిస్సత్తువగా నేలమీద పడ్తున్న దృశ్యాలు మీనా కంటపడ్డాయి.

ఎంత కష్టం ఎంత కష్టం! అని మనసులోనే విలపిస్తూ నడుస్తోంది మీనా. ఇంటికి చేరాలనే తపన ఇంటికి దగ్గరయ్యే కొద్దీ ఎక్కువవుతోంది. తమ గుంపులో అందరూ క్షేమంగానే ఉన్నారు కాళ్లు, నడుము నొప్పుల లాంటివి తప్పించి. ఎన్నో జాగ్రత్తలు తీసుకోవడం, ఎక్కువసేపు విశ్రాంతి, ఉన్నంతలో మంచి ఆహారం, మంచినీళ్లు ఎక్కువ తీసుకోవడంతో చాలా వరకు అనారోగ్య సమస్యలు లేకుండా నడవ గలిగారు. స్వచ్ఛంద సంస్థలు ఇచ్చిన పండ్లు కూడా శుభ్రం చేసుకొని తిన్నారు. కరోనా జనంపై దాడి చేయకుండా అన్ని జాగ్రత్తలు పాటించేలా ప్రతి క్షణం కాచుకుంది మీనా.

చెన్నై పట్టణంలోకి రాగానే చాలా తనిఖీలు జరిగాయి. కోవిడ్ లక్షణాలు ఉన్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. జ్వరం చూశారు. అందరికీ ఆహారం, నీళ్లు పండ్లు ఇచ్చారు. ఇక అక్కడినుంచి ఎవరి ఇళ్లకు వారు వెళ్తూ మీనాకి కృతజ్ఞతలు చెప్పారు. అందరికీ చేతులు జోడించి నమస్కారం పెట్టి భారమైన మనసుతో తమ గమ్యం వైపు మళ్లారు మీనా వాళ్లు.

ఇంత కన్నా పెద్ద కష్టం. ఇంటిదగ్గర వాళ్ల నాన్న రూపంలో వేచి ఉందని మీనాకు తెలీదు పాపం. ఇంటికి చేరి ఎప్పుడెప్పుడు నాన్నని చూస్తానా! అని మీనా, భర్తని చూస్తానా! అని మీనా తల్లి అడు గులు వాళ్ల కాలనీవైపు వడివడిగా పడుతున్నాయి. పద్దెని మిది రోజుల అలసట నాన్నని చూస్తే పోతుంది అను కుంటూ, నిన్న పొద్దున ఆయనతో మాట్లాడినప్పుడు 'తొందరగా రండమ్మా పేణం పెద్దగా బాగుండట్లా' అన్న మాటలే కొంచెం ఆందోళన కలుగజేస్తున్నాయి.

ఆనందంగా నాన్న ఎదురొస్తాడు అనుకుంటే ఇంటి దగ్గర చడీచప్పుడు లేదు. దగ్గరగా వేసున్న తలుపుని నెట్టి లోపల చూస్తే నాన్న కొన ఊపిరితో ఉన్నట్లున్నాడు. చుట్టూతా 'మందు' సీసాలు ఉన్నాయి. మందెక్కువ తిండి తక్కువ అయిందని అర్థం చేసుకుని పక్కనే ఉన్న కాంపౌండర్‌ని తీసుకొచ్చి సెలైన్ పెట్టించింది.

'అమ్మా క్షమించమ్మా! నువ్వు లేకపోవడం వల్ల పట్టు తప్పాను'అని వేడు కున్నాడు కొంచెం ఊతం వచ్చాక. ఆ రాత్రంతా జాగారం తప్పలేదు. సరైన సమయానికి రావడం వల్ల పెద్ద గండం తప్పిందను కున్నారు. వారం రోజులు పట్టింది మామూలు మనుషులయ్యేసరికి.

అదృష్టం కొద్దీ అబార్షన్ కాలేదు. వైరస్ కన్నా ఈ భయమే మీనాని వెంటాడింది. నడక, సత్యా గ్రహం, ఒక కారణం కోసం ఓర్పుగా శ్రమించడం అదీ కడుపులో బిడ్డతో. ప్రహ్లాదుడిలా గర్భంలోనే గాంధీయిజం వంట బట్టించుకొని మహాత్ముడు మళ్లీ పుడతాడు నా కడుపున.

గాంధీ పుట్టిన రాష్ట్రం గుజరాత్‌లో ఉన్నాడు మోహన్. అక్టోబర్‌లో పుడతాడు కాబట్టి మోహన్ గాంధీ అని పేరు పెడదాం. ఏది మహమ్మారి? సారానా? కరోనానా? అని పుట్టబోయే గాంధీనే తేలుస్తాడు.

ఇదంతా మెయిల్‌లో మోహన్‌కి ఉత్తరం రాసింది. అలాగే ఈ నడక అనుభవాలన్నీ 'వలస విలాపం 'అనే పుస్తకం రాసి అచ్చు వేయించింది మీనా. ★

ఎ. రామచంద్ర రామానుజ



# సాధన విజయానికి ఇంధనం

**సాధనకు ముందు మనిషిలో ఉజ్జ్వలమైన అభిలాష, సంకల్పం ఉండాలి. బుద్ధి, జ్ఞానం, విచక్షణ, వివేకం... మనిషికి జన్మతః లభించే వరాలు. ఆయా వ్యక్తులను బట్టి వీటి స్థాయుల్లో అంతరాలు ఉండవచ్చు. వీటన్నిటిని సవ్యంగా ఉపయోగించుకోవడం ద్వారా అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చని ఎందరో మహనీయులు నిరూపించారు.**

సాధారణంగా చాలా మందికి ఏదో ఒక ఆశయమంటూ ఉంటుంది. ఆ ఆశయాన్నే సంకల్పంగా చెబుతారు. అది ఉన్నతం, ఉదాత్తమైనదైతే మరింత రాణిస్తుంది. సంకల్పం అంటే మంచి ఆలోచన (సమ్యక్+సంకల్పం) అని అర్థం. అది వ్యక్తిగతం కావచ్చు, వ్యవస్థాగతమూ కావచ్చు. అయితే సంకల్పం ఉంటే సరిపోదు. అది బలమైనదైనప్పుడు కార్యరూపం దాల్చి, సత్ఫలితాలనిస్తుంది. అందుకు నిరంతర సాధన (పురుష ప్రయత్నం) కూడా తోడుకావాలి. నేర్చుకోవాలన్న/ తెలుసుకోవాలన్న తపన, ఏకాగ్రత– సాధకుడికి ఇంధనంగా పని చేస్తాయి. ఆ లక్షణాలు లేనప్పుడు సాధన మొక్కుబడి ప్రక్రియే అవుతుంది. సాధన అనేది పురుష ప్రయత్నంపై ఆధారపడి ఉంటుందని శ్రీరాముడికి వశిష్ఠ మహర్షి వివరించారు. సాధన అనే పురుష ప్రయత్నానికి దైవానుగ్రహమూ అవసరం.

పుట్టుకతోనే ఏ విద్య రాదు. అనేక విషయాలు సాధన, అనుభవం ద్వారానే తెలుస్తాయి. సాధకుడికి ఎంచుకున్న విద్య అంత త్వరగా పట్టుబడకపోవచ్చు. అలాంటి సమయంలోనే ఓర్పు, ఏకాగ్రత అవసరం. అనుకున్నది జరగాలంటే అందుకు తగినట్లు ప్రయత్నించాలి. డోలాయమాన స్థితిలో చేపట్టే కార్యం సత్ఫలితాలను ఇవ్వదు. 'ఇది చేయాలి' అనుకుని నిద్రావస్థలోకి వెళితే అది సాధ్యం కాదన్నది పెద్దల మాట. 'దీనిని సాధించేదాకా నిద్రించను' అనే పట్టుదలతో కూడిన సాధన ఉంటే ఏదీ అసాధ్యం కాదు. సాధించగలనన్న ఆత్మవిశ్వాసం, విజేతగా నిలవాలన్న పట్టుదల ఉండాలి. అలాంటి విజయులైనవారు పురాణాల నుంచి ఆధునికయుగం వరకు లెక్కకు మిక్కిలిగా ఉదాహరణలుగా నిలుస్తారు. వివిధ రంగాలలో ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించినవారంతా ఆరంభంలో సామాన్యులే. తదేక దీక్ష, సాధనతో అసామాన్యులుగా నిలిచారు, నిలుస్తున్నారు.



ఎవరి ద్వారా సాధన ప్రారంభించాలి? ఆ సాధన సాగుతున్న తీరును, ఎదురయ్యే అడ్డంకులను ఎలా అధిగమించగలం? లాంటి అంశాలను గమనంలోకి తీసుకోవాలి. ఏకాగ్రత, పట్టుదల అంకితభావం ఉండాలి. గురువు ఉపదేశించినా ఆ అంశాన్ని సాధించడం శిష్యుడి ప్రయత్నంపై ఆధారపడి ఉంటుంది. అదే సాధన.

***'ఆచార్యాత్ పాదమాదత్తే పాదం శిష్యః స్వమేధయా!***
***పాదం సబ్రహ్మచారిభ్యః పాదం కాలక్రమేణచ!!'***

శ్లోకం అదే చెబుతోంది– శిష్యుడు ఆచార్యుని వద్ద నేర్చుకునేది ఒక పాదం (ఒక వంతు) మాత్రమే. స్వబుద్ధితో లోతుగా విశ్లేషించి మరో పాదాన్ని, సహాధ్యాయులతో చర్చల ద్వారా ఇంకో పాదాన్ని, నేర్చిన దానిని ఆచరణలో పెడుతూ కాలక్రమంలో ఇతరుల నుంచి మరికొంత తెలుసుకుంటాడు. విజ్ఞానాన్ని సాధించే ఈ క్రమం అన్ని సందర్భాలకు వర్తిస్తుంది.

కార్యసాధకు(లు)డు కష్టనష్టాలను గణించరని...

***'క్వచిత్ పృథ్వీశయ్యః క్వచిదపి చ పర్యంక శయనః***
***క్వచిచ్ఛాకాహారీ క్వచదపి చ శాల్యోదనరుచిః***
***క్వచిత్ కంథాధారీ క్వచిదపి చ దివ్యాంబరధరః***
***మనస్వీ కార్యార్థీ న గణయతి దుఃఖం న చ సుఖమ్'***

(సాధకుడు అవసరమైనప్పుడు కటికనేలపై పడుకుంటాడు. మరొకప్పుడు పూలపాన్పుపై విశ్రమిస్తాడు. ఆహారం దొరకనినాడు పచ్చికూరలతో సరిపెట్టుకుంటాడు. ఒక్కోరోజు మంచి భోజనం చేస్తాడు. ఒకప్పుడు బొంత (కంబళి), వేరొకసారి మంచి వస్త్రం ధరిస్తాడు. కార్యసాధకుడు ఈ కష్టసుఖాలను మనసులో పెట్టుకోడు)అని భర్తృహరి చెప్పాడు.

మొదట కష్టమనిపించిన విషయం కూడా అభ్యాసం వల్ల రానురాను సాధారణమైపోతుంది. మరికొంత కాలానికి సులువుగా మారి, ఆ విషయం మీద పట్టు వస్తుంది, నైపుణ్యం మెరుగుపడుతుంది. క్రమం తప్పక చేసే సాధనవల్ల లోపాలు గణనీయంగా నివారణమవుతాయని, పరిపూర్ణత చేకూరుతుందని అనుభవజ్ఞులు చెబుతారు. దీనినే 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్నాడు వేమన. **'అలవాటైతే విషమే అయినా హాయిగా తాగుట సాధ్యం/ కాలసర్పమును మెడలో దాల్చి పూలమాలగా తలచవచ్చు/ ఏకాగ్రతతో ధ్యానము చేసి లోకేశుని చేరవచ్చు'** అని తుకారాం అభంగాలు చెబుతున్నాయి. సరైన ఆచార్యుని సమక్షంలో వినయ విధేయతలు, నిజాయతీ, నిరాడంబరతతో నేర్చుకోవాలనే తపననే 'సాధన' అని పెద్దలు చెబుతారు. అందుకు హనుమ పరమోదాహరణ. ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యగమనాన్ని అనుసరిస్తూ ఆయన ద్వారా విజ్ఞానవంతుడు, నవవ్యాకరణ పండితుడై, రామనామ సాధనతో భక్తాగ్రేసరుడు అయ్యాడు. చీకటిలో సైతం సాధన చేసి అర్జునుడు విలుకాడుగా వినుతికెక్కాడు. ద్రోణాచార్యుడి విగ్రహాన్ని ఎదుట నిలుపుకుని ధనుర్విద్యను సాధన చేశాడు ఏకలవ్యుడు. నేర్చుకోవాలన్న తపన, కార్యదీక్ష, గురువు మీద గురి అతడిని మహోన్నత స్థాయిలో నిలిపాయి. తెలుగులో తప్ప ఏ సాహిత్యంలో లేని అరుదైన, అపూర్వ ప్రక్రియ అవధానం. పృచ్ఛకులు సంధించే ప్రశ్నలకు సంయమనంతో, సందర్భానుగుణంగా సమాధానాలు చెబుతూ, పూరించిన పద్యాలను ఏకధాటిగా ధారణ చేయడం వెనుక అవధానుల సాధన, ఏకాగ్రతల ప్రాధాన్యం ఎంతటిదో అవగతమవుతుంది.

సాధన అంటే కేవలం భక్తి భావనో, ధ్యానావస్థలోకి వెళ్లడమో కాదు. అనుకున్నది సాధించగలగడం. సాధకులూ అందరిలానే ఆహారం స్వీకరిస్తారు, నిద్రిస్తారు. నిత్యవ్యవహారాలలో పాలుపంచుకుంటారు. అయితే బహు విధాలుగా పరుగులు తీసే మనసును ఎంచుకున్న విషయం నుంచి పక్కదారి పట్టకుండా ఏకదీక్షలో నిమగ్నం చేస్తారు. అనుకున్న కార్యాన్ని సాధించాలన్న లక్ష్యాన్ని మరువరు. అదే వారిని ఉన్నతులుగా, భావితరాలకు స్ఫూర్తి ప్రదాతలుగా నిలుపుతుంది. ★

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

## మాలపల్లి నవలకి నూరేళ్లు

# దహనకాండ నుంచి త

గత సంచిక తరువాయి

ఉన్నవ ఉపాధ్యాయునిగా, డిస్ట్రిక్ట్ మున్సబ్ కోర్టులో న్యాయవాదిగా కొద్దికాలం పనిచేశారు. 1913లో వెళ్లి ఐర్లాండ్ రాజధాని అయిన డబ్లిన్‌లో బార్–ఎట్–లా చేరారు. అది ఐరిష్ ప్రజలు స్వరాజ్యం మొదలైన 'హోమ్ రూల్' పోరాటం షిన్ ఫిన్ ఉద్యమంగా రూపాంతరం చెందుతున్న కాలం. అప్పుడే దాని నాయకుడు డావలెరాతో ఉన్నవ పరిచయం పెంచుకున్నారు. నాటి ప్రపంచంలో జరుగుతున్న ఇతర రాజకీయ ఉద్యమాలతో కూడా ఉన్నవ ప్రభావితులయ్యారు. ఆయన బారిస్టర్ పరీక్షలో కృతార్థుడై 1916లో భారత్ చేరుకున్నారు. కానీ న్యాయవాద వృత్తిలో ఎక్కువ కాలం లేరు. అప్పుడే రావుల సీతారామయ్య ఉన్నవతో చేసిన సంభాషణ– 'మీ ప్లీడర్ వృత్తిని మానదలచినట్లు మీ గుమాస్తా వలన తెలిసినది... ఎందుకు తొందర పడెదరు?' అని ప్రశ్నించారు. 'నిజమే నేను ధనవంతుడను కాను.. నాయక్కర్లు తీరునంతవరకూ ఈ నాన్ కో ఆపరేషన్ మూవ్‌మెంట్ ఉండునా? ఈ సమయములో ఉద్యమమునకు తగిన సహాయము చేయకపోయినచో ముందు దేశమునకు మహా అనర్థకము రాగలదు గాన వెంటనే నా వృత్తి నేను వదిలి ఉద్యమ ప్రచారము చేయుటకు నిశ్చయించు కొంటిని' అన్నదే ఉన్నవ వారి సమాధానం (ఆంధ్రపత్రిక ఆగస్టు 10, 1921). 1921 నాటికి 'భారతదేశం తగలబడిపోతున్న యిల్లు' మాదిరిగా వున్నదని రవీంద్రనాథ్ టాగూర్‌తో వివాదం వచ్చిన సందర్భంలో గాంధీజీ 'యంగ్ ఇండియా' (అక్టోబర్ 13, 1921) పత్రికలో రాశారు. రోమ్ తగలబడి పోతూ ఉంటే నీరో ఫిడేల్ వాయించుకుంటూ ఉన్నాడట, కానీ ఉన్నవ ఆత్మానంద కవిత్వ రచనలకు నగిషీలు చెక్కుకుంటూ ఉండిపోలేదు. భారతదేశమనే ఇల్లు తగలబడిపోతుండగా ఆయన ఒక నవల రాసాడంటే, అది ఒక ఫైర్ ఇంజిన్‌లా పని చేయాలన్న స్పృహతోనే.

ఇవాళ మనం స్వేచ్ఛగా చదువుకుంటున్న 'మాలపల్లి' నవల చిరకాలం నిషేధాల చీకటిలోనే ఉండిపోయింది. అసలు ఆ నవల కారాగారంలో పుట్టింది. ఒక ఉద్యమకారునిగా ఉన్నవ జైలుకు వెళ్లడం, శిక్షా సమయాన్ని ఇలా సాహిత్య వ్యాసంగానికి ఉపయోగించడం అద్భుతమే. జైలులో ఉన్న సమయాన్ని వృథాగా పోనీయరాదని ఆయన తీసుకున్న నిర్ణయంతో ఒక గొప్ప నవల తెలుగు సాహిత్యానికి అందింది. ఆ క్రమాన్ని కూడా పరిశీలించాలి.

పల్నాడు పుల్లరి సత్యాగ్రహం ఇక్కడ ప్రధానాంశం. పల్నాడు అటవీ ప్రాంతం, కొండ భూమి. ఫారెస్ట్ అధికారుల అనుమతి పత్రం లేనిదే గొడ్లను మేతకూ, కట్టెలు ఏరుకోవడానికీ అనుమతించరు. గొడ్లను మేపుకోవడానికి 'పుల్లరి' చెల్లించాలి. చెల్లించేది లేదని ప్రజలు తిరుగుబాటు ప్రారంభించారు. రంగా చెంచయ్య ఆధ్వర్యంలో ఫారెస్ట్ ఉద్యోగులను ఇతర అధికారులను సాంఘిక బహిష్కరణ చేశారు (కొండా వెంకటప్పయ్య స్వీయ చరిత్ర పేజీ 230–231). ఈ పరిస్థితులలో 1921 జులైలో రాష్ట్ర కాంగ్రెసు నెల్లూరు జిల్లాలోని వెంకటగిరిలో కటికనేని వారింట్లో సమావేశమై, పల్నాడు పుల్లరి సత్యాగ్రహ విషయమై విచారణ జరిపి ఒక నివేదికను సమర్పించాలని 'ఉన్నవను, మాడభూషి వేదాంత నరసింహాచార్యులను' నియమించింది ('నా జీవిత కథ' అయ్యదేవర కాళేశ్వరరావు పేజీ 335–336).

'వారిరువురూ జూలై 16, 1921న గుంటూరు నుంచి బయలుదేరి నరసరావుపేట చేరి గుత్తికొండ నుండి రెండెడ్ల బండి చేసుకొని జూలకల్లు బోయి, ఆ రాత్రి అచ్చటి వారితో యుద్యమమును గురించి ముచ్చటించి సాధక బాధకాలు తెలుసుకొన ప్రయత్నించిరి' (గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం, మాదల వీరభద్రరావు, పేజీ 58). ఇలా వీరిరువురూ పల్నాడు ప్రాంతం చేరి ఆ ఉద్యమంతో మమేకం పొందారు.

గురజాల, మాచర్ల ప్రాంతంలో బ్రిటిష్ ప్రభుత్వ అధికారులకు కోమటి బియ్యం విక్రయించడు, చాకలి బట్టలు ఉతకడు, మంగలి క్షవరం చేయడు. కడకు బావిలో నీళ్లయినా తోడుకోనియ్యరు. ఇదీ అక్కడి ప్రజలు సాగించిన ఉద్యమం తీరు. గుంటూరు జిల్లా కలెక్టర్ షీల్డ్ గురజాల, మాచర్ల గ్రామాల్లో మకాం చేసి ఈ బహిష్కారాన్ని స్వయంగా చూసాడు. పంచదార దొరకలేదు, కాఫీ లేదు, కడకు గ్లాసు పాలు కూడా తెప్పించుకోలేకపోయాడు. ఊరిలో రహస్యంగా వీటిని కొనడానికి డిప్యూటీ తహసీల్దార్ ప్రయత్నించగా 'స్వరాజ్య సంఘం' వారు ఆ అవకాశమివ్వలేదు ('మాలపల్లి – నిషేధాలు', బంగోరె, పేజీ 25). దానితో ఈ ఉద్యమాన్ని ఎలాగైనా ఆపాలి కాబట్టి ముగ్గురిపై కేసు పెట్టి మూడు నెలలు శిక్ష పడేటట్లు చేశారు కలెక్టర్ షీల్డ్. దీనితో పాటు ఉన్నవ, నరసింహాచార్యులకు నోటీసులిచ్చి సి.పి.సి 107 సెక్షన్ క్రింద అరెస్టు చేసి ఏడాది జైలు శిక్ష విధించారు.





అరెస్టయిన ఇద్దరినీ జూలై 24 ఉదయానికి గుంటూరు తీసుకొచ్చారు. ఉన్నవ లక్ష్మీబాయమ్మ గుంటూరు స్టేషన్‌కి వచ్చి భర్త మెడలో పూలమాల వేసి పదివేల మంది కార్యకర్తలతో వెళ్లి రైలింజన్‌పై స్వరాజ్య జెండా ఎగురవేశారు. వేశ్యావృత్తిని విడనాడి స్వకులోద్ధరణకు కంకణం కట్టుకున్న యామినీ పూర్ణతిలకం లక్ష్మీబాయమ్మకు అండగా నిలిచి గుంటూరు బంద్‌కు, వారం రోజుల హర్తాళ్‌కు పిలుపునిచ్చారు. ఉన్నవ, మాడభూషిలను రాయవెల్లూరు జైలుకు తరలించారు. సోమరిగా ఉండడమనేది ఉన్నవకు కానీ పని. ఒక నవల రాసుకుంటానని జైలు సూపరింటెండెంట్ మేజర్ ఆండర్ సన్‌ను అనుమతి అడిగాడు. అయన అట్లానే అన్నాడు కానీ ఓ షరతు పెట్టాడు. రాసింది పరిశీలించడం మంచిది' అని రాసాడు. కాబట్టి ఈ నవలను నిషేధించడానికే పూనుకున్నారు. ఈలోగా 12-04-1923న స్పెషల్ బ్రాంచికి రిపోర్ట్ పంపారు. 'ఉన్నవ జైల్లో నవల రాస్తూ ఉంటే ఆయన మిత్రుడు నరసింహాచార్యులు మరో శుభ్రమయిన ప్రతిని తయారుచేసి రహస్యంగా బయటకు పంపాడనీ, 'ఆంధ్ర పరిషత్' ఆ నవలను ప్రచురించిందనీ' ఆ నివేదిక సారాంశం. దానితో 1923 మేలో మాలపల్లి నవలను నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

'నిన్నటి గజెటు నందు మాలపల్లి అను గ్రంథమును గురించిన ప్రభుత్వము వారి నిషేధపుటుత్తర్వును చూడగానే నా హృదయము నీరైపోయినది' అని ఆంధ్రపత్రికకు (మే, 26, 1923)

# ...ప్పించుకున్న 'మాలపల్లి'






**కాశింశెట్టి సత్యనారాయణ**

విశ్రాంత ఆచార్యుడు


ముందుగా చూపించాలి, అభ్యంతరకర విషయాలు ఏమీ లేకపోతే సరి, ఉంటే మాత్రం సెన్సార్ చేయనిదే వ్రాతప్రతిని తిరిగి ఇవ్వం అన్నాడు. ఒప్పుకున్నారు ఉన్నవ.

8 ఎక్సరసైజ్ పుస్తకాలయ్యాయి. 609 పేజీలు సాగింది. ఏప్రిల్ 9, 1922న మాలపల్లి వ్రాతప్రతి సిద్ధమయింది. జైలు అధికారులు ఉన్నవను జూలై 21, 1922న విడుదల చేసి, వ్రాతప్రతిని తీసుకున్నారు. ఎందరో అధికారుల దగ్గరకు తిరిగి, చివరికి మద్రాను ప్రభుత్వానికి తెలుగు అనువాదకునిగా పనిచేసిన బి. సోమసుంద్రరావు దగ్గరకు వచ్చింది. 609 పేజీలు జాగ్రత్తగా చదివి రచయితపై 'రాజద్రోహ' నేరారోపణకు వీలు కల్గిస్తూ ఒక నివేదిక రాశాడాయన. ప్రభుత్వంలోని వివిధ శాఖలను అదేపనిగా అడుగడుగునా దుయ్యబట్టాడనీ, సహాయ నిరాకరణ తత్త్వాన్ని అతిశయంగా ప్రబోధించాడనీ, ప్రభుత్వం పట్ల విద్వేషాన్ని పురికొల్పే విధంగా రాసాడనీ ఆరోపిస్తూ జనవరి 8, 1923న రిపోర్టును పంపాడు. రిపోర్ట్ చదివిన చీఫ్ సెక్రెటరీ ఉగ్రుడయ్యాడు. ఇంకెందుకు ఆలోచన? అగ్గిపుల్ల వేసి తగులబెట్టి పారేస్తే సరిపోతుందిగా – అని రాసి గవర్నర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు పంపాడు. ఆయన కూడా "I Agree" అని రాసాడు. కానీ మూడవ సభ్యుడు 'వ్రాతప్రతిని నాశనం చేయడానికి మనకేం అధికారముంటుంది? అది అతని (రచయిత) ఆస్తి. ఆయన నవలను అచ్చు వేసుకున్నప్పుడు చూసుకొనవచ్చును. నవలకు అగ్గిపుల్ల గీసి పెట్టాలంటే మాత్రం ముందుగా అన్నీ క్షుణ్ణంగా

పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి లేఖ రాసారు. పాలకవర్గంతో సన్నిహితుడుగా ఉంటూనే 'మాలపల్లి'పై నిషేధాన్ని ఎత్తివేయాలని కట్టమంచి రామలింగారెడ్డి, సి. పి. రామస్వామి అయ్యర్‌కు లేఖ రాసారు. నిషేధాన్ని తొలగించాలని అభ్యర్థిస్తూ 'పంచాంగాలు పోతే నక్షత్రాలు పోతాయా?' అని ప్రశ్నించారు. పుస్తకాలు నిషేధించినంత మాత్రాన నేడు సమాజంలో నెలకొన్న వాస్తవాలను ఎవరు కాదనగలరు? అయినా ఈ నవల రాజకీయంగా బాంబుషెల్ కాదనీ, పుస్తకాలవల్ల విప్లవాలేవీ రావనీ, ఇండియాలో వీటి మూలంగా విప్లవం వచ్చే అవకాశం మరీ తక్కువనీ రాసాడు.

మార్చి 30,1926న శాసనమండలిలో అయ్యదేవర కాళేశ్వరరావు 'మాలపల్లి' విషయమై వేసిన ప్రశ్నకు రామస్వామి అయ్యర్ సమాధానం చెప్పుకోవాల్సి వచ్చింది. రాజద్రోహం నేరం కిందకు వచ్చే భాగాలున్నాయని నవలను నిషేధించమన్నప్పుడు, 'ఆ నేరం క్రింద ప్రభుత్వం రచయితను ఎందుకు ప్రాసిక్యూట్ చేయలేదు. దమ్ముంటే రచయితను ప్రాసిక్యూట్ చేయాల'ని సత్యమూర్తి అడిగారు. ఆఖర్లో అయ్యదేవర రాజీ మార్గాన్ని సూచించాడు. ప్రభుత్వ అడ్వొకేటు జనరల్‌ను రచయిత కలుసుకొని అభ్యంతర భాగాలను గూర్చిన వ్యవహారాన్ని సెటిల్ చేసుకోవడానికి ప్రభుత్వం అంగీకరిస్తుందా? అని అడిగారు. ప్రభుత్వం కోరుకున్నది కూడా ఇదేనని సి. పి. రామస్వామి అయ్యర్ సమాధానం చెప్పాడు.

అక్టోబర్ 6,1927న రచయిత చీఫ్ సెక్రటరీని కలుసుకోగా 18-01-28న ప్రభుత్వం నవలలోని ఆరు భాగాలను అభ్యంతరకరమైనవిగా ఉన్నవకు లిఖిత పూర్వకంగా తెలియజేసింది.

1. 'మహమ్మదీయ ప్రభువులు దుండగులై కొన్ని శిల్పాలను పాడుచేశారని దూషిస్తాం గానీ ఆంగ్ల ప్రభువులు కమల కాసారంలో పద్మ కాసారముల వలె ప్రతీ గ్రామమందు.'
2. శవం కనపడగానే పోలీసు గ్రద్దలు వాల్తాయి.
3. ముందు నాలుగు వందలూ (లంచం) ఇట్లా తీసుకో. ఇది డిప్యూటీ సూపరింటెండెంట్ అయ్యవారిది, ఇది ఇన్స్పెక్టర్‌దీ, ఇది సిబ్బందిదీ, ఇది గ్రామస్థులదీ తీసుకొండయ్య.
4. జగ్గడి బుర్రకథా గేయం పూర్తిగా తొలగించాలి.
5. ప్రభుత్వ పద్ధతి ఏది చూచినా మేడిపండు వ్యవహారంగా వుంది. దీనిని సవరించి పోయడమే తప్పు. కరిగి పొయ్యవలసిందే తప్ప మాట్లు వేసి ప్రయోజనము లేదు.
6. 'రాజ్యాలు, మండలాలు, పట్టణాలు వాండ్ల పరమయినవి. పెద్ద దొంగా చిన్న దొంగా అనే భేదంతో అందరూ దొంగలే. సంఘం యొక్క ఆస్తి అంత అపహరించి శాశ్వతంగా వంశపారం పర్యంగా నిలుపుకోవడాని కనుకూలమయిన చట్టాలు గల్పించుకున్నారు'. వీటికి 'ఉన్నవ' సమాధానం చెప్పుకున్నారు. చివరికి జులై 14, 1937న రాజాజీ మంత్రివర్గం ఏర్పడింది. ఆ తరువాత 14 రోజుల్లోనే మాలపల్లి పై నిషేధాన్ని తొలగించిపారవేస్తూ రాజాజీ ఆర్డరు వేశారు. అలా మాలపల్లి నవల చట్టబద్ధంగా వెలుగు చూసింది. ★

**గాంధీజీ ఉప్పు సత్యాగ్రహ నినాదం జనాదరణ పొందడానికి కారణం దాంట్లో ఉన్న నిరాడంబరత్వమే. ప్రతి ఒక్కరు వినియోగించే ఒక ఆహార పదార్థం మీద విధించిన పన్నును చూపి అందరిని మేల్కొలిపారు. ఉప్పు పన్ను భారం పడేది సామాన్యుల మీదే. సముద్రతీరం లేకపోవడం వల్ల మధ్య పరగణాలు, బెరార్‌లలో ఉప్పు చట్ట అతిక్రమణ వీలుపడలేదు. దీనితో ఇతర శాసనోల్లంఘన కార్యక్రమాలు చేపట్టారు. బెరార్‌లోని పూసద్ (యావత్‌మాల్ జిల్లా)లో జులై 10, 1930న అటవీ సత్యాగ్రహం ప్రారంభమైంది. 1928లో వార్ధా దగ్గరి హింగన్‌ఘాట్ రైల్వే స్టేషన్‌లో ప్రభుత్వ ధనాన్ని లూటీ చేసే ప్రయత్నం జరిగింది. అప్పుడు ఉపయోగించిన పిస్టల్‌లు ఆర్ఎస్ఎస్. వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ ఉద్యమ సహచరుడిది. దీనితో హెడ్గేవార్ మీద అప్పటి నుండి బ్రిటీష్ నిఘా ఉంచారు. అయినా హెడ్గేవార్, ఆయన కుడిభుజం అప్పాజీ జోషి అటవీ సత్యాగ్రహంలో పాల్గొనాలనే నిర్ణయించుకున్నారు. స్వయంసేవకులు తన ఆదేశాల కోసం వేచి చూడకుండా జాతీయోద్యమంలో పాల్గొంటారనే నమ్మకం హెడ్గేవార్‌కు ఉంది. స్వయంసేవకులు సంఘ్ అనే సంస్థ ప్రత్యేక గుర్తింపును చూపించ కుండా, సాధారణ హిందువులుగా తమ బాధ్యత నిర్వహించాలని డాక్టర్‌జీ ఆశించేవారు. ముందు చెప్పినట్టు హిందూ సమాజం వేరు, సంఘ్ వేరు అనే భావన సరికాదన్నదే ఆయన అభిప్రాయం.**



# సర్‌సంఘచాలక్ బాధ్యత

జూన్ 20, 1930న స్వయంసేవకులను ఉద్దేశించి హెడ్గేవారు ఇలా అన్నారు: 'నేటి ఉద్యమ నేపథ్యంలో సంఘ సిద్ధాంతాల గురించి తరుచుగా అడుగుతున్నారు. ప్రస్తుతానికి సంఘ్ ఒక సంస్థగా ఈ ఉద్యమంలో పాల్గొనాలనే విషయం గురించి ఇంకా నిర్ణయించలేదు. ఎవరికైనా వ్యక్తిగతంగా పాల్గొనాలని ఉంటే వారు తమ సంఘచాలక్ అనుమతితో పాల్గొనవచ్చు. కానీ అతను సంఘ ఆదర్శాలకు అనుగుణంగానే ఆ ఉద్యమంలోనూ పనిచేయాలి, పాల్గొనాలి (Sangh Archies, Hedgewar Papers, Dr. Hedgewar lectures cleaned /1930, /july 1930).

సంఘ స్వయంసేవకులు శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొనవచ్చునని హెడ్గేవార్ లాంఛనంగా ప్రకటించడానికి ముందే స్వయం సేవకులకు స్వేచ్ఛ ఇచ్చారని అనిపిస్తుంది. దీనికి కారణం హెడ్గేవార్ ఈ ఉద్యమంలో పాల్గొనాలని నిర్ణయించుకోక ముందే, చాలామంది ప్రముఖ స్వయం సేవకులు అప్పటికే పాల్గొన్నారు. ఈ ఉద్యమం తాత్కాలికంగా ప్రాంతీయ, జిల్లా స్థాయిలలో కాంగ్రెస్ ఏర్పాటుచేసిన వార్ కౌన్సిల్ నేతృత్వంలో జరిగేది.

చందా (చంద్రపూర్)లో ఆగస్ట్ 20, 1923న సంఘ్‌ను స్థాపించినా కూడా హెడ్గేవార్ డిసెంబర్ 1928లో అక్కడికి వచ్చాకే అది పురోగతి సాధించింది. ఊపు వచ్చింది. చందాలో వార్ కౌన్సిల్ ఏర్పాటు గురించి జరిగిన సమావేశంలో ప్రముఖ స్వయంసేవకుడు అబాసాహెబ్ చంద్కే, నారాయణ పాండురంగ అలియాస్ నానాసాహెబ్ భాగవత్ (ప్రస్తుత సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ జీ భాగవత్ ఆయన మనుమడే), రఘునాథ్ సీతారామ్ అలియాస్ దాదాసాహెబ్ దేవైకర్ (చందా సంఘచాలక్), రామచంద్ర రాజేశ్వర్ అలియాస్ తాత్యాజీ దేశ్‌ముఖ్ (చందా సంఘ్ కార్యదర్శి) పాల్గొన్నారు. తరువాత కాలంలో చందా వార్ కౌన్సిల్ మొదటి అధ్యక్షుడు రాజేశ్వర్ గోవింద్ అలియాస్ బాలాజీ మొకడే హెడ్గేవార్ నాయకత్వంలోని సత్యాగ్రహుల జట్టులో సభ్యుడయ్యారు కూడా. (K.K.choudhary, source Matearal for a History of Freedom Movement, Civil Disobedience Movement, April, September 1930, vol.XI, G, Department, Government of Maharashtra, Bombay, 1990, p.901) జూన్ 30, 1930న చందాలో మాధ్వ శ్రీహరి అలియాస్ బాపూజీ ఆప్టే ఏర్పాటు చేసిన సమావేశాన్ని స్వయంసేవకులు దేశ్‌ముఖ్, అన్నాజి సిరాస్, చండ్కె ముందుండి నిర్వహించారు (Chaudhary, p.903).

మే 1, 1930న నాగపూర్ జరిగిన సమావేశంలో డా. మూంజే నిషేధాన్ని ఉల్లంఘించి దహిహండా (అకోలా జిల్లా) నుండి తీసుకొచ్చిన ఉప్పు నీటి నుంచి ఉప్పు తయారుచేశారు. వి.డి.సావర్కర్ నిషిద్ధ గ్రంథం The Indian war of Independence, 1857 నుండి ఒక భాగం చదివారు. ఆ తరువాత సంఘ్ సర్‌కార్యవాహ గోపాల్ ముకుంద్ అలియాస్ బాలాజీ హుద్దార్ ఉప్పు తయారు చేసి, సావర్కర్ రచన 'లైఫ్ ఆఫ్ మేజిని' ముందుమాటలోని కొంత భాగాన్ని చదివారు. ఈ పుస్తకం పరాయి ప్రభుత్వాన్ని కూల్చడం గురించి చర్చిస్తుంది (Chaudhary, p.903). తరువాత మే, 21, 1930న జరిగిన సమావేశంలో, 700మంది పాల్గొనగా, అర్వి (వార్ధా జిల్లా)కి చెందిన ప్రముఖ సంఘ స్వయంసేవకుడు డా॥మోరేశ్వర్ గణేశ్ ఆప్టే నిషేధిత సాహిత్యం చదివారు (Chaudhary, p.948). తరువాత కాల్‌లో ఆప్టే అర్వి సంఘచాలక్ అయ్యారు. నాగపూర్ జిల్లా సంఘచాలక్ అప్పాసాహెబ్ హల్దే మధ్య పరగణాల వార్ కౌన్సిల్‌కు పన్నెండవ అధ్యక్షుడయ్యాడు. ఆయన మార్చి 6,1931న కారాగారం నుండి విడుదలయ్యారు (Maharashtra, March 12, 1931). ఆయన కాంగ్రెస్‌లో ఒక నియంత, జిల్లా సంఘచాలక్. దీంతో కొంతమంది కాంగ్రెస్‌వారు గాంధీజీ చందాకు వచ్చినప్పుడు, హల్దే సమక్షంలోనే ఆయన మీద ఫిర్యాదు చేశారు. దానికి గాంధీజీ ఇలా అన్నారు "నాకు సంఘ్ గురించి తెలుసు, కాబట్టి డా॥ హెడ్గేవార్, హల్దే గురించి ఇలా ఆలోచించకండి". ఈ జ్ఞాపకాన్ని హల్దే స్వయంగా హెడ్గేవార్ చరిత్రకారుడు పాల్కర్‌కు చెప్పారు (Sangh Archies, Hedgewar Papers, Nana Palkar / Hedgewar notes 2.2.133). సావనర్ పట్టణ

అటవీ సత్యాగ్రహంలో భాగంగా అనధికారికంగా గడ్డి కోసినందుకు ఎం.ఎస్. ఆనీకు జులై 10న ఐపీసీ సెక్షన్ 379 కింద ఆరునెలల సాధారణ కారాగార శిక్ష వేశారు. ఆయన 11 మందితో కూడిన మొదటి సత్యాగ్రహ బృందం నాయకుడు. డా.మూంజే రెండవ జట్టుకు నాయకుడు. ఆయనకు కూడా న్యాయస్థానం అదే సెక్షన్ కింద సెషన్ పూర్తి అయ్యేవరకు శిక్ష, లేదా రూ.5 జరిమానా శిక్ష విధించారు. మరుసటి రోజు స్థానిక సత్యాగ్రహ సంఘం ఆహ్వానం మేరకు మూంజే సత్యాగ్రహం పాల్గొన్నారు. దీనికి రూ.10 జరిమానా, లేదా వారం రోజులు సాధారణ కారాగార శిక్ష విధించారు

సంఘచాలక్ నారాయణ అంబోకర్ రాయపూర్ కారాగారం నుంచి నుండి మార్చి, 11,1931న విడుదలయ్యారు. వషిం పట్టణానికి చెందిన అడ్వకేట్ శంకర్ అలియాస్ అన్నా సాహెబ్ దాబిక్‌ను మార్చి 10, 1931న జైలు నుండి విడుదలయ్యాక సన్మానించారు (Maharashtra, March 15, 1931). ఆగస్ట్ 1931లో ఆయన వషింకు సంఘచాలక్‌గా నియమితులయ్యారు.

**సంస్థలో మార్పులు**

తాను సత్యాగ్రహంలో పాల్గొనేందుకు హెడ్గేవార్ సంఘ్ వ్యవస్థలో కొన్ని మార్పులు చేశారు. జూన్ 20,1930న సంఘ్ స్వయంసేవకులకు ఉద్దేశించి రాసిన ఉత్తరంలో ఆయన ఇలా పేర్కొన్నారు. ప్రముఖ నాగపూర్ సంఘ స్వయంసేవకులు, వార్ధా జిల్లా అధికారి అప్పాజి జోషి, పారమార్థ్ దేవ్, చందాలోని ప్రముఖ సంఘ్ సేవకులు వెకండే, కరోజే, పాలేవార్, అర్వి సంఘచాలక్ నానాజీ దేశ్‌పాండే, సలోద్ ఫకీర్ సంఘచాలక్ త్రైయంబక్‌రావ్ దేశ్‌పాండేతో కలసి నేను బేరాల్‌లోని పూసద్‌లో జరుగుతున్న సత్యాగ్రహంలో పాల్గొనబోతున్నాను. కాబట్టి ఆర్‌ఎస్ఎస్ కార్యనిర్వహణని నాగపూర్ ప్రముఖులు డా॥ పరంజపేకు అప్పగించడం జరిగింది. ఇక నుండి ఆయన సంఘచాలక్‌గా ఉంటారు. నాగపూర్ సంఘ్‌తో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ క్రింది

# కు విరామం

చిరునామాతో జరగాలి. V.V.kelar, 8A, LLb, Advocate High court, It wad Darwaja, Nagpur city, వార్ధాకు చెందిన అడ్వకేట్ మనోహర్ పంత్ దేశ్‌పాండేను అప్పాజీ జోషికి బదులుగా వార్ధా జిల్లా అధికారిగా నియమించారు. ఉత్తర ప్రత్యుత్తరాలు చిరునామా Deshpande, teacher, New English School, Wardha."

ఎంతో ముందు జాగ్రత్త ఉన్న డాక్టర్ హెడ్గేవార్ ఆ ఉత్తరాన్ని ఇంకా ఇలా కొనసాగించారు. 'ఈ చిరునామాలను రాస్తున్నప్పుడు పేర్లు మాత్రమే రాయాలి. పదవుల పేర్లు, ఉదాహరణకు సంఘచాలక్, కార్యవాహ లాంటివి రాయకూడదు.' తరువాత ఇలా రాశారు. 'ఈ సంవత్సరపు వేసవి తరగతులు బాగా జరిగాయి. చాలామంది హాజరయ్యారు. శారీరక, కవాతు తరగతులకి తోడు మేథోతరగతులు కూడా జరిగాయి.' మనం గమనించాల్సిన విషయమేమిటంటే, హెడ్గేవార్ ఉత్తరంలో ఎక్కడా తను లేకుంటే సంఘ్ ఏమవుతుందో అనే కంగారు కనిపించదు. ఈ ఒక్క విషయం ద్వారా ఆయనకు తన సహచరుల పట్ల, తను రూపొందించిన సిద్ధాంతాల పట్ల ఉన్న విశ్వాసం కనబడుతుంది.

**సర్‌సంఘచాలక్ పదవి వీడడం**

అటవీ సత్యాగ్రహంలో భాగంగా అనధికారికంగా గడ్డి కోసినందుకు ఎం.ఎస్. ఆనీకు జులై 10న ఐపీసీ సెక్షన్ 379 కింద ఆరునెలల సాధారణ కారాగార శిక్ష వేశారు. ఆయన 11 మందితో కూడిన మొదటి సత్యాగ్రహ బృందం నాయకుడు. డా.మూంజే రెండవ జట్టుకు నాయకుడు. ఆయనకు కూడా న్యాయస్థానం అదే సెక్షన్ కింద సెషన్ పూర్తి అయ్యేవరకు శిక్ష, లేదా రూ.5 జరిమానా శిక్ష విధించారు. మరుసటి రోజు స్థానిక సత్యాగ్రహ సంఘం ఆహ్వానం మేరకు మూంజే సత్యాగ్రహం పాల్గొన్నారు. దీనికి రూ.10 జరిమానా, లేదా వారం రోజులు సాధారణ కారాగార శిక్ష విధించారు (Chaudhary, P.980). డాక్టర్ మూంజేను సంఘ్ గురు పూజోత్సవానికి అధ్యక్షత వహింపజేసి, సాదరంగా వీడ్కోలు పలకాలని డాక్టర్ హెడ్గేవార్ అనుకున్నారు. కానీ మూంజే అరెస్టుతో డా॥ లక్ష్మణ్ వాసుదేవ్ అలియాస్ దాదాసాహెబ్ పరంజపేను ఆ కార్యక్రమానికి అధ్యక్షత వహించమని కోరారు. సంఘ్ గురుపూజ ఉత్సవం జులై 12, 1930న డా॥ పరంజపే అధ్యక్షతన జరిగింది. ప్రార్థన తరువాత డా॥పరంజపే ఇలా అన్నారు. "డా.హెడ్గేవార్ కొంతమంది సహచరులతో కలిసి అటవీ సత్యాగ్రహంలో పాల్గొనబోతున్నారు. దాంట్లో ఎవరైనా పాల్గొనాలంటే పాల్గొనవచ్చు. మిగతావారు ఈ యువ సంస్థ కార్యక్రమాలలో సహకరించవచ్చు. నేటి ఈ ఉద్యమం దేశాన్ని ముందుకు తీసుకువెళుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ స్వాతంత్ర్య సముపార్జనలో ఇది తొలి అడుగు మాత్రమే. నిజమైన కార్యక్రమం ఏదంటే, ఎవరైతే తమ జీవితాన్ని దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగం చేయదలిచారో వారిని ఒకచోటికి చేర్చడం, సంఘటితం చేయడంలో ఉంది." తరువాత హెడ్గేవార్ ఇలా అన్నారు, "ధన్యవాదాలు చెప్పి కూర్చున్న మరుక్షణం నుండి నేను సర్ సంఘచాలక్ బాధ్యతలో ఉండను. డా॥ పరంజపే ఆ బాధ్యత తన భుజస్కందాలపై వేసుకోవడానికి అంగీకరించారు. అందుకు వారికి మనస్ఫూర్తిగా సంఘ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ ఉద్యమంలో హోపాల్గొంటున్న మనమందరం మన వ్యక్తిగత దాలోనే పాల్గొంటున్నాం. సంఘ్ కార్యక్రమాలూ, ఆశయాలూ, ఆలోచనలలో ఎలాంటి మార్పూ లేదు. వాటి పట్ల మా నమ్మకం యథాతథంగానే ఉంది. కొంచం కూడా తగ్గలేదు.

దేశ స్వాతంత్ర్యం కోసం పని చేస్తున్న ప్రతి సంస్థకు దేశంలో జరుగుతున్న ఇతర ఉద్యమాల గురించి కూడా తెలుసుకోవలసిన బాధ్యత ఉంది. తెలుసుకున్న దానిని తమ కార్యక్రమానికి ఉపయోగించే బాధ్యత కూడా ఉంది. ఇప్పటిదాకా ఈ ఉద్యమంలో పాల్గొంటున్న సంఘ వ్యక్తులు, ఇకపై నుండి ఉద్యమంలో ప్రవేశిస్తున్న మేము అదే లక్ష్యంతో ఉన్నాం. జైలుకు వెళ్లడం ఈ కాలంలో దేశభక్తికి చిహ్నంలా మారింది. కానీ, రెండు సంవత్సరాలు జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నవారు, తమ భార్యా, పిల్లలు, ఇల్లు, పని నుండి సెలవు తీసుకొని స్వాతంత్ర్యం కోసం పనిచేసే ఒక సంస్థకు పనిచేయమంటే ఎందుకు సిద్ధంగా లేరు. ఇలా ఎందుకు జరుగుతున్నది? ఎందుకంటే ప్రజలు ఒకటి అర్థం చేసుకోవడానికి సిద్ధంగా లేరు. దేశానికి స్వాతంత్ర్య సాధనకు ఆరునెలలో లేదా సంవత్సరమో పని చేయడంతోనే అయిపోదు, అది ఒక సంస్థ నిరంతరాయంగా సంవత్సరం తరువాత సంవత్సరం చేస్తే వస్తుంది. ఎప్పుడైతే ఈ సంచలనాత్మకత నిండిన దేశభక్తిని, దేశం కోసం ప్రాణత్యాగానికయినా సిద్ధం అనే ఈ ధోరణిని విడిచిపెట్టి, దేశంకోసం జీవిస్తూ, స్వాతంత్ర్యం కోసం కృషిచేస్తున్న సంస్థలో పనిచేస్తే తప్ప దేశానికి మంచిరోజులు రావు. సంఘ్ లక్ష్యం యువకులలో ఈ వైఖరిని తేవడం, వారిని సంఘటితం చేయడం" (Sangh archives, Hedgewar Papers Nana Palkar/ Hedgewar notes, 33-131,132).

సంఘ్‌లో అవసరమైన మార్పులు చేసి, తన లక్ష్యాన్ని తెలియజేసి హెడ్గేవార్ సత్యాగ్రహంలో పాల్గొనేందుకు పూర్తిగా సంసిద్ధులయ్యారు. ★

ఇండియా, ఇజ్రాయిల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్) దేశాధినేతల తొలి 'ఐ2యూ2' సమావేశం ఈ జూలై 14న వర్చువల్‌గా జరిగింది. నిజానికి 2021లో ఈ నాలుగు దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో 'అంతర్జాతీయ ఆర్థిక సహకార సంఘం' పేరుతో ఈ గ్రూపు ఏర్పాటైంది. ఆమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇటీవల ఇజ్రాయిల్, సౌదీ అరేబియా, యూఏఈల్లో పర్యటించిన తర్వాత ఐ2యూ2 వర్చువల్ సదస్సు జరగడానికి మార్గం సుగమమైంది. అంతేకాదు, ఆగస్టు 13, 2020న విడుదల చేసిన ఇజ్రాయిల్, యూఏఈ, అమెరికాల ఉమ్మడి ప్రకటన (ఇజ్రాయిల్–యూఏఈ, ఇజ్రాయిల్–బహ్రైన్‌ల మధ్య కుదిరిన స్నేహ ఒప్పందాలు. వీటినే అబ్రహం ఒప్పందాలు (Abraham Accords) అంటారు. ఇవి అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమక్షంలో జరిగాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి ప్రకటన వెలువడింది) రాజకీయ ప్రాధాన్యాన్ని ఈ ఐ2యూ2 సదస్సు మరింతగా నొక్కి చెప్పింది. కాగా ఈ నాలుగు దేశాధినేతలు నీరు, ఇంధనం, రవాణా, అంతరిక్షం, ఆరోగ్యం, ఆహార భద్రత అనే అంశాలపై ప్రధానంగా దృష్టిసారించారు. ఐ2యూ2 ఉమ్మడి ప్రకటన కూడా వీటికే ప్రాధాన్యమివ్వడం గమనార్హం. ఈ మొట్టమొదటి ఐ2యూ2 సదస్సు వల్ల ఆర్థికంగా లాభపడింది కూడా భారతే!



# ఐ2యూ2తో భారత్‌కు ఆర్థిక ప్రయోజనం

ఇది కేవలం ఆర్థిక పరమైనదని; పెట్టుబడులకు అనువైన భౌగోళిక, ఆర్థిక స్థితిగతులైన మౌలిక సదుపాయాలు కల్పించడం, వాతావరణ మార్పులను అడ్డుకోవడం, ప్రజారోగ్య వ్యవస్థ వంటి వాటిపై చర్చించడానికి ఉద్దేశించిందని ఐ2యూ2 సదస్సు మొట్టమొదట స్పష్టతనిచ్చింది. ఇజ్రాయిల్, యూఏఈ, యూఎస్‌ల నుంచి పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించడానికి, ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన వనరులకు కేంద్రంగా, సరఫరా శృంఖలాల యంత్రాంగానికి ప్రత్యామ్నాయంగా రూపొందడానికి, లుక్ వెస్ట్ పాలసీలో భాగంగా పశ్చిమాసియాతో ప్రయోజనాత్మక ఆర్థిక సంబంధాలు నెలకొల్పుకోవడానికి ఈ సదస్సు భారత్‌కు ఎంతో ఉపకరించింది.

ఈ విధంగా ఇజ్రాయిల్, యూఏఈ, అమెరికాలతో సంబంధాలను మరింత పెంచుకోవడం భారత్ పరంగా ఒక గేమ్‌ఛేంచర్ వంటిదే. గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఫుడ్ పార్క్‌ల కోసం రెండు బిలియన్ యూఎస్ డాలర్ల పెట్టుబడి పెట్టడానికి ఈ సందర్భంగా యూఏఈ ముందుకొచ్చింది. యూఏఈ –ఇజ్రాయిల్, ప్రైవేటు రంగం సహకారంతో దేశంలో ఆహార ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ఈ పెట్టుబడులు ఉపకరిస్తాయి. ఈ ఫుడ్‌పార్క్‌లు దేశంలో ఆహార వృథాను కూడా సమర్థవంతంగా అరికట్టడమే కాకుండా, గల్ఫ్ ప్రాంతంలో ఆహార భద్రతకు దోహదం చేస్తాయి. ఇదే సమయంలో భారత్ తన ఇంధన అవసరాలపై గల్ఫ్ దేశాలతో చర్చించే వెసులుబాటు కలుగుతుంది.

ఐ2యూ2 గ్రూపింగ్ వల్ల వ్యర్థాల నిర్వహణ సమస్యకు పరిష్కారంగా ప్రైవేటు సాంకేతిక నైపుణ్యాల వినియోగం, ప్రైవేటు పెట్టుబడులకు ప్రోత్సాహం కూడా లభిస్తుంది. ఇదే సమయంలో స్టార్టప్ లింకేజీలు పెరగడం వల్ల, దేశంలో స్టార్టప్‌లపై పెట్టుబడులు పెరిగి ఈ పరిశ్రమ ఊపందుకుంటుంది. క్లీన్ ఎనర్జీ పరంగా కూడా దేశానికి ప్రయోజనం చేకూరుతుంది. ముఖ్యంగా పవన, సౌర విద్యుత్‌లను ఏకీకృతం చేయడం ద్వారా హైబ్రిడ్ పునరుత్పాదక ఇంధన సదుపాయాల కల్పనకు వీలుకలిగి పారిస్ ఒప్పందం మేరకు భారత్ కర్బన ఇంధన వనరులపై అధికంగా ఆధారపడటం గణనీయంగా తగ్గి

పోతుంది. ఈ విధంగా క్లీన్ ఎనర్జీ రంగంలో యూఏఈ, ఇజ్రాయిల్ దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం ద్వారా భారత్ పశ్చిమాసియాలో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోగలదు.



**1990 నుంచే పశ్చిమాసియాతో సంబంధాలు**

నిజానికి 1990 ప్రాంతం నుంచే భారత్‌కు పశ్చిమాసియాతో ఇంధన పరంగా మంచి సంబంధాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం భారత్ తన లుక్ వెస్ట్ పాలసీలో భాగంగా, గల్ఫ్‌దేశాల అంతర్గత రాజకీయ వ్యవహారాలతో సంబంధం లేకుండా తన జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా అడుగులు ముందుకేస్తోంది. భారత్-యూఏఈల మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) వల్ల ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం మరింత బలోపేతం కానుంది. తన రక్షణావసరాల రీత్యా ఇజ్రాయిల్‌తో భారత్‌కు బలీయమైన చారిత్రక సంబంధాలున్నాయి. ఇక పశ్చిమాసియాలో మరో ప్రధాన దేశం సౌదీ అరేబియా రిలయన్స్‌కు సంబంధించిన జియో ప్లాట్‌ఫామ్‌పై పెద్దమొత్తంలో పెట్టుబడులు పెడుతోంది. ఇటీవలి కాలంలో యూఏఈ, సౌదీ అరేబియాలతో భారత్ సంబంధాల గణనీయ వృద్ధి మన విదేశాంగ విధాన సాఫల్యతకు గొప్ప ఉదాహరణ. లుక్ వెస్ట్ పాలసీలో భాగంగా అరబ్ దేశాలు-ఇజ్రాయిల్, సౌదీ అరేబియా-ఇరాన్‌ల మధ్య నెలకొన్న స్పర్థల్లో తల దూర్చకపోవడం వల్ల చమురు ఎగుమతి దేశాల (ఓపెక్)తో భారత్ సంబంధాలు మరింత మెరుగైన స్థితిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఐ2యూ2 వేదిక, అరబ్ ప్రపంచంతో భాగస్వామ్యాన్ని ముఖ్యంగా బహుముఖ పెట్టుబడుల రంగంలో మనదేశాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి దోహదం చేయగలదు. ఒక్కమాటలో చెప్పాలంటే పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న పరస్పర వైషమ్యాలతో పనిలేకుండా, తన పని తాను చేసుకుపోతూ భారత్ ఈ ప్రాంతంలో తన సుస్థిరతకు ఢోకా లేకుండా ముందుకు సాగుతోంది.

**వైరుధ్య పరిస్థితులతో ఇబ్బందులు**


అమెరికా ఆంక్షలు విధించినా ఇరాన్‌తో సంబంధాలను కొనసాగించడం భారత్‌కే చెల్లింది. అమెరికా ఆంక్షలు ఇరు దేశాల సంబంధాలను ఇబ్బందుల్లోకి నెట్టేసినప్పటికీ, చైనా కబంధ హస్తాల్లోకి పోతుందనుకున్న చబ్బహార్ పోర్టును తిరిగి తన ఆధీనంలోకి తెచ్చుకోవడం భారత్ దౌత్య నిపుణతకు మచ్చుతునక. ఇటీవలి కాలంలో భారత్-ఇరాన్ దేశాల మధ్య ఉన్నతస్థాయి నేతలు పరస్పరం పర్యటించడం, ఇరాన్ అణ్వాయుధాల ఉత్పత్తికి వ్యతిరేకంగా ఐఏఈఏలో పశ్చిమదేశాలు ప్రవేశపెట్టిన తీర్మానంపై ఓటింగ్‌లో పాల్గొనకపోవడం వంటివి తన చిరకాల మిత్రుడు ఇరాన్ పట్ల భారత సానుకూల వైఖరిలో ఏవిధమైన మార్పు లేదనడాన్ని స్పష్టంచేస్తున్నాయి. ఇదే సమయంలో గల్ఫ్‌లో క్రమంగా విస్తరిస్తున్న భారత రక్షణ పరిచ్ఛేదాన్ని నిశితంగా పరిశీలిస్తున్న ఇరాన్.. మన దేశానికి యూఎస్‌తో ఉన్న సన్నిహిత రక్షణ సంబంధాలు తనకు ప్రమాదం కావన్న సత్యాన్ని గుర్తించడం మరో సానుకూల పరిణామం. ఇజ్రా యిల్, ఇరాన్‌ల మధ్య బద్ధవైరం, యెమెన్ విష యంలో ఇరాన్, సౌదీ అరేబియాల విరుద్ధ వైఖరులు, మధ్యప్రాచ్యంలో ఇరాన్ నడుపుతున్న రాజకీయాలు, దాని అణు కార్యక్రమం.. ఇటువంటి వైరుధ్య పరిస్థితుల మధ్య భారత్ తన దౌత్యచాణక్యాన్ని ప్రదర్శిస్తూ అన్ని దేశాలతో సత్సంబంధాలు కొనసాగించడం విశేషం. అయితే ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య కొనసాగు తున్న 'యుద్ధం-దౌత్యం' భారత్‌కు ఇబ్బంది కలిగించే అవకాశం లేకపోలేదు. ఈ రెండు దేశాల మధ్య ఏమాత్రం ఘర్షణలు తలెత్తినా అది భారత్‌కు ఇబ్బందికరం. చబ్బహార్ పోర్ట్, ఇరాన్‌లోని వివిధ గ్యాస్, చమురు పరిశ్రమలపై మనదేశం పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టింది. ఈ రెండు దేశాల మధ్య వైరం ఇరాన్‌తో మన సంబంధాలను ఒడుదొడుకుల్లోకి నెట్టేస్తే, చబ్బహార్ పోర్టును కైవసం చేసుకోవడానికి గుంటనక్క చైనా ఎల్లప్పుడూ సిద్ధం! ఇండియా-ఇరాన్ సంబంధాలు ప్రస్తుతం కత్తిమీద సాము మాదిరిగా ఉన్నాయి. మన ప్రమేయం ఉన్నా లేకపోయినా జరిగే ఏ చిన్న పొరపాటైనా, ఇరాన్‌ను తీసుకెళ్లి చైనా ఒళ్లో కూర్చోబెట్టగలదు. ఇటీవలి కాలంలో సౌదీ అరేబియా-ఇరాన్‌ల వైఖరుల్లో తేడా కొట్టొచ్చినట్టు కనిపించడం గమనించదగ్గ పరి ణామం. ఇరాన్ అణుకార్యక్రమం సౌదీ అరేబియాకు సుతరామూ ఇష్టంలేదు. కానీ ఇరాన్, రష్యాలతో వ్యూహాత్మకంగా వ్యవహరించడానికి సౌదీ కొంత స్వేచ్ఛ కోరుకుంటోంది (ప్రస్తుతం అమెరికాకు సన్నిహిత దేశంగా ఉంది). యూఏఈ, యెమన్ దేశాలతో మన రక్షణ సంబంధాలు బలంగా ఉన్నాయి. హిందూ మహాసముద్ర పరిరక్షణకు హామీ ఇస్తున్న భారత్, ఇప్పుడు తన రక్షణ పరిధిని గల్ఫ్ ప్రాంతాలకు కూడా విస్తరించడానికి ప్రధానకారణం, ఇంధన అవసరాలతోపాటు, మానవ శక్తి వనరుల ప్రయోజనాల పరిరక్షణ. ఇదే సమయంలో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడును అడ్డుకునే విధంగానే, పశ్చిమాసియాలో చైనా ప్రాబల్యానికి అడ్డుకట్ట వేయడం కూడా భారత్ ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా చైనా ఆర్థిక నడవాలో భాగంగా, గ్వదార్ లేదా జివానిల్లో నౌకా స్థావరాలను ఏర్పాటు చేసు కోవడం పశ్చిమ హిందూ మహా సముద్రంపై పట్టు సాధించడానికి తప్ప మరోటి కాదు. పశ్చిమాసియా ప్రాంతంలో భారత్ దౌత్య పరంగా చురుగ్గా వ్యవహరించడానికి కారణమైన ఈ పరిణామాలే ఐ2యూ2 (పశ్చిమ ప్రాంత క్వాడ్) ఏర్పాటుకు

నిజానికి 1990 ప్రాంతం నుంచే భారత్‌కు పశ్చిమాసియాతో ఇంధన పరంగా మంచి సంబంధాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం భారత్ తన లుక్ వెస్ట్ పాలసీలో భాగంగా, గల్ఫ్‌దేశాల అంతర్గత రాజకీయ వ్యవహారాలతో సంబంధం లేకుండా తన జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా అడుగులు ముందుకేస్తోంది. భారత్-యూఏఈల మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) వల్ల ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం మరింత బలోపేతం కానుంది.

దోహదం చేశాయి. ప్రస్తుతం తూర్పు క్వాడ్ (ఇండియా, ఆస్ట్రేలియా, జపాన్, యూఎస్)లతో పోలిస్తే ఈ పశ్చిమ క్వాడ్ క్రియాశీలంగా ఉండటం గమనార్హం. తూర్పు క్వాడ్‌ను చైనా (రష్యా కూడా) తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కానీ పశ్చిమ క్వాడ్‌ను పెద్దగా పట్టించుకున్నట్టు లేదు. ఐ2యూ2 గ్రూపులో మన దేశ అంచనాలు వేరు. ముఖ్యంగా చైనా మనకు బద్ధ శత్రువు, కానీ దానికి సన్నిహితంగా ఉండే ఇరాన్ మనకూ మిత్రుడే! విభిన్న రాజకీయాల నేపథ్యంలో భారత్ ఐ2యూ2లో ఆర్థిక అంశాలకే అగ్రతాంబూలం ఇస్తోంది.

**ఎవరి వ్యూహాలు వారివి**

ఐ2యూ2 సదస్సు ఏర్పాటులో అమెరికా ప్రధాన లక్ష్యం గతంలో ఈ ప్రాంతంలో రాజకీయంగా అత్యంత సన్నిహితంగా ఉన్న దేశాలతో సంబంధాలను మరింతగా విస్తరించుకోవడం. ముఖ్యంగా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హయాంలో మధ్యప్రాచ్యంతో దెబ్బతిన్న సంబంధాలను మళ్లీ గాట్లో పడేయడం. దీనికి తోడు ఇజ్రాయిల్‌లోని టెలీకమ్యూనికేషన్లు, పోర్టుల పరిశ్రమలు చైనా నిర్వహణలో ఉండటాన్ని అమెరికాలోని హార్ లైనర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా ఇజ్రాయిల్‌కు చెందిన హైఫా పోర్టుకు యూఎస్‌కు చెందిన 6వ, 7వ నౌకాదళాలు వస్తుంటాయి. దీని నిర్వహణను చైనాకు అప్పగించడంపై యూఎస్‌లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ పోర్టు నిర్వహణను మన దేశానికి చెందిన ఆదానీ గ్రూప్ చేపట్టింది. ఇక భారత్ విషయానికి వస్తే, తన వ్యూహాత్మక స్వేచ్ఛ విషయంలో ఏమాత్రం రాజీపడకుండా, యూఎస్‌తో ఆసియా ఆవలి ప్రాంతాలతో తన సహకారాన్ని విస్తరించుకోవడంలో భాగంగా మధ్యప్రాచ్యంతో సంబంధాలను బలోపేతం చేసుకోవడం ప్రధాన లక్ష్యం. ఇప్పటికే భారత్ ప్రపంచ రాజకీయాల్లో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నది. మన సన్నిహిత మిత్రుడుగా ఉన్న ఇజ్రాయిల్ 'అబ్రహం ఒప్పందాలు' సక్రమంగా అమలు జరిగేలా చేయడంలో భారత్ పలుకుబడిపై విశ్వాసం వ్యక్తం చేస్తోంది. కానీ ఇజ్రాయిల్, యూఏఈలతో చైనా సంబంధాలు బలంగా ఉన్నాయి. ప్రత్యేకించి యూఎస్–చైనాల మధ్య శత్రుత్వం నెలకొన్న నేపథ్యంలో ఇజ్రాయిల్–చైనా సంబంధాల చిక్కుముడిని విప్పడం సాధ్యంకాదు. ఎందుకంటే ఆసియా, ఆఫ్రికా, యూరప్ దేశాలను కలుపుతూ చైనా నిర్మిస్తున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ)లో ఇజ్రాయిల్ రహస్య భాగస్వామిగా ఉంది. ఇక యూఏఈ ఇప్పటికే బీఆర్ఐపై సంతకాలు చేసింది. పర్యాటకం, సాంకేతికత పరంగా బీఆర్ఐ ఇజ్రాయిల్, యూఏఈ దేశాలకు ఎంతో ప్రయోజనకరం. ఇదే సమయంలో చైనాకు సాంకేతికపరమైన దిగుమతులను నిషేధిస్తూ అమెరికా తీసుకున్న చర్య ఇజ్రాయిల్‌కు అనుకోని వరంగా మారింది. తమ ప్రయోజనాలను బేరీజు వేసుకున్న ఇజ్రాయిల్, యూఏఈలు చైనాకు మిత్రులుగా కొనసాగడానికే ప్రాధాన్యమివ్వడం ఐ2యూ2 అసలు లక్ష్యానికే మింగుడు పడని సమస్య. పరిస్థితులను తనకు అనుకూలంగా మలచుకునే దిశగా చైనా పావులు కదుపుతూ, అబ్రహం ఒప్పందాలను (Abraham Accords) ఇప్పుడు స్వాగతించడం, యూఎస్ దాని సహచర దేశాలకు గిట్టడంలేదు. ఐ2యూ2 సదస్సును చైనా పెద్దగా వ్యతిరేకించకపోవడానికి బహుశా ఇదే కారణమై ఉండవచ్చు. అంతేకాదు ఐ2యూ2 దేశాలు తనకు వ్యతిరేకంగా మూకుమ్మడి విమర్శల దాడికి దిగకుండా బలహీనపరచడం కూడా చైనా 'అబ్రహం ఒప్పందాల'ను సమర్థించడం వెనుక దాగిన అసలు రహస్యం కావచ్చు! తాను వ్యక్తంచేస్తున్న అభ్యంతరాలకు, లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఇజ్రాయిల్ నుంచి స్పష్టమైన సమాధానాలు రాకపోవడం అమెరికాను ఆందోళనకు గురిచేస్తున్నది. ఈ పరిణామాల నేపథ్యంలో ఈ ప్రాంతంలో చైనా సామాజిక–ఆర్థిక విస్తరణాభిలాషలో పావులుగా మారకుండా ఇజ్రాయిల్, యూఏఈలను నివారించాల్సిన అవసరం యూఎస్, ఇండియాలకు ఎంతైనా ఉంది. అయితే ఇది వాణిజ్య సంబంధాలకు మించి జరగాల్సిన ప్రయత్నం. మరి ఇందుకోసం భవిష్యత్తులో ఐ2యూ2 వేదికను భారత్, యూఎస్‌లు ఎంతవరకు ఉపయోగించుకుంటాయో వేచిచూడాలి. ★









భారత యువ అథ్లెట్ నీరజ్ చోప్రా మరో చరిత్ర సృష్టించాడు. గత ఏడాది టోక్యో వేదికగా ముగిసిన ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడం ద్వారా సంచలనం సృష్టించిన ఈ జులపాల కుర్రాడు కొద్ది మాసాల వ్యవధిలోనే అమెరికాలోని ఒరెగాన్‌లో 2022-ప్రపంచ అథ్లెటిక్స్ పోటీలలో రజత పతకంతో సరికొత్త చరిత్ర సృష్టించి 19 సంవత్సరాల విరామం తర్వాత ప్రపంచ అథ్లెటిక్స్‌లో పతకం సాధించడం ద్వారా భారత జాతికే గర్వకారణంగా నిలిచాడు.



# ప్రపంచ పోటీల్లో రజత 'నీరజం'

భారత అథ్లెటిక్స్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన అథ్లెట్‌గా, 24 ఏళ్ల చిరుప్రాయంలోనే 2016 జూనియర్ ప్రపంచ అథ్లెటిక్స్ మీట్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్, టోక్యో ఒలింపిక్స్ లాంటి ప్రపంచ మేటి క్రీడల్లో అలవోకగా బంగారు పతకాలు సాధించిన నీరజ్ 2022 ప్రపంచ అథ్లెటిక్స్ మీట్‌లో సైతం సత్తా చాటాడు. ప్రపంచ అత్యుత్తమ ప్రత్యర్థులను ఓడించడం ద్వారా రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఈ అనితర సాధ్యమైన రికార్డును తన పేరుతో లిఖించుకున్నాడు.

ప్రపంచ అథ్లెటిక్స్ పోటీలలో ఏదో ఒక పతకం సాధించాలన్న నీరజ్ చోప్రా కల మూడో ప్రయత్నంలో నెరవేరింది. లండన్ వేదికగా జరిగిన 2017 ప్రపంచ అథ్లెటిక్స్ మీట్ తొలి రౌండ్లోనే విఫలమైన నీరజ్.. ఆ తర్వాత రెండేళ్లకు జరిగిన 2019 పోటీలకు గాయంతో దూరమయ్యాడు. 2022 ప్రపంచ అథ్లెటిక్స్ పోటీల బరిలో భారీ అంచనాల నడుమ నిలిచి, రజతం సాధించాడు. గ్రూప్-ఏ అర్హత పోటీల తొలి రౌండ్ తొలి ప్రయత్నంలోనే నీరజ్ మొత్తం 88.39 మీటర్ల దూరం విసరడం ద్వారా నేరుగా ఫైనల్లో అడుగుపెట్టాడు. ఫైనల్ రౌండ్‌కు అర్హతగా 83. 50 మీటర్ల లక్ష్యాన్ని నిర్దేశిస్తే.. నీరజ్ మాత్రం తన తొలి ప్రయత్నంలోనే 88.39 మీటర్ల రికార్డుతో గ్రూప్-ఏ టాపర్‌గా నిలిచాడు. మొత్తం 11మంది ప్రపంచ అత్యుత్తమ అథ్లెట్ల నడుమ జరిగిన పతకం పోరులో నీరజ్ తొలి ప్రయత్నంలో విఫలమైనా రెండో ప్రయత్నంలో 82.39 మీటర్ల రికార్డు నమోదు చేశాడు. మూడో ప్రయత్నంలో 86.73 మీటర్లతో మెరుగు పరచుకున్నాడు. నాలుగో అవకాశం ద్వారా 88. 13 మీటర్ల రికార్డుతో రెండో స్థానంలో నిలిచాడు. ఆఖరి రెండు అవకాశాలను నీరజ్ సద్వినియోగం చేసుకోడంలో విఫలమైనా రజత పతకం ఖాయం చేసుకోగలిగాడు. గ్రెనెడాకు చెందిన యాండర్సన్ పీటర్స్ 90.54 మీటర్ల రికార్డుతో బంగారు పతకం సాధించాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాకోబ్ వాల్డ్‌చెక్ 88.099 మీటర్ల రికార్డుతో కాంస్య పతకం అందుకున్నాడు.




క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్


### ఒకే ఒక్కడు

ప్రపంచ అథ్లెటిక్స్ చరిత్రలో పురుషుల జావలిన్ త్రోలో రజత పతకం సాధించిన భారత తొలిక్రీడాకారునిగా, రెండో అథ్లెట్‌గా నీరజ్ రికార్డుల్లో చోటు సంపాదించాడు. 2003 ప్రపంచ ట్రాక్ అండ్ ఫీల్డ్ మీట్ మహిళల లాంగ్ జంప్ విభాగంలో అంజుబాబీ జార్జ్ కాంస్య పతకం సాధించిన 19 సంవత్సరాల విరామం తర్వాత నీరజ్ రజత పతకం సంపాదించాడు. టోక్యో ఒలింపిక్స్‌లో కేవలం 87.58 మీటర్ల రికార్డుతోనే బంగారు పతకం అందుకొన్న నీరజ్.. 2022 ప్రపంచ మీట్‌లో 88.13 మీటర్ల రికార్డు నమోదు చేసినా రజత పతకం మాత్రమే దక్కింది.

### రికార్డులే రికార్డులు

హర్యాణాలోని పానిపట్ జిల్లా, ఖాంద్రా గ్రామంలో జన్మించిన నీరజ్ చోప్రాది రైతు కుటుంబం. బాల్యంలో నీరజ్‌కు క్రికెట్ అంటే మహాపిచ్చి. 11 ఏళ్ల వయసులో జావెలిన్ త్రో పట్ల ఆసక్తి ఏర్పరచుకొన్నాడు. పానిపట్ స్టేడియంలో జైవీర్ అనే అథ్లెట్.. జావెలిన్ ప్రాక్టీస్ చేస్తుంటే చూసి నీరజ్‌కు కూడా జావెలిన్ నేర్చుకోవాలనే కుతూహలం ఏర్పడింది. పంచ్‌కులలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా స్పోర్ట్స్ హాస్టల్‌లో ఉండి జావెలిన్‌లో శిక్షణ తీసుకున్నాడు. ప్రస్తుతం నీరజ్ భారత సైనిక దళాలలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీవో)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 2016లో జరిగిన ప్రపంచ జూనియర్ అథ్లెటిక్స్ అండర్-19 విభాగంలో విజేతగా నిలిచిన నీరజ్ ఆ తర్వాత ఆసియాక్రీడలు, కామన్వెల్త్ క్రీడలు, ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు అందుకున్నాడు. ప్రపంచ సీనియర్ పోటీలలో సైతం పతకం సాధించడం ద్వారా ప్రపంచ అత్యుత్తమ జావలిన్ త్రో క్రీడాకారులలో ఒకడిగా నిలిచాడు. స్వతంత్ర భారత ఒలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో భారత్‌కు పతకం మాత్రమే కాదు, తొలి బంగారు పతకం, ప్రపంచ పోటీలలో రజతం అందించిన మొనగాడిగా నీరజ్ చరిత్రలో నిలిచిపోతాడు. 1900 పారిస్ ఒలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో నార్మన్ ప్రిట్‌చార్డ్ భారత్‌కు రెండు రజత పతకాలు అందిస్తే.. ఆ తర్వాత 100 సంవత్సరాలకు గానీ నీరజ్‌చోప్రా రూపంలో మరో భారత అథ్లెట్ పతకం సాధించలేకపోయాడు.

బర్మింగ్ హామ్ వేదికగా జూలై 28 నుంచి ప్రారంభం కానున్న 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో సైతం నీరజ్ స్వర్ణపతకం సాధించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 24 ఏళ్ల చిరుప్రాయానికే ఇన్ని ఘనతలు సాధించిన నీరజ్ రానున్న కాలంలో మరిన్ని అబ్బురపరచే విజయాలతో తన రికార్డులను తానే అధిగమించాలని కోరుకుందాం. ★

# వరద బాధితులకు అండగా..



**మంచిర్యాల :** జులై 12న గోదావరి ఉప్పొంగి పక్కనే ఉన్న మంచిర్యాలలోని ఎన్టీఆర్ నగర్, రామ్‌నగర్ సహా 7 కాలనీలు వరదనీటిలో మునిగిపోయాయి. చాలా ఇళ్లు నేలమట్టం అయ్యాయి. కోటపల్లి, దండెపల్లి మండలాల్లో 17 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద బాధితులకు ఆర్‌ఎస్‌ఎస్, ఏకలవ్య ఆశ్రమం (సేవాభారతి), మాధవ సేవాసమితి, లలితా సేవాసమితి ఆధ్వర్యంలో ఆహారం అందించారు. బాధిత కుటుంబాలను గుర్తించి బియ్యంతో సహా నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో వరద బాధితుల సహాయ కార్యక్రమ ప్రముఖ్ కొమ్మెర విశ్వశర్మ, కరినగర్ విభాగ్ ప్రచారక్ దేవేందర్, విభాగ్ సహ సేవాప్రముఖ్ రామాచారి, జిల్లా కార్యవాహ కృష్ణభాస్కర్ పాల్గొన్నారు. ★



# వినియోగదారులను చైతన్య పరచడమే లక్ష్యం

**భాగ్యనగరం :** వినియోగదారుల హక్కులకు భంగం కలగకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదని, దేశ ప్రగతిలో వినియోగదారుడిదే ప్రధాన భూమిక అని అఖిల భారతీయ గ్రాహక్ పంచాయత్ దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి నడిగి దత్తాత్రేయ అన్నారు. ఇటీవల భాగ్యనగర్‌లోని కేశవ నిలయంలో రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

దేశవ్యాప్తంగా వినియోగదారుల హక్కులకోసం నిరంతరం పనిచేస్తున్న సంస్థ గ్రాహక్ పంచాయత్ అని, అమ్మకాల్లో జరుగుతున్న మోసాలపై వినియోగ దారులను మేల్కొలిపి, వారిని చైతన్యవంతుల్ని చేయడమే తమ సంస్థ ప్రధాన కర్తవ్యమని తెలిపారు. ఆన్‌లైన్ గేమ్‌ల ద్వారా కొన్ని సంస్థలు కోట్ల రూపాయలు అక్రమంగా దోచుకోవడం, ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ వేదికగా జరుగుతున్న మోసాలపై.. ఇంకా అనేక విషయాలపై వినియోగదారుల్ని జాగృతపరిచి, వారి హక్కులను కాపాడడంలో గ్రాహక్ పంచాయత్ ముందున్నదని కొనియాడారు.

తమ కార్యకర్తల ద్వారా వినియోగదారుల హక్కుల గురించి అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా అనేక సెమినార్లు నిర్వహిస్తున్నామని, వినియోగదారులు ఎదుర్కొన్న మోసాలపై అధికారులకు ఫిర్యాదులు కూడా చేస్తున్నామని దత్తాత్రేయ తెలిపారు. అనంతరం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ గ్రాహక్ పంచాయత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బండి నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్ శ్రీ వాత్సవ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంబు లక్ష్మణ స్వామి, కోశాధికారి మాణిక్ రావు, సంయుక్త కార్యదర్శి నెమలికంటి విజయ్ పాల్గొన్నారు. కార్యవర్గ సభ్యులుగా దూపాటి మట్టయ్య, కోటిరెడ్డి, ప్రద్యుమ్న, సుష్మాలను నియమించారు. ★



# ‘మేమున్నాం’

**మంచిర్యాల :** ఇటీవల కురిసిన భారీవర్షాల వల్ల అనేక మంది వరదల్లో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంతమంది పీకల్లోతు వరద నీటిలో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. ఈ నేపథ్యంలో వారిని రక్షించేందుకు ‘మేమున్నాం’ అంటూ ముందుకు వచ్చారు విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ కార్యకర్తలు డాక్టర్ శశికిరణ్ (వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి), వోలె రాకేష్, పదం రవీందర్ (బజరంగ్ దళ్ కార్యకర్తలు).

వీరు రెండు రోజులు శ్రమించి, 15 నుంచి 20 అడుగుల లోతు నీళ్లలో తాడు, లైఫ్ జాకెట్స్, ఫ్లోటింగ్ రింగ్స్ తీసుకువెళ్లి శరణార్థులకు బిగించి, వారికి ధైర్యం చెప్పి, సురక్షితంగా వారిని ఒడ్డుకు తీసుకొచ్చారు.



విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వరదల్లో చిక్కుకున్న సుమారు 60 మందిని రక్షించారు. ★



నిత్యావసరాల పంపిణీ అనంతరం బాధితులతో మాట్లాడుతున్న కార్యకర్తలు

# 'సేవా' భారతి



జూలై 10 నుండి తెలంగాణలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా గోదావరి పరీవాహక ప్రాంతాలైన.. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు పరిధిలోని గ్రామాలు, కరినగర్, మంచిర్యాల, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని వందలాది గ్రామాలు నీట మునిగాయి. వేలాది ఇళ్లు దెబ్బతిన్నాయి. అక్కడి జనజీవనం అస్తవ్యస్తమైంది.

భారీ వర్షాల నేపథ్యంలో సేవాభారతి తెలంగాణ శాఖ స్పందించి బాధితులకు తాత్కాలికంగా తాగునీరు, భోజనం, చిన్నపిల్లలకు పాలు అందించింది. వారికి అనేక చోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో పునరావాసం ఏర్పాటుచేసారు. వరద తగ్గిన తర్వాత తమ తమ గ్రామాలకెళ్లి బురదతో నిండిన ఇళ్లను శుభ్రం చేసుకోవడానికి కావలసిన సామాగ్రితో బాటు అంటువ్యాధులు రాకుండా ఉండేందుకు ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ సరఫరా చేసారు.

అంతేకాదు, వరదకు గురైన 5 జిల్లాల్లోని 591 గ్రామాలను సర్వే చేసి సుమారు 10 వేల కుటుంబాలకు 15 రోజులకు సరిపడా ఆహార ధాన్యాలు, నిత్యావసర వస్తువులను అందించారు. ఈ కార్యక్రమం చెన్నూరు, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, మహదేవ్‌పూర్, వెంకటాపురం, భద్రాచలం, చర్ల, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు కేంద్రంగా జరిగింది. ఈ కేంద్రాల్లో 60 మంది సేవాభారతి కార్యకర్తలు 12 రోజులు పూర్తి సమయం పనిచేసారు.

దుప్పట్లు, చీరలు, వంటపాత్రలు, బకెట్లు కూడా అందించారు. ఆయా గ్రామాలలో ప్రాథమిక చికిత్స నిమిత్తం మందులు అందుబాటులో ఉంచారు.

భాగ్యనగర్, వరంగల్ కేంద్రాల నుండి రేషన్ కిట్స్ సేకరించి పంపారు. స్వచ్ఛంద సంస్థలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సహకారంతో ఇప్పటివరకు రూ. 1 కోటి 50 లక్షల విలువగల సరుకులు వరద బాధితులకు సేవాభారతి అందించింది.

వరదల అనంతరం అంటు వ్యాధులు ప్రబలకుండా కనీసం వారం నుండి 10 రోజుల పాటు వారికి వైద్య సేవ అందించడానికి వైద్య బృందాలను ఆయా ప్రాంతాలకు సేవాభారతి పంపనుంది. ★



నిత్యావసరాల కిట్‌ను సిద్ధం చేస్తున్న కార్యకర్తలు

# బాల జాగృతి



## తెలుసుకుందాం

## భీమారామం

పంచారామాల్లో ఒకటైన భీమారామం.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. చాళుక్య భీముడు ఈ ఆలయ ప్రాకారాలను, గోపురాన్ని నిర్మించడం వల్ల భీమారామం అనే పేరు వచ్చింది. ఇక్కడి శివలింగాన్ని చంద్రుడు ప్రతిష్ఠించాడు. అందువల్ల దీనిని సోమేశ్వరం అని పిలుస్తున్నారు. శ్వేతవర్ణంలో కనిపించే ఇక్కడి శివలింగం క్రమంగా అమావాస్య వచ్చేసరికి బూడిద లేదా గోధుమ రంగులోకి మారిపోతుంది. తిరిగి పౌర్ణమి వచ్చేసరికి శ్వేతవర్ణంలో కనిపిస్తుంది. ఇది ఇక్కడి ప్రత్యేకత. ఏటా కార్తికమాసంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.



## కథ | ఆవేశం పనికిరాదు

వందనగిరి రాజ్యాన్ని ప్రవీణుడు అనే రాజు పరిపాలిస్తుండేవాడు.

రాజు మంచివాడే. కానీ కోపం ఎక్కువ. కోపం వస్తే ముందు వెనుక ఆలోచించేవాడు కాదు. అతను రాజు కావడంతో కోపంతో అతను చేసే ఆజ్ఞలు, విధించే శిక్షలు వెంటనే అమలైపోయేవి.

ఒకనాడు మహారాజు భోజనం చేయడానికి కూర్చున్నాడు.

రాజుకు ఎంతో నమ్మకస్తుడు, మంచివాడు, పాకశాస్త్రంలో ఆరితేరినవాడు అయిన ధర్మయ్య అతని వద్ద వంటవానిగా ఉండేవాడు.

ఆరోజు ధర్మయ్య వంట పనంతా పూర్తిచేసి కుమారునికి అనారోగ్యంగా ఉండటంతో వైద్యుని వద్దకు తీసుకువెళుతూ మహారాజుకు వడ్డించే బాధ్యతను మరొక వ్యక్తికి అప్పగించాడు. ఆ వ్యక్తి వడ్డించాడు.

రాజు కూర నోట్లో పెట్టుకోగానే కారం ఎక్కువై నాలుక చర్రున మండింది. దాంతో ఆగ్రహించిన రాజు 'వంట చేసింది ఎవరు?' అని ప్రశ్నించాడు.

'ధర్మయ్య' అని అతను చెప్పాడు. రాజు వెంటనే.. నేరస్థులకు శిక్ష అమలుచేసే అధికారిని పిలిచి 'ధర్మయ్యను బంధించండి, ఎల్లుండి తెల్లవారే సరికి అతనికి ఉరిశిక్ష విధించండి' అని ఆజ్ఞ జారీ చేశాడు.

ధర్మయ్యను బంధించి కారాగారంలో వేశారు.

మరుసటి రోజు ప్రవీణుడు సభలో కొలువు తీరి ఉండగా తను ఒకసారి రాజును కలుసుకోవాలని ధర్మయ్య భటులను కోరాడు.

రాజు అంగీకరించడంతో భటులు అతనిని సభ వద్దకు తీసుకువచ్చారు. 'చనిపోయే వ్యక్తి ఆఖరి కోరిక తీరుస్తారు కదా! నాకు ఒక విల్లు, బాణం కావాలి' అని ధర్మయ్య అడిగాడు.



## పద్యం

**అసువినాశమైన నానంద సుఖకేళి**
**సత్యనిష్ఠపరుని సంతరించు**
**సత్యనిష్ఠజూడ సజ్జన భావంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ**

**భావం :** సత్యనిష్ఠ గల వ్యక్తి తన ప్రాణాలు పోగొట్టుకోవడానికైనా ఆనందంగా సిద్ధపడతాడు గానీ, అసత్యమాడటానికి మాత్రం అంగీకరించడు. అటువంటి సత్యవంతుడే సజ్జనుడు, పూజ్యుడు, చిరస్మరణీయుడు.

## శ్లోకం

**వృద్ధానాం వచనం శ్రుత్వా యోऽ**
**భ్యుత్థానం ప్రయోజయేత్।**
**ఉత్థానస్య ఫలం సమ్యక్ తదా**
**స లభతేऽ చిరాత్॥**

**భావం :** వయసులో, జ్ఞానంలో వృద్ధులైన వారి మాట విని పని చేసే వారికి తక్కువ సమయంలోనే మంచి ఫలితం కలుగుతుంది.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| వివేక వర్ధిని | బాలగంగాధర్ తిలక్ |
| హరిజన్ | సురవరం ప్రతాపరెడ్డి |
| కేసరి | కందుకూరి వీరేశలింగం |
| గోల్కొండ | కాశీనాథుని నాగేశ్వరరావు |
| ఆంధ్రప్రతిక | గాంధీజీ |

సమాధానాలు : వివేక వర్ధిని–కందుకూరి వీరేశలింగం; హరిజన్–గాంధీజీ; కేసరి–బాలగంగాధర్ తిలక్; గోల్కొండ–సురవరం ప్రతాపరెడ్డి; ఆంధ్రప్రతిక–కాశీనాథుని నాగేశ్వరరావు.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### పండితారాధ్యుల మల్లికార్జునశర్మ



ప్రముఖ స్వాతంత్ర్య ఉద్యమకారుడు. గుంటూరు జిల్లా తెనాలి మండలం ఈమని గ్రామంలో 1910లో జన్మించారు. తల్లిదండ్రులు వీరభద్రయ్య, లింగమాంబ. 1931-32 మధ్య ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని రాజమండ్రి, రాయవేలూరు జైళ్లలో శిక్ష అనుభవించారు. జైలు నుండి తిరిగివచ్చిన తర్వాత కూడా బ్రిటిష్ అధికారులకు ఏమాత్రం భయపడకుండా నెత్తిన ఖద్దరు మూటతో ఊరూరా తిరుగుతూ ఖద్దరు అమ్మారు. అక్టోబర్ 9, 1950న మరణించారు.



భటుడు అవి తెచ్చి ఇవ్వగానే ధర్మయ్య రాజు మీదకి బాణం ఎక్కుపెట్టాడు. వెంటనే భటులు ఆయన్ని అడ్డుకొని చేతులకు సంకెళ్లు వేశారు.

'మహారాజా! వంటలో కారం ఎక్కువైనందుకే నన్ను ఉరి తీయించారనే కళంకం మీకు రాకూడదు. అందుకే ఇలా చేశాను. ఇక నన్ను ఉరి తీయండి' అని అన్నాడు ధర్మయ్య.

రాజు తన తప్పు తెలుసుకున్నాడు. అప్పటినుంచి ఆవేశాన్ని అదుపులో పెట్టుకుంటూ రాజ్యపాలన సాగించాడు. ధర్మయ్యను తన ఆంతరంగికునిగా నియమించుకున్నాడు. ★

## జనరల్ నాలెడ్జ్

1. భారత రాష్ట్రపతిగా ఎన్నికైన ద్రౌపదీ ముర్ము ఏ రాష్ట్రం?
2. తమిళనాడు ముఖ్యమంత్రి ఎవరు?
3. జపాన్ దేశ కరెన్సీ ఏది?

సమాధానాలు : 1. ఒడిశా; 2. ఎం.కె. స్టాలిన్; 3. ఎన్

## మెదడుకు మేత



ఎంత దూరం నెడితే..
అంత దగ్గర అవుతుంది?

జవాబు : ఊయల

## మంచిమాట




**తన వృత్తిని పవిత్రంగా, గౌరవంగా భావించే వ్యక్తి ఒక్కక్షణం కూడా సోమరిగా ఉండలేడు.**




# వారఫలాలు

01-07 ఆగస్ట్ 2022



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

రాబడికి ఇబ్బంది లేకుండా గడిచిపోతుంది. ముఖ్య కార్యక్రమాలలో చికాకులు తొలగుతాయి. భూ వివాదాల నుంచి గట్టెక్కుతారు. వాహనాలు, ఆభరణాలు సమకూర్చుకుంటారు. ఉద్యోగులు విధి నిర్వహణలో సత్తా చాటుకుంటారు. 1, 2 తేదీల్లో కుటుంబంలో ఒత్తిడులు. ప్రయాణాలు. శ్రీరామ రక్షా స్తోత్రాలు పఠించండి.

**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

అనుకున్న ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. ముఖ్య కార్యక్రమాల్లో విజయం సాధిస్తారు. ఇంటి నిర్మాణ యత్నాలు కలసివస్తాయి. ఒక సంఘటన ఆకట్టుకుంటుంది. కష్టానికి తగిన ఫలితముంటుంది. ఉద్యోగులకు పనిభారం తగ్గుతుంది. క్రీడాకారులు, రచయితలకు అంచనాలు నిజమవుతాయి. 2, 3 తేదీల్లో మానసిక ఆందోళన. వృథా ఖర్చులు. దేవీస్తోత్రాలు పఠించండి.

**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

వ్యూహాత్మకంగా ముఖ్య కార్యక్రమాలు చక్కదిద్దుతారు. ఆదాయం మెరుగ్గా ఉంటుంది. నిరుద్యోగులకు శుభవార్తలు. వ్యాపారులు లాభాలు సాధిస్తారు. దైవకార్యాలలో పాల్గొంటారు. కొత్త పెట్టుబడులు సమకూరుతాయి. ఉద్యోగులకు విధుల్లో పురోగతి. క్రీడాకారులు సత్తా చాటుకుంటారు. 4,5 తేదీల్లో సోదరులతో కలహాలు. ఆరోగ్య సమస్యలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

కొన్ని కార్యక్రమాలు మందకొడిగానే సాగుతాయి. నిర్ణయాలలో ఆచితూచి వ్యవహరించండి. ఆకస్మిక ప్రయాణాలు ఉండవచ్చు. కుటుంబంలో ఒత్తిడులు. శారీరక రుగ్మతలు. ఉద్యోగులకు హఠాత్తుగా మార్పులు జరుగుతాయి. రాజకీయ, పారిశ్రామికవేత్తలకు పర్యటనలు వాయిదా. పరిశోధనలు, క్రీడాకారులకు ఒడిదుడుకులు. 3,4 తేదీల్లో శుభవార్తలు, వాహనాలు కొనుగోలు చేస్తారు. ఆంజనేయ దండకం పఠించండి.

**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

దీర్ఘకాలిక రుణబాధలు తొలగుతాయి. ఏ పని చేపట్టినా విజయమే. భూములు, వాహనాలు కొంటారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు సమర్థతతో విధులు చక్కబెడతారు. పారిశ్రామిక, రాజకీయవేత్తలకు సంతోషకర సమాచారం. పరిశోధకులు, రచయితలకు ఒత్తిడులు తొలగుతాయి. 6,7 తేదీల్లో దూరప్రయాణాలు. కుటుంబంలో సమస్యలు. శ్రీకృష్ణ స్తోత్రాలు పఠించండి.

**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

కొన్ని ఇబ్బందులు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో అధిగమిస్తారు. రాబడి అవసరాలకు తగినంతగా దక్కుతుంది. భూములు, వాహనాలు కొంటారు. వ్యాపారులకు లాభాలు. రాజకీయవర్గాలు, పరిశోధకుల యత్నాలలో పురోగతి కనిపిస్తుంది. రచయితలు, క్రీడాకారులు చేజారిన అవకాశాలు తిరిగి దక్కించుకుంటారు. 1,2 తేదీల్లో బంధు విరోధాలు. ఆకస్మిక ప్రయాణాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

నిరుద్యోగులకు ఒక ప్రకటన ఉత్సాహాన్నిస్తుంది. ఆకస్మిక ధనలాభం. వ్యాపారుల శ్రమ ఫలిస్తుంది. ఉద్యోగులకు విధి నిర్వహణ ప్రశాంత వాతావరణంలో గడుస్తుంది. రాజకీయవేత్తలకు ఒక సమాచారం ఊరటనిస్తుంది. క్రీడాకారులు, వైద్యులకు శుభవార్తలు. 6, 7 తేదీల్లో అనుకోని ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు ఉండవచ్చు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆదాయం గతం కంటే మెరుగ్గా ఉండి అప్పులు తీరతాయి. బంధువుల ద్వారా ధనలాభ సూచనలు. వాహనయోగం. వ్యాపారులు ఆశించిన లాభాలు అందుకుంటారు. కొత్త వ్యక్తులతో పరిచయం. ఉద్యోగులు విధుల్లో ఆటంకాలు అధిగమిస్తారు. రాజకీయవేత్తలకు విశేష గుర్తింపు. 4,5 తేదీల్లో స్నేహితులతో కలహాలు. కుటుంబంలో ఒత్తిడులు. ఆదిత్య హృదయం పఠించండి.

**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

అప్రయత్న కార్యసిద్ధి. ఆదాయం ఆశించినంతగా ఉంటుంది. దీర్ఘకాలిక సమస్యల నుంచి గట్టెక్కుతారు. ఇంటి నిర్మాణయత్నాలు కార్యరూపం దాలుస్తాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు అనుకున్న విజయాలు సాధిస్తారు. రచయితలు కొత్త ఆశలతో ముందడుగు వేస్తారు. 2,3 తేదీల్లో అనారోగ్యం. స్నేహితులతో తగాదాలు. హయగ్రీవ స్తోత్రాలు పఠించండి.

**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

కొన్ని వివాదాలు పరిష్కారమవుతాయి. చేపట్టిన కార్యక్రమాలు దిగ్విజయంగా సాగుతాయి. శత్రువులు కూడా స్నేహితులుగా మారి సహకరిస్తారు. రాబడి, ఖర్చులు సమానంగా ఉంటాయి. విచిత్రమైన సంఘటనలు ఎదురవుతాయి. వ్యాపారులకు కొద్దిపాటి లాభాలు. రాజకీయవేత్తలకు కొత్త పదవులు రావచ్చు. 2,3 తేదీల్లో మానసిక ఆందోళన. ఆస్తి వివాదాలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

పనులు సమయానికి పూర్తి చేస్తారు. రాబడి సంతృప్తినిస్తుంది. కొన్ని సమస్యలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. స్వల్ప శారీరక రుగ్మతలు ఇబ్బంది పెట్టవచ్చు. వాహనాలు, ఇళ్లు కొనుగోలు యత్నాలు కలసివస్తాయి. ఉద్యోగులకు ఉన్నత స్థితి దక్కుతుంది. పారిశ్రామిక, రాజకీయవేత్తల శ్రమ ఫలిస్తుంది. 4,5 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. ఒత్తిళ్లు. కుటుంబ సమస్యలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ముఖ్యమైన కార్యక్రమాలలో స్వల్ప ఆటంకాలు. ఆలోచనలు అమలు చేస్తారు. శుభకార్యాలకు ప్రణాళికలు రూపొందిస్తారు. ఆదాయం సంతృప్తినిస్తుంది. అప్పులు తీరి ఊరట చెందుతారు. ఇంటి నిర్మాణ యత్నాలు సానుకూలం. పారిశ్రామిక, రాజకీయ వర్గాలకు విశేష ఆదరణ. వైద్యులు, శాస్త్రవేత్తలు సత్తా చాటుతారు. 5,6 తేదీల్లో బంధువులతో విభేదాలు. నవగ్రహ స్తోత్రాలు పఠించండి. ★

# పదరసం-377

## ఆధారాలు

**అడ్డం**

1. స్వాతంత్ర్యం నా జన్మ హక్కు అన్న తిలక్ బిరుదు (4)
3. ఆవు, ఎద్దు మొదలైన తెల్ల జంతువు (4)
6. కృషీవలుడు (2)
8. కొత్తది కాదంటే మరి...! (3)
9. అటుగా తెలంగాణ తూగుటూయల (3)
11. గుర్రం నడిపేవాడు (2)
12. జమ్మిచెట్టు (4)
13. ఒక నక్షత్రం పేరిట వారపత్రిక (2)
14. అటుగా మువ్వలు మధ్యలో వత్తిడి కోల్పోయాయి (3)
16. కాముకుడు (2)
19. కొద్ది దానికే ఆశపడు గుణము అసహ్యము (2)
21. చేతిగుడ్డ (3)
22. ముఖము (2)
24. ఏడిస్ ఈజిప్టై అనే దోమకాటు వల్ల వచ్చే జ్వరం (2)
25. అటుగా లక్ష్మిని పిలవండి (2)
26. నాగమాత (3)
27. అటుగా తీగ (3)
29. సరస్వతి (2)
31. ఏనుగు (3)
32. మన నవీన భారత రాష్ట్రపతి (5)

**నిలువు :**

1. ఆనుపానులు, గుట్టులు, వివరములు (5)
2. జన్మభూమి (5)
4. మంగళవాద్యం ఇది (3)
5. కబళము చెండు! –ఒక పువ్వు (4)
7. కామధేనువులా కోరికలు తీర్చేది (4)
10. హనుమాన్ చాలీసా ఈ తులసీదాసు రచనే..! (3)
15. శ్రావణ మాసపు స్త్రీల విశేష నోము (6)
16. వాయసము (2)
17. శ్రీ వేంకటేశ్వరుని దివ్య క్షేత్రం (4)
18. టాటా వారి ఓ వాహనం (2)
20. విశ్వకవి రవీంద్రనాథ్... (3)
23. అడుగు నుంచి పొలము (నాలుగు కుంచాల విత్తులు విత్తదగినది) (4)
28. రాత్రి, మీ యొక్క (2)
30. సర్పము (2)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | | 2 | | ✠ | 3 | 4 | | 5 |
| 6 | | ✠ | | ✠ | 7 | ✠ | | ✠ | |
| ✠ | 8 | | | ✠ | | ✠ | 9 | 10 | |
| 11 | | ✠ | 12 | | | | ✠ | 13 | |
| ✠ | 14 | 15 | | ✠ | | ✠ | 16 | | ✠ |
| 17 | ✠ | | ✠ | 18 | ✠ | 19 | | ✠ | 20 |
| 21 | | | ✠ | 22 | 23 | ✠ | ✠ | 24 | |
| | ✠ | 25 | | ✠ | 26 | | | ✠ | |
| 27 | 28 | | ✠ | 29 | | ✠ | ✠ | 30 | ✠ |
| ✠ | 31 | | | ✠ | 32 | | | | |

పదరసం – 377

పేరు : ..........................................................................

చిరునామా:..........................................................................

..........................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2022 ఆగస్టు 15 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 373 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 తొ | లి | 2 ఏ | కా | 3 ద | శి | 4 కి | ✠ | 5 మ |
| 6 వే | డి | ✠ | కు | ✠ | మ్ము | ✠ | 7 టు | 8 మా | రో |
| 9 మ | మ | 10 త | లు | ✠ | ✠ | 11 అం | కు | ర | ము |
| న | ✠ | ల | ✠ | 12 ప్ర | 13 యో | గం | ✠ | కం | ✠ |
| ✠ | 14 వ | పు | వు | ✠ | ష | ✠ | 15 ధ | ✠ | 16 వ |
| 17 అ | ✠ | లు | ✠ | 18 వి | ✠ | 19 పు | న | ర్వ | సు |
| 20 త | న్వి | ✠ | 21 స | మా | ధా | న | ము | ✠ | వు |
| డు | ✠ | 22 ప్ర | తి | న | ✠ | క | ✠ | 23 త | ✠ |
| 24 ఆ | గు | మా | ✠ | 25 ము | 26 ని | ✠ | 27 గో | విం | 28 దా |
| మె | ✠ | 29 దం | డ | ✠ | 30 జం | తు | వు | ✠ | రి |

**విజేతలు:** కె.వి.రమణమూర్తి, బి.ఇందుశేఖర్, టి.రామ ప్రకాష్–హైదరాబాద్, సి. హెచ్.నాగేందర్‌రెడ్డి–మేడ్చల్, బి.అంజయ్య–ఆమనగల్లు, వి.రామలింగాచారి, టి.పల్లవి–యాదాద్రి, ఎన్.వి.ఎస్.శర్మ–కోనసీమ, పి.సీతామహాలక్ష్మి–చిత్తూరు, ఆర్.శేషు–తూర్పు గోదావరి, సి.హెచ్.వి.చక్రపాణి–గుంటూరు, వి.విహాన్, వి.సరస్వతి–కాకినాడ, ఎన్.రాజు–కర్నూలు, ఎన్.పూర్ణకుమారి, ఎస్.పృథ్విసాయి–ఒంగోలు, కె.సత్యనారాయణ–విశాఖపట్నం, ఎస్.కృష్ణమూర్తి–బెంగుళూరు, కె.నరసింహస్వామి–భువనేశ్వర్.

**బహుమతి పొందిన విజేత:**

**బి.అంజయ్య-ఆమనగల్లు.**




మనిషి సంఘజీవి. సాధించే ఏ విజయం కూడా వ్యక్తిగతం కాదు. అది గ్రహించిన వాళ్లు తమ జీవన ప్రయాణంలో నడకలు నేర్పిన దారులకు కృతజ్ఞతలు చెప్పుకుంటారు. అయితే అది ఎప్పుడు? ఎలా? ఏ పరిస్థితిలో? అన్నదే భిన్నంగా ఉంటుంది. ఇదే అంశం మీద నాగచైతన్య కథానాయకుడిగా, విక్రమ్ కుమార్ దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన సినిమా 'థ్యాంక్యూ'.

# నడకలు నేర్పిన దారులకు 'థ్యాంక్యూ'

అభిరామ్ (నాగ చైతన్య) ఉద్యోగ నిమిత్తం అమెరికాకు వెళతాడు. అక్కడ జాబ్ కన్సల్టెంట్ రావ్ (ప్రకాశ్‌రాజ్) అతనికి సాయం చేస్తాడు. రావ్ కూతురులాంటి ప్రియ (రాశిఖన్నా)తో అభికి పరిచయం అవుతుంది. జాబ్ చేయడంపై అభికి ఆసక్తి లేకపోవడంతో ప్రియా ఆర్థిక సాయంతో ఓ యాప్‌ను డెవలప్ చేస్తాడు. దాంతో అతని జీవితమే మారిపోతుంది. అభిని ఇష్టపడిన ప్రియ అతనితో లివ్ ఇన్ రిలేషన్‌షిప్ ప్రారంభిస్తుంది. మిత్రుల సహకారంతో అభి మల్టీ మిలియనీర్ అయిపోతాడు. అక్కడి నుండి అతనిలో స్వార్థం పెరిగిపోతుంది. ఈ విజయం కేవలం తన ఒక్కడి కష్టం కారణంగానే లభించిందనే భావనకు లోనవుతాడు. నా అనుకునే వాళ్లందరినీ దూరం చేసుకుంటాడు. తనకు సాయం చేసిన రావ్ పట్ల కూడా అమానుషంగా ప్రవర్తిస్తాడు. అభిలోని ఈ మార్పును తట్టుకోలేక ప్రియా అతన్ని వదిలి దూరంగా వెళ్లిపోతుంది. అప్పుడు అభిలోని అంతరాత్మ నిద్రలేస్తుంది. అతని జీవనయానం ఎంతోమంది సాయంతోనే ఇవాళ ఈ స్థితికి వచ్చిన విషయాన్ని గుర్తుచేస్తుంది. దాంతో కనువిప్పు కలిగిన అభి.. నడకలు నేర్పిన దారులను, సాయంచేసిన చేతులను వెతుక్కుంటూ ఇండియాకు బయలు దేరతాడు. ఆ ప్రయాణంలో అతనికి ఎదురైన అనుభవాలు ఏమిటీ అనేది మిగతా సినిమా.


'థ్యాంక్యూ' మూవీని చూస్తుంటే మనకు ఆ మధ్య వచ్చిన 'నా ఆటోగ్రాఫ్ స్వీట్ మెమొరీస్' గుర్తొస్తుంది. జీవితంలో ఓ స్థాయికి చేరుకున్న వ్యక్తి తన పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, అప్పటి వ్యక్తులను కలుసుకునే నేపథ్యంలో తీసిన ఆ సినిమా తమిళంలో మంచి విజయం సాధించినా తెలుగులో మాత్రం ఆడలేదు. నిజానికి ఇలాంటి సున్నితమైన అంశాన్ని తెరకెక్కించడం కత్తిమీద సాములాంటిది. ప్రేక్షకులు ఏమాత్రం దానితో కనెక్ట్ కాలేకపోయినా, సినిమా పరాజయం కావడం ఖాయం. ఎంచుకున్న అంశం గొప్పదే అయినా దాన్ని తెరకెక్కించడంలో తడబడితే ఇక ఇంతే సంగతులు. ఈ సినిమా విషయంలోనూ అదే జరిగింది.

బీవీఎస్ రవి రాసిన కథ గొప్పది. ఏ వ్యక్తి అయినా తన స్వీయ ప్రతిభతో మాత్రమే ఉన్నత స్థాయికి చేరుకోలేడు. ఎంతోమంది ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ అతని విజయంలో భాగస్వాములుగా ఉంటారు. దాన్ని గుర్తించకుండా అంతా నా గొప్ప తనమే అనుకోవడంలో అర్థం లేదు. అయితే ఆ మార్పు లేదా కనువిప్పు ఎప్పుడు? ఎలా? జరిగింద న్నది ముఖ్యం. ఈ సినిమాలో ప్రియా తనను విడిచి వెళ్లిపోయిన తర్వాత, రావ్ కన్నుమూసిన తర్వాత అభిలో అంతర్మథనం జరుగుతుంది. అప్పుడు అతని అంతరాత్మ అతని జీవితంలో సంభవించిన కొన్ని సంఘటనలను గుర్తు చేసి, ఈ స్థితికి వాళ్లే కారణ మని, కృతజ్ఞతలు చెప్పుకోవడం నీ విధి అని ఆత్మ ప్రభోదం చేస్తుంది. దాంతో అతను ఇండియాకు బయలుదేరతాడు. అయితే ఈ సన్నివేశాల చిత్రీకరణ అంత బలంగా లేవు. తనను వదిలి వెళ్లిపోయిన ప్రియను, రావ్ గారి కుటుంబాన్ని ముందు కలవకుం డానే అభి ఇండియాకు బయలుదేరడంలో అర్థం లేదు. ఎక్కడ తన జీవితం మొదలైందో అక్కడి నుండి కృతజ్ఞతలు చెప్పాలని అతను అనుకోవడం కన్విన్సింగ్‌గా అనిపించదు. అభి భవిష్యత్తును ముందే అంచనా వేసి అతని ప్రేమను తిరస్కరించిన పారు (మాళవిక నాయర్) పాత్రను దర్శకుడు విక్రమ్ కుమార్ హుందాగా తీర్చిదిద్దాడు. అదే సమయంలో ఆమెతో తండ్రి యేళ్ల తరబడి మాట్లాడకుండా ఉండే సన్నివేశాలు మరీ సినిమాటిక్‌గా ఉన్నాయి. ఇక హీరోకు వైజాగ్ కాలేజీ లైఫ్‌లో శర్వ (సాయి సుశాంత్‌రెడ్డి)తో జరిగే గొడవలు మరీ రొటీన్‌గా ఉన్నాయి. ఆ ఎపిసోడ్‌లో కాస్తంత ఆసక్తిని కలిగించేది చిన్నూ (అవికా గోర్) పాత్రే. అయితే మరీ రెండు సంఘటనలనే ఎంపిక చేసుకుని, జీవితంలో అందరికీ థ్యాంక్యూ చెప్పేసినట్టు చూపించేశారు. ఇక రావ్ మరణంతో తన తప్పును తెలుసుకుని అభి, ఆయన బాటలో సాగాలనే నిర్ణయం తీసుకోవడ మనేది హృద్యంగా ఉంది. అయితే పతాక సన్నివేశంలో అభి, ప్రియా కలుసుకునే సన్నివేశాన్ని ఇంకాస్తంత ఆకట్టుకునేలా తీయాల్సింది.


నాగచైతన్య నటనలో కాస్తంత పరిణతి కనిపిం చింది. అయితే కుర్రాడిగా నటించిన సన్నివేశాలు అతని 'ప్రేమమ్' మూవీని గుర్తు చేశాయి. కాలేజీ సీన్స్ 'లవ్‌స్టోరీ' గెటప్‌ను జ్ఞప్తికి తెచ్చాయి. రాశీ ఖన్నా... చైతు కంటే పెద్దమ్మాయిలా కనిపించింది. మాళవిక నాయర్ తన పాత్రలో చక్కగా ఒదిగి పోయింది. అవికాగోర్, సాయి సుశాంత్ రెడ్డి, ప్రకాశ్ రాజ్, ఈశ్వరీరావ్, రాజేశ్వరీ నాయర్, తులసి, సంపత్ రాజ్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్, మిథున్ రాసిన సంభాషణలు బాగున్నాయి. ఈ సినిమా కథాసారాన్ని టైటిల్ సాంగ్‌లో వనమాలి చక్కగా వివరించారు. తమన్ సమకూర్చిన బాణీల కంటే నేపథ్య సంగీతం బాగుంది. పీసీ శ్రీరామ్ సినిమాటోగ్రఫీ మూవీకి హైలైట్. జీవితంలో ఉన్నత స్థితికి చేరుకున్న ప్రతి ఒక్కరూ అందుకు కారకులైన వారికి కృతజ్ఞులై ఉండాలనే చక్కని విషయాన్ని ఈ సినిమా ద్వారా చెప్పారు. అయితే దానిని ఆమోద యోగ్యంగా, ఆకట్టుకునేలా చెప్పడంలో దర్శకుడు విక్రమ్ కుమార్ విఫలమయ్యారు. ఇలాంటి సినిమా లను థియేటర్లలో కాకపోయినా, ఓటీటీలో స్ట్రీమింగ్ అయినప్పుడైనా చూసి, ఆదరిస్తే బాగుంటుంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.200/-





వెల : ₹.200/-




వెల : ₹.390/-



వెల : ₹.300/-




వెల : ₹.200/-





వెల : ₹.250/-





వెల : ₹.200/-





వెల : ₹.200/-





వెల : ₹.250/-





వెల : ₹.250/-





వెల : ₹.599/-





వెల : ₹.349/-




వెల : ₹.695/-




వెల : ₹. 799/-




వెల : ₹.50/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244


From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 74 Issue : 40


# MAHAVEER
## GROUP OF INSTITUTIONS
( AN ISO 9001-2008 CERTIFIED INSTITUTION)







Counseling Code : MHVR
**MAHAVEER**
**INSTITUTE OF SCIENCE & TECHNOLOGY**
(Approved by AICTE, Affiliated to JNTUH, Hyderabad.)
Email: mist.admissions@gmail.com | website : mist.ac.in
Estd : 2001
Courses Offered :

| | | |
|---|---|---|
| B.Tech | ECE \| EEE \| CSE \| IT \| MECH. \| CIVIL \| AERO | PG |
| M.Tech | DE & CS \| VLSI \| PE & ES \| CSE \| SE \| AMS | MBA |

Counseling Code : MHVR
**MAHAVEER**
**Institute of Science & Technology Polytechnic** (2nd Shift)
(Approved by AICTE, Affiliated to SBTET Hyderabad.)
Email: mist.admissions@gmail.com | website : mist.ac.in
Estd : 2009
Courses Offered :
Polytechnic: DECE | DEEE | DCME | DME | DCE

Counseling Code : AARM
**AAR MAHAVEER**
**ENGINEERING COLLEGE**
(Approved by AICTE, Affiliated to JNTUH, Hyderabad.)
Email: aarm.admissions@gmail.com | website : aarm.ac.in
Estd : 2010
Courses Offered :
B.Tech: ECE | EEE | CSE | MECH.

**MAHAVEER DEGREE COLLEGE**
**For Arts, Commerce & Science**
(Approved by Telangana Govt. - Affiliated to Osmania University)
Email: mdc.admissions@gmail.com | website : mahaveerdegreecollege.com
Estd : 2014
Courses Offered :
B.Com: Computers & General | B.Sc: MSCs

Sponsored by MAHAVEER EDUCATIONAL SOCIETY

**FOR NRI / MANAGEMENT SEATS**
Ph: 040-29880079, 29880086, 29880089, 29880081, 29880087
Cell : 9542001907, 9849944411
Vyasapuri, Bandlaguda, Post : Keshavgiri, Hyderabad - 500 005.